


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

దేశాన్ని ఇరకాటంలోకి నెట్టిన నరేంద్ర మోదీ సామర్థ్యం 04

02 జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకచి

ఎక్కడా కనిపించని దీపావళి ఆంక్షలు 05

సంపుటి 08, సంచిక: 320 | బుధవారం | 22-10-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## జనంలోకి రండి

- దేశాభివృద్ధిలో భాగస్వాములు కండి... తెలంగాణ పునర్నిర్మాణం కోసం విధులు నిర్వర్తించండి

**మావోయిస్టులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

- శాంతి భద్రతలు కాపాడటంలో అమరులవుతున్న పోలీసులు
- వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండ
- పోలీసు అమరుల సంస్మరణ కార్యక్రమంలో సిఎం శ్రద్ధాంజలి



ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని, ఇటీవల అనేక మంది లొంగిపోయారని. మిగతా వారు కూడా లొంగిపోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని, తెలంగాణ పునర్నిర్మాణం కోసం తమ విధులను నిర్వర్తించేందుకు జనజీవన స్రవంతిలో కలవాని సూచించారు. 2008లో ఒడిశాలో మావోయిస్టుల దాడిలో మరణించిన 33 మంది పోలీస్ కుటుంబాలకు హైదరాబాద్‌లోని గాజుల రామారంలో 200 గజాల స్థలం కేటాయించామని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గోషామహల్ పోలీసు గ్రౌండ్స్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి సిఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డిజిపి శివధర్‌కు అందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.."పోలీసు అంటే సమాజానికి నమ్మకం, భరోసా. మన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులు ఎందరో ఉన్నారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇటీవల చనిపోయిన ప్రమోద్ కుటుంబానికి అన్ని విధాలుగా సాయం చేస్తాం. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఇంటిస్థలం కేటాయిస్తున్నాం. పలు విభాగాల్లో మన పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై పోరాడేందుకు ఈగల్ పేరుతో బృందాలను నియమించాం.

### ఏమిచ్చినా మీ రుణం తీర్చుకోలేము ..

తెలంగాణ పోలీసు శాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. తెలంగాణ పోలీసు అకాడమీ, జైళ్ల శాఖ, ఎస్ఐబి, ఎసిబి,సిఐడి, విజిలెన్స్, ఆర్మ్‌డ్ రిజర్వ్, సిసిఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు మహిళా ఐపిఎస్‌ల సారథ్యం వహించడం తరువాయి 2లో



## బిజెపికి చంద్రబాబు మద్దతు ఎంతకాలం?

- మోదీ, అమిత్‌షాకు ఎపి సిఎం ఎందుకు తలవంచుతున్నారు
- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా నిలదీత
- బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తులతో ప్రమాదమని ఆందోళన

**అమరావతి :** గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి ప్రజలు పూర్తిస్థాయి మెజార్టీ ఇవ్వలేదని, అది బిజెపికి ఒక రాజకీయ పరాజయమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పునరుద్ఘాటించారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ మద్దతుతోనే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ కలిసి భారత్‌ను ఫాసిస్టు దేశంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి ప్రతికూల పార్టీ అయిన బిజెపికి చంద్రబాబు ఎంతకాలం మద్దతు ఇవ్వబోతున్నారంటూ సూటిగా ప్రశ్నించారు. మోదీ, అమిత్‌షాకు చంద్రబాబు ఎందుకు తలవంచుతున్నారని నిలదీశారు. సిపిఐ ఎపి రాష్ట్ర సమితి సమావేశం విజయవాడలోని తరువాయి 2లో

**సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శిగా**

## గుజ్జుల ఈశ్వరయ్య



సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ దాసరిభవన్‌లో మంగళవారం సిపిఐ ఎపి రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండ హాజరయ్యారు. పి.దుర్గాభవానీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా ఈశ్వరయ్య పేరును జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రతిపాదించగా... పార్టీ సీనియర్ నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు బలపర్చారు. కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య విద్యార్థి దశ నుంచి ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్‌లో తరువాయి 2లో

## ఇద్దరు పిల్లల నిబంధనకు ఆర్డినెన్స్

ముసాయిదాను 23న జరిగే కేబినెట్‌లో ఆమోదించి గవర్నరుకు పంపాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలలో ఇద్దరు పిల్లలకు మించిన వారు పోటీకి అనర్హులనే నిబంధనను ఎత్తివేసేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి 'ఆర్డినెన్స్ ముసాయిదా' ఈ నెల 23న జరిగే రాష్ట్ర మంత్రివర్గంలో ఆమోదించి, ఆ తర్వాత గవర్నర్ వద్దకు పంపించనున్నారు. ఇద్దరు పిల్లల నిబంధనను తొలగిస్తూ ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన విషయం తెలిసిందే. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లలకు మించిన వారు పోటీకి అనర్హులుగా ఉన్న తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 21(3) ను సడలించే దస్త్రాంపైన మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం సంతకం చేశారు. రాష్ట్ర మంత్రివర్గం ముసాయిదా బిల్లును గవర్నర్ వద్దకు పంపించనున్నారు. అలాగే ఇటీవల తరువాయి 2లో

## రియాజ్ ఎన్‌కౌంటర్

- కానిస్టేబుల్ గన్ లాక్కొని ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం
- ఆర్ఐ కాల్పుల్లో హతం :సిపి
- ప్రమోద్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా




ప్రజాపక్షం/నిజామాబాద్

కానిస్టేబుల్‌ను దారుణంగా పొడిచి చంపిన పాత నేరస్తుడు రియాజ్ పోలీసుల కాల్పుల్లోమృతి చెందినట్లు సిపి సాయిచైతన్య వెల్లడించారు. సారంగాపూర్ ప్రాంతంలో అరెస్ట్ చేసిన అనంతరం గాయపడిన రియాజ్‌ను ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించామని ఈ క్రమంలోనే సోమవారం ఉదయం ఆస్పత్రిలోని 4వ అంతస్తులో రియాజ్ బందోబస్తు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గన్ లాక్కొని ట్రింగ్గర్ నొక్కే ప్రయత్నం చేశాడన్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్రమత్తమైన (ఆర్ఐ) రియాజ్‌పై కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సిపి స్పష్టం చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగా రియాజ్ మృతితో ప్రభుత్వ ఆస్పత్రి బయట పోలీసులు, ప్రజలు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. నిజమైన నరకాసుర సంహారణ జరిగిందని ప్రజలు సంబరాల్లో పాల్గొన్నారు. రియాజ్ ఎన్‌కౌంటర్‌తో కానిస్టేబుల్ ప్రమోద్ ఆత్మకు శాంతి చేకూరిందని పలువురు పేర్కొన్నారు. ప్రమోద్ కుటుంబ సభ్యులు రియాజ్ తరువాయి 2లో

## గాజా కాల్పుల విరమణ గాలిలో దీపం!

- ఒప్పందాన్ని హమాస్ ఉల్లంఘించిందని ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు
- సరిదిద్దుకోకపోతే మీ సంగతి చూస్తామని హెచ్చరిక
- పది రోజుల్లో 80 మంది పాలస్తీనియన్లు మృతి



**జెరూసలెం:** గాజాలో మళ్ళీ ఆందోళనకర పరిణామాలు నెలకున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ ఉల్లంఘించిందని వైట్‌హౌస్‌లో పాత్రికేయులవద్ద ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు చేశారు. హమాస్ తనను తాను సరిదిద్దుకోకపోతే మేమే వారి సంగతి చూస్తామని హెచ్చరిక చేశారు. ఆదివారం ఇజ్రాయెల్ సైన్యం దాడుల తర్వాత ట్రంప్ పైవిధంగా వ్యాఖ్యానించారు. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం గాలిలో రెపరెపలాడే దీపంలా మారింది. ప్రత్యర్థి తెగల ముఠాలపై హమాస్ దాడులు, వారిని బహిరంగంగా ఉరితీయడాన్ని కూడా ట్రంప్ ప్రస్తావించారు. 20 అంశాల శాంతి ప్రణాళిక ప్రకారం గాజాలో ఈనెల 11వ తేదీన కాల్పుల విరమణ అమలులోకి వచ్చినప్పటినుండీ ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ హమాస్–ఇజ్రాయెల్ సైనిక దళాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయెల్ సైన్యం తరువాయి 2లో




## పాతవారికి వర్తించదు

హెచ్–1బి వీసా పొందేందుకు లక్ష డాలర్ల నిబంధనపై అమెరికా స్పష్టీకరణ

**న్యూయార్క్:** అమెరికా వెళ్ళేందుకు హెచ్–1బి వీసా పొందడానికి లక్ష డాలర్లు ఒకేసారి చెల్లించాలనే నిబంధన పాత వారికి వర్తించదని ఇప్పటికే ఒక క్లారిటీ వచ్చింది. అదేవిధగా కొత్త మార్గదర్శకాల ప్రకారం అమెరికాలో తమ నివాసాన్ని పొడిగించుకోవాలని కోరుకునేవారికి, తమ స్టేటస్‌ను మార్చుకోవాలని కోరుకునేవారికి కూడా ఈ వీసా కింద లక్షడాలర్లు చెల్లించాలనే నిబంధన వర్తించదు. హెచ్–1 బి వీసాకు సంబంధించిన తాజా మార్గదర్శకాలు పాతవారికి చాలా ఉపశమనాలు కలిగిస్తున్నాయి. ఈ వీసాలను మంజూరు చేయడానికి ఇక మీదట తరువాయి 2లో

## 'జూబ్లీహిల్స్'కు ముగిసిన నామినేషన్లు

**అర్ధరాత్రి వరకూ కొనసాగిన ప్రక్రియ : భారీగా దాఖలు**




ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కీలకమైన నామినేషన్‌ల ఘట్టం మంగళవారం ముగిసింది. చివరి రోజు 3 గంటలలోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గేట్‌లోపల ఉన్నవారందరికీ నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 3 గంటలలోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన వారికి ఎన్నికల అధికారులు టోకెన్లు ఇచ్చారు. రాత్రి 9 గంటల వరకు 110 నామినేషన్‌లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. నామినేషన్‌ల తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## మడగాస్కర్ ప్రధానమంత్రిగా రాజోనరివెలో

**ఆంటనానరివో :** ఆగ్నేయ ఆఫ్రికా తీరప్రాంత దేశం మడగాస్కర్‌కు రాజోనరివెలో ప్రధానమంత్రిగా నియమితులయ్యారు. సైనిక కుట్రద్వారా అధికారం చేజిక్కించుకుని గడచిన శుక్రవారం దేశాధ్యక్షుడుగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన సైనిక నాయకుడు రాండ్రియా నిరినా కొత్త ప్రధానమంత్రిగా రాజోనరివెలోను నియమించారు. దేశ మాజీ ప్రధానమంత్రి ఆండ్రీ రాజోలినా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ సహాయంతో ఆ దేశ యుద్ధవిమానంలో సురక్షిత ప్రాంతానికి వెళ్ళిపోయిన తర్వాత ఈ పరిణామాలు సంభవించాయి. దేశంలో తనకు ప్రాణహాని ఉందని, అందుకే దేశం వదలివెళ్ళిపోతున్నానని, ఐనాగానీ ప్రధానమంత్రి పదవి తనదేనని ఆయన ప్రకటించారు. కానీ పార్లమెంటు ఆయనను అభిశంసన తీర్మానం ద్వారా పదవి నుండి తొలగించింది. ఈ లోపు సైనిక నాయకుడు దేశాధికారం స్వాధీనం చేసుకున్నారు. దేశంలో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిపోవడంతో యువకులు వీధుల్లోకి వచ్చి గడచిన కొద్ది వారాలుగా హింసాత్మక ప్రదర్శనలు చేసిన తర్వాత ఈ పరిణామాలన్నీ సంభవించాయి.

## జపాన్ తొలి మహిళా ప్రధానిగా సనే తకచి

### తొలి మహిళా ఆర్థికమంత్రిగా కటయామా





**టోక్యో:** జపాన్‌లో మొట్టమొదటిసారి ఒక మహిళ ప్రధానమంత్రిగా సనే తకచి (64) ఎన్నికయ్యారు. అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ నాయకురాలు తకచిని ఆదేశ పార్లమెంటు ప్రధానమంత్రిగా ఎన్నుకుంది. జపాన్ ఇన్నొవేషన్ పార్టీతో కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకుకు లిబరల్ డెమోక్రటిక్‌పార్టీకి ఒప్పందం కుదిరింది. 1993 నుండి 2003 వరకూ తకచి చట్టసభలో సభ్యురాలుగా ఉన్నారు. తర్వాత 2005 నుండి విరామం లేకుండా దిగువసభకు ఎన్నిక అవుతున్నారు. గతంలో అమె అనేక మంత్రిపదవులు నిర్వహించారు. షింజో అబే, ఫుమియో కిషిదా ప్రభుత్వాలలో మంత్రిగా పనిచేశారు. లిబరల్ డెమోక్రటిక్‌పార్టీకి దిగువసభలో 196 స్థానాలు ఉండగా, ఆమె కూటమిలో భాగస్వామి జపాన్ ఇన్నొవేషన్ పార్టీకి 35 స్థానాలున్నాయి. 465 స్థానాలున్న దిగువసభలో ఏ పార్టీ మెజార్టీ పొందాలన్నా 233 స్థానాలు గెలుచుకోవాలి. ప్రస్తుతం దిగువసభలో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ లేదు. ప్రధాన ప్రతిపక్షం సిడిపికి 148 స్థానాలున్నాయి.

దిగువసభలో తకచీకి 237 ఓట్లు వచ్చాయి. అమెపై పోటీ పడిన కాన్సిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ నాయకుడు యషిహికో నోడాకు 149 లభించాయి. దీంతో ఆమె రన్నాఫ్ ఓటింగ్ తప్పించుకున్నారు. ఓటింగ్ సమయంలో ఆమెపై ప్రశంసలు కురిపించిన సభ్యులు ఎన్నికైన తర్వాత కూడా ఆగకుండా కరతాళ ధ్వనులు చేస్తూ ఆమెకు స్వాగతం పలికారు. ఐతే ఎగువసభ సెనేట్‌లో ఆమె రన్నాఫ్‌లోనే పదవిని గెలుచుకున్నారు. లిబరల్ డెమోక్రటిక్ పార్టీకి ఎగువసభలో మెజారిటీ లేదు. మొదటి రౌండులో ఆమెకు సెనేట్‌లో మెజారిటీ రాలేదు. మొత్తం 246 స్థానాలున్న సెనేట్‌లో రెండో రౌండులో ఇన్నొవేషన్ పార్టీ మద్దతుతో ఆమెకు బొటాబొటీగా 123 ఓట్లు రాగా, ప్రత్యర్థికి 120ఓట్లు లభించాయి. అదేవిధంగా జపాన్ మొట్టమొదటి మహిళా ఆర్థికమంత్రిగా సత్సుకి కటయామాకు ఆమె మంత్రివర్గంలో అవకాశం లభించింది. ఇంతకుముందు ఆర్థికశాఖలో ఆమె ఉన్నతాధికార బాధ్యతలు నిర్వహించారు. ఆమె మాజీ మంత్రి కూడా. సంప్రదాయ భావాలకు పుట్టినిల్లులాంటి ఆలోచనలుగల చట్టసభ సభ్యుడు మినోరూ కిహారాను చీఫ్ క్యాబినెట్ కార్యదర్శిగా నియమితులయ్యారు. అన్ని కీలక మంత్రిత్వశాఖలను ఆయన సమన్వయం చేస్తారు. దీంతో మొదటిసారి జపాన్ ప్రభుత్వ పరిపాలన మహిళల చేతుల్లోకి వెళ్ళింది. జపాన్‌లో అనేక సంవత్సరాలుగా ప్రధానమంత్రులు అవినీతి ఆరోపణలతో రాజీనామాలు చేస్తూ వస్తున్నారు.

## చైనాలో ప్రపంచ హైస్పీడ్ బుల్లెట్ రైలు

### గంటకు 453 కి.మీ. వేగంతో ప్రయాణం




**బీజింగ్ :** ప్రపంచంలో ఏ దేశంలో లేనివిదంగా హైస్పీడుతో ప్రయాణం చేయగల రైలును ప్రయోగ ప్రాతిపదికపై చైనాలో నడిపారు. ప్రత్యేకంగా నిర్మించిన రైల్వే మార్గంలో ఈ వరల్డ్ హై స్పీడు రైలు గంటకు 453 కి.మీ (దాదాపు 280 మైళ్ళు) వేగంగా ప్రయాణం చేసింది. సిఆర్–450 పేరుతో పిలిచే ఈ ప్రపంచ హైస్పీడు బుల్లెట్ రైలును ప్రయోగ ప్రాతిపదికపై నడిఇపించి ప్రయాణికులను తీసుకువెళ్ళడానికి ఇక సిద్ధమైందని, ఈ సిఆర్–450కి ప్రయాణికులను మోసుకెళ్ళే అన్ని అర్హతలూ వచ్చాయని అధికారులు నిర్ధారించారు. ఐతే వాణిజ్య సేవల నిమిత్తం 400 కి.మీ వేగంతో మాత్రమే దీనిని నడుపుతారు. ఈ రైలు అంతవేగంగా ప్రయాణం చేస్తూ కేవలం 4.40 నిమిషాల్లో కదలకుండా ఆగిపోగలస్థితికి రాగలదు. ఎదురు–బదురు ప్రయాణం చేసే ఈ రైళ్ళు ఉమ్మడిగా ఇంతకుముందు చైనా ప్రవేశపెట్టిన సిఆర్–400 రైలుతో పోల్చి చూస్తే ఈ రైలు సొగసైన ముక్కు ఇంకా చాలా పొడవుగా సూదిగా ఉంటుంది. ఏరో డైనమిక్స్‌లో 50 టన్నుల బరువు తగ్గుతుంది. మొత్తం 896 కి.మీ వేగంగా ప్రయాణం చేయగలవు. ఈ రైలు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఆరు లక్షల కి.మీ ప్రయాణం చేయగలదు.

చైనా తూర్పు ప్రాంతం షాంఘై నుండి చైనా పశ్చిమ ప్రాంతంలో ఉన్న నగరం చెంగ్డూ వరకూ ఈ హైస్పీడ్ సిఆర్–450ని ఇకమీదట రాకపోకలు సాగించేందుకు సన్నద్ధమైనట్లు "సైన్స్ అండ్ టెక్నాలజీ" డైలీ సోమవారం ప్రకటించింది. గత ఏడాది నవంబరు 26న చైనా అధికారికంగా ప్రపంచం ముందుకు తీసుకువచ్చింది. ఈ రైలులో గాలి ధ్వని వినబడేందుకు అవకాశం లేకుండా పూర్తి ఏర్పాట్లు ఉంటాయి. అదేవిధంగా విశాలమైన క్యాబిన్‌లో సైకిళ్ళు, వీల్‌ఛైర్లు తీసుకువెళ్ళడానికి ఏర్పాట్లు ఉన్నాయి. దీనివల్ల బీజింగ్–షాంఘై మార్గంలో రైల్వే ప్రయాణికుల ప్రయాణ సమయం దాదాపు మూడు గంటలు తగ్గిపోతుంది. ప్రయాణికులకు మూడు గంటలు సమయం ఆదా అవుతుంది.

## ఫ్రెంచ్ మాజీ అధ్యక్షుడు సర్కోజీకి నేటి నుండి ఐదేళ్ళు జైలుశిక్ష

**పారిస్:** అవినీతి ఆరోపణల కేసులో నేరస్థుడుగా రుజువైన ఫ్రెంచ్ మాజీ అధ్యక్షుడు సర్కోజీ (70)కి మంగళవారం నుండి జైలుశిక్ష అమలు చేయడం ప్రారంభించారు. ఐదు సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించేందుకు ఆయనను పారిస్‌లో ప్రధాన జైలుకు తరలించారు. ఫ్రాన్స్ చరిత్రలో ఏ దేశాధ్యక్షుడూ ఈ విధంగా ఇప్పటివరకూ చెరసాల పాలు కాలేదు. 2007 మే నుంచి 2012 మే వరకూ ఆయన ఫ్రెంచ్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. లిబరల్ కన్జర్వేటివ్‌లకు చెందిన ద రిపబ్లికన్స్‌పార్టీ నాయకుడు సర్కోజీ. ఎన్నికల్లో విజయం సాధించేందుకు లిబియా నియంత గడాఫీ నుండి అక్రమంగా దేశానికి నిధులు తెచ్చుకున్నారన్న ఆరోపణలు న్యాయస్థానంలో రుజువు కావడంతో ఆయనకు ఐదేళ్ళు జైలుశిక్ష పడింది. పారిస్‌లోని 16వ జిల్లాలో ఉన్న ఆయన విల్లా నుండి భార్య కార్లా బ్రూనీ సర్కోజీ చేతిలో చేయివేసుకుని జైలుకు వెళ్ళేందుకు బయటకు నడచివెళుతుంటే చుట్టూ చేరిన ఆయన అభిమానులు జేజేలు పలికారు. ఆయన ఇద్దరు కుమారులు కూడా ఆయన వెంటే ఉన్నారు. మోంట్ పార్నస్సే జిల్లాలోని 19వ శతాబ్దంనాటి జైలుకు చేరుకోగానే జైలు వెలుపల వందల మంది అభిమానులు ఆయనకు స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆయన జైలు గదిలోకి ప్రవేశించారు.

## అమెరికా–ఆస్ట్రేలియా మధ్య అరుదైన ఖనిజ వాణిజ్య ఒప్పందం



**వాషింగ్టన్:** అమెరికా–ఆస్ట్రేలియా మధ్య అరుదైన ఖనిజాలపై వాణిజ్య ఒప్పందం జరిగింది. ఒప్పందం ప్రకారం రాబోయే ఆరునెలల్లో ఈ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు రెండు దేశాలూ 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు సమకూరుస్తాయి. అమెరికాలో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్ వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశం సందర్భంగా ఈ ఒప్పందంపై నాయకులు ఇద్దరూ సోమవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఆస్ట్రేలియాకు అతిపెద్ద వ్యూహాత్మక విజయంగా గార్డియన్ పత్రిక పేర్కొంది. గనుల తవ్వకం దగ్గర నుండి ప్రాసెసింగ్ ఎగుమతుల వరకూ ఈ రెండు దేశాల భాగస్వామ్యం ఉంటుంది.

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఒక భద్రతా కూటమిగా ఏర్పడిన (అమెరికా,బ్రిటన్, ఆస్ట్రేలియా) 'అకుస్'పై ట్రంప్ ఇచ్చిన అస్పష్టమైన వాగ్దానాలకు ఆస్ట్రేలియా ప్రభుత్వం కేరింతలు కొట్టడాన్ని చైనా పరిశీలకులు ప్రస్తావిస్తూ, అమెరికాతో ఉన్న బలమైన మిత్రత్వాన్ని దీర్ఘకాలంలో కాపాడుకోవడంలో ఆస్ట్రేలియా భవిష్యత్తులో చాలా సమస్యలు ఎదుర్కొంటుందని విమర్శించారు. ఈ అరుదైన ఖనిజాల ఎగుమతులపై ఇటీవల చైనా ప్రభుత్వం కొత్త నియంత్రణలు విధించిన తర్వాత చైనా–అమెరికా మధ్య మళ్ళీ వాణిజ్య ఉద్రిక్తతలు తలెత్తిన పూర్వరంగంలో ఆస్ట్రేలియాతో ట్రంప్ చేసుకున్న ఈ వాణిజ్య ఒప్పందం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఐతే చైనా పరిశీలకులు మాత్రం స్వల్పకాలంలో చైనా సరఫరా వ్యవస్థ ఈ ఒప్పందం వల్ల చెక్కుచెదిరే అవకాశం లేదని అన్నారు. ఎ.ఐ, సెల్‌ఫోన్లు వంటి కీలకమైన సాంకేతిక పరికాలను తయారు చేయడానికి ఉపయోగపడే అరుదైన మూలకాలను సరఫరా చేయడంలో ప్రపంచవ్యాప్తంగా చైనా దేశమే అగ్రస్థానంలో ఉంది. తన దేశీయ ప్రయోజనాలకే చైనా అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని వీటిపై నియంత్రణల సందర్భంగా చైనా ప్రకటించింది.

## ట్రంప్–పుతిన్ భేటీలో నేనూ పాల్గొంటా : జెలెన్‌స్కీ విజ్ఞప్తి

**కీవ్ :** బుడాపెస్ట్‌లో త్వరలో ట్రంప్–పుతిన్ మధ్య రెండోసారి శిఖరాగ్ర సమావేశానికి తాను కూడా వెళతానని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. యూరప్ కూడా ఆయన విజ్ఞప్తికి మద్దతు పలికింది. హంగేరీ మధ్యవర్తిగా నాయకులిద్దరి మధ్య త్వరలో సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. రష్యాతో జరిగే యుద్ధంలో ఉక్రేన్ గెలిచే అవకాశాలు లేవని ట్రంప్ తాజాగా బహిరంగ వ్యాఖ్యలు చేసిన తరుణంలో యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు కూడా బుడాపెస్ట్ సమావేశంలో భాగస్వాములు కావాలని గట్టిగా కోరుతున్నారు. గాజాలో ఒప్పందం కుదిరిన తర్వాత గత వారం లో జెలెన్‌స్కీ వాషింగ్టన్ వెళ్ళి ట్రంప్‌తో సమావేశమయ్యారు. తోమాహక్ క్షిపణులు సరఫరా చేయాలని అడిగారు. కానీ అందుకు ట్రంప్ తిరస్కరించి పుతిన్‌తో త్వరగా ఒప్పందం చేసుకోవాలని హితవాక్యాలు పలికి పంపారు. ఇంతకు ముందు అలాస్కాలో జరిగిన శిఖరాగ్ర సదస్సులో కూడా తనను భాగస్వామిగా చేర్చాలని జెలెన్‌స్కీ కోరారు. తాము లేకుండా ఉక్రేన్‌పై చర్చలు సఫలమయ్యే అవకాశం లేదని కూడా జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా అదే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు. చర్చలు వాయిదా వేసేందుకు పుతిన్ ప్రయత్నం చేస్తున్నారని, ఒక గడువంటూ లేకుండా కాలయాపన చేస్తున్నారనీ యూరోపియన్ యూనియన్ నాయకులు విమర్శిస్తున్నారు. అదేవిధంగా రష్యా దళాలు ఆక్రమించిన భూభాగాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా పుతిన్ ఇష్టపడటంలేదని విమర్శించారు. అంతర్జాతీయ సరిహద్దులను బలవంతంగా మార్చకూడదన్న నిబంధనలకు కట్టుబడి ఉండాలని కూడా వారు కోరుతున్నారు.

## నిబంధన ఎత్తివేతకు ఆర్డినెన్స్

(మొదటి పేజీ తరువాయి)

బిసి రిజర్వేషన్ల అంశంపైన సుప్రీం కోర్ట్ ఇచ్చిన పూర్తి తీర్పుపైన కూడా మంత్రివర్గంలో చర్చించి, దీనికి సంబంధించి ఒక నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు చెందిన బిల్లులు, స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్లు మించరాదనే బిల్లు కూడా పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

## గుజ్జుల ఈశ్వరయ్య

(మొదటి పేజీ తరువాయి)

క్రియాశీలక పాత్ర పోషించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, రైతు తదితర ఉద్యమాల్లో తనదైన ముద్రవేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతర పోరాటాలు నిర్వహించారు. ఇంతవరకు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగాను, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈశ్వరయ్య ఇకపై ఎపి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈశ్వరయ్యకు డి.రాజా, రామకృష్ణ పాండ, కె.రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఈశ్వరయ్య నేతత్వాన పార్టీ బలోపేతం కావాలని, బలమైన ప్రజా ఉద్యమాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఒంగోలులో ఆగస్టు 23 నుంచి 25 వరకు సిపిఐ ఎపి రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఆ సందర్భంగా సిపిఐ ఎపి రాష్ట్ర నూతన సమితి 102 మందితో ఏర్పడింది. వారిలో 33 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికవ్వగా, రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక వాయిదా పడింది. జాతీయ మహాసభల అనంతరం రాష్ట్ర కార్యదర్శిని ఎన్నుకుంటామని పార్టీ నాయకత్వం ప్రకటించింది. జాతీయ మహాసభలు ముగియడంతో, తాజాగా ఈశ్వరయ్య ఏకగ్రీవ ఎన్నికను అధికారికంగా డి.రాజా ప్రకటించారు.

## జనంలోకి రండి

(మొదటి పేజీ తరువాయి)

మా ప్రభుత్వానికి గర్వకారణమని అన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డిసిపిలుగా ఏడుగురు మహిళా అధికారులే అని చెప్పారు. రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపిఎస్ అధికారులను చూసి తెలంగాణ గర్విస్తోందన్నారు. ఒకవైపు నేరాల అదుపు, మరోవైపు నేరాల విచారణ, ట్రాఫిక్ నియంత్రణ, పగటి గస్తీ, రాత్రి గస్తీ, బందోబస్తు, ఇంతటి కఠినమైన సవాళ్లతో బాధ్యతలు నిర్వర్తిస్తున్న పోలీసులకు ఎటువంటి కష్టం రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు 16 వేల మంది కానిస్టేబుల్స్, ఎస్ఐలను రిక్రూట్ చేసింది. రాజకీయ జోక్యం లేకుండా పోలీసులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించే పరిస్థితులు కల్పించాం. సంఘ విద్రోహ శక్తులు, తీవ్రవాదులు, ఉగ్రవాదుల దాడుల్లో వీరమరణం పొందిన లేదా గాయపడి, అంగవైకల్యం పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో అత్యధిక నష్టపరిహారం అందించాం. విధినిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం, వారి పిల్లలకు రెసిడెన్షియల్ స్కూళ్ళల్లో ఉచిత విద్య, వైద్యం, బస్ పాస్ సౌకర్యం తదితర పథకాలను అందజేస్తున్నాం. మెడికల్ సీట్లలోను పోలీస్ అమరుల పిల్లలకు ప్రత్యేకంగా సీట్లను కేటాయిస్తున్నామన్నారు.

**రాష్ట్రంలో ఆరుగురు అమరులైన పోలీసులు..**

డిజిపి బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. తీవ్రవాదం, ఉగ్రవాదం, మతతత్వ ధోరణులు, సంఘ విద్రోహ శక్తులు, అసాంఘిక శక్తులను, వ్యవస్థీకృత నేరస్థులను ఎదుర్కొంటూ, ప్రాణాలను ఫణంగా పెట్టి దేశ వ్యాప్తంగా ఈ ఏడాది 191 మంది పోలీసులు వీరమరణం పొందారు. అందులో తెలంగాణకు చెందిన ఆరుగుర మరణించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రేహౌండ్స్ కమాండోలు.. టి.సందీప్, వి.శ్రీధర్, ఎన్. పవన్ కళ్యాణ్‌లు సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ వీరమరణం చెందారని, . అదేవిధంగా అసిస్టెంట్ కమాండెంట్ బానోతు జవహర్లాల్, నల్గొండ కానిస్టేబుల్ బి.సైదులు విధినిర్వహణలో మరణించగా మూడు రోజుల కింద నిజామాబాద్‌లో సిసిఎస్ కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్ కుమార్ విధి నిర్వహణలో వీర మరణం చెందారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిజిపిలు అధికారులు మహేందర్‌రెడ్డి,డాక్టర్ జితేందర్, మాజీ ఐపిఎస్‌లు రతన్, అరుణ బహుగుణ, బి.మల్లారెడ్డిలతో పాటు సీనియర్ ఐపిఎస్‌లు సివి ఆనంద్, శిఖాగోయల్, అభిలాషబిస్త్, స్వాతిలక్రా,మహేష్ మురళీధర్ భగవత్, విజయ్‌కుమార్, బి.సుమతి, ఎం.రమేష్, విసి సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## గాలిలో దీపం..!

(మొదటి పేజీ తరువాయి)

వరుస దాడులు కొనసాగిస్తోంది.

ఇజ్రాయెల్ దాడుల్లో మంగళవారం వరకూ 80మంది మరణించారు. ఒక్క ఆదివారం గాజాలో ఐడిఎఫ్ దాడుల్లో పిల్లలతో సహా 42 మంది మరణించారు. హమాస్ తమ ఇద్దరు సైనికులను కాల్చి చంపిందని, దీనికి ప్రతీకారంగా తాము గగనతల దాడులు చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆదివారం దాడుల తర్వాత అదేరోజు సాయంత్రం నుండీ తిరిగి కాల్పుల విరమణ ఒప్పందం అమలు ప్రారంభమైందని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో తిరిగి హమాస్‌పై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ సైన్యానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా వత్తాసు పలికే అవకాశాలు పెరుగుతున్న వాతావరణం కనిపిస్తోంది.

గాజాలో నిర్దేశిత ప్రాంతం నుండి ఇజ్రాయెల్ సైన్యం వైదొలగిన తర్వాత గాజాస్ట్రిప్‌పై తన పట్టు బిగించేందుకు హమాస్ ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించిందని, వివిధ గ్రామాలలో తమ భద్రతా సిబ్బందిని మోహరించిదని, తమపై వారు దాడులు చేస్తున్నారని ఇజ్రాయెల్ సైన్యం ఆరోపణలు చేస్తున్నది. దీనిని ఇప్పటికే ట్రంప్ కూడా ధృవీకరించారు. ఈ నేపథ్యం లో మళ్ళీ ఉద్రిక్తతలు పెరుగుతూ ఉండటంతో కాల్పుల విమరణ ఒప్పందం అమలు సందేహంలో పడుతోంది. ఈ సంక్లిష్ట పరిస్థితులమధ్య హమాస్ నిజాయతీగా మరో ఇజ్రాయెల్ బందీ మృతదేహాన్ని రెడ్‌క్రాస్ ద్వారా నెతన్యాహూ ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. దీంతో ఇంకా హమాస్ వద్ద 15 మంది బందీల మృతదేహాలు మిగిలిపోయాయి. వారిని కూడా అప్పగించేందుకు హమాస్ ముమ్మర గాలింపు చర్యలు కొనసాగిస్తోంది.

గాజాలో 2023 అక్టోబరు 7 వ తేదీన సరిహద్దు కంచె బద్దలుకొట్టుకుని హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై బాంబులు, క్షిపణులతో భీతావహ దాడులు ప్రారంభించారు. ఆ తర్వాత గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకూ 746 రోజులుగా జరుగుతున్న యుద్ధంలో 68,216 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 1.70,000 మంది గాయపడ్డారు.

**మా సైన్యం భయంతోనే హమాస్ లొంగి వచ్చింది : నెతన్యాహూ**

ఇదిలా ఉండగా పశ్చిమ ఆసియాలో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, వైట్‌హౌస్ సలహాదారు, ట్రంప్ అల్లుడు కుష్నెర్ మంగళవారం టెల్‌అవీవ్‌లో హమాస్ చెర నుండి విడుదలైన బందీలను కలుసుకున్నారు. వారితో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి బందీతోనూ విడివిడిగా మాట్లాడి బందీలుగా ఉన్న సమయంలో వారు ఎదుర్కొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కాల్పుల విరమణ అమలులోకి వచ్చిన తర్వాత ఈ 11 రోజుల్లో విట్‌కాఫ్,కుష్నెర్ ఇజ్రాయెల్ పర్యటన ఇది రెండోసారి. ఆదివారం వారు టెల్‌అవీవ్‌కు చేరుకోగానే తాజా పరిస్థితులను చర్చించారు. సోమవారం నెతన్యాహూ ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించారు. ఈనాడు కుదిరిన ఒప్పందం ఏడాది క్రితమే అందుబాటులోకి వచ్చిందన్న వాదనలను ఆయన తోసిపుచ్చారు. హమాస్ ఏనాడూ బందీలను విడుదల చేసేందుకు ఇష్టపడలేదని, ఈనాటి ఒప్పందం ఇంతకుముందు అందుబాటులో లేదన్నారు. గాజాలో ఇంకా మిగిలిపోయాన బందీల మృతదేహాలపేర్లు పార్లమెంటుకు తెలియజేశారు. యుద్ధ లక్ష్యాలు పూర్తిచేసేందుకు తాము కృతనిశ్చయంతో ఉన్నామన్నారు.

గాజాలోకి ఇజ్రాయెల్ సైన్యం ప్రవేశించినందువల్లనే బందీలను తాము తీసుకురాగలిగామన్నారు. సైన్యం వెళ్ళిన తర్వాత హమాస్‌కు నిజాలు అర్థమయ్యాయని, ఇక తమను అంతం చేయడంకోసమే సైన్యం వచ్చిందని వారు నిర్ధారించుకుని భయపడ్డారని, లేకపోతే ఈనాడు బందీలను హమాస్ వదిలిపెట్టేది కాదని అన్నారు. ఇంతకుముందు అందరూ ఒత్తిడి చేసిన విధంగా తాను లొంగిపోయి ఉంటే ఈపాటికి హమాస్ తమపై బ్రహ్మాండమైన విజయం సాధించి అణచివేతకు గురిచేసి ఉండేదన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాకు స్వాధీనం చేసిన పాలస్తినా ఖైదీల మృతదేహాలను గాజా వైద్యులు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. వారి దేహాలపై పోలీసులు చిత్రహింసలకు గురిచేన గుర్తులు ఉన్నాయని వైద్యులు ప్రకటించారు. ఇప్పటివరకూ ఇజ్రాయెల్ 120 మంది ఖైదీల మృతదేహాలు స్వాధీనం చేసింది.

## ముగిసిన నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

దఖాలు ప్రక్రియ అర్థరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు చెప్పారు. నామినేషన్ దాఖలకు మంగళవా రం చివరి రోజు కావడంతో భారీ సంఖ్యలో దాఖలయ్యాయి. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు అభ్యర్థులు, రిజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) నిర్వాసిత రైతులు, నిరుద్యోగులు, పలువురు ఒయు విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బిఆర్ఎస్ నుంచి మాగంటి సునీత, బిజెపి నుంచి లంకల దీపక్ రెడ్డి నామినేషన్ వేశారు. ఈనెల 22న నామినేషన్‌లను అధికారులు పరిశీలించనున్నారు. నామినేషన్‌ల ఉపసంహరణకు ఈనెల 24ను ముగినుంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. నవంబర్ 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరపనున్నారు.

## రియాజ్ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

మరణం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నరహంతకుడికి సరైన శిక్ష పడిందని ప్రమోద్ కుటుంబ సభ్యులు అన్నారు.

**ప్రమోద్ అసలైన పోలీసు :** ప్రమోద్ అసలైన పోలీసని, ప్రమోద్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కంఠేశ్వర్ బ్యాంకు కాలనీలోని కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పోలీస్ కమీషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ హామాల్‌లో విలేకరులతో మాట్లాడారు. సిఎం రకేవంత్‌రెడ్డి జరిగిన అమరవీరుల దినోత్సవం సందర్భంగా ప్రమోద్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం జరిగిందన్నారు. కానిస్టేబుల్ ప్రమోద్‌కు సెప్టెంబర్‌లో వచ్చిన జీతం రిటైర్ అయ్యే వరకు వారి కుటుంబానికి అందజేయనున్నామన్నారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు 300 గజాల స్థలం, పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా వచ్చే ఇన్సూరెన్స్, ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నామన్నారు. విధి నిర్వహణలో నిజాయితీగా పని చేసేవాడని, అలాంటి పోలీస్‌ను కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రాణాలు కోల్పోయిన ప్రమోద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ఎన్‌కౌంటర్‌పై హ్యూమన్ రైట్స్ నుంచి నోటీసులు వచ్చాయన్నారు. సోమవారం సాయంత్రం జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి అనంతరం పోస్టుమార్టం నిర్వహించారన్నారు. తెలంగాణలో మావోయిస్టులు వరుసగా లొంగిపోతున్నారని ఇంకెంత మంది ఉన్నారని అడగగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి ఓపెన్ ఆఫర్ ఇవ్వటం జరిగిందని, జనజీవన స్రవంతిలో కలవాలని ఈ సందర్భంగా కోరారని, ఇంకా 65 మంది ఉన్నట్లు తెలుస్తుందని, నాయకత్వ స్థాయిలో 45 వరకు ఉన్నారని వారు కూడా పొలిటికల్ ద్వారా గానీ, పోలీసుల ద్వారా గానీ, మీడియా ద్వారా అయినా పరవా లేదు. లొంగిపోవచ్చని, మావోయిస్టులు నిశ్చింతగా బయటకు రండి జనజీవన స్రవంతిలో కలవాలన్నారు. అనంతరం రియాజ్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించి గాయాల పాలైన ఆఫీస్ భార్యకు 50 వేల రివార్డు అందజేశారు.

## పాతవారికి వర్తించదు

(మొదటి పేజీ తరువాయి)

కొత్తవారు లక్ష డాలర్లు చెల్లించాలనే నిబంధనను సెప్టెంబరు 21వ తేదీ తెల్లారకముందే అర్థరాత్రి నుండి ట్రంప్ అమలులోకి తీసుకువచ్చారు. ఇక అప్పటినుండీ ట్రంప్‌పై తీవ్ర వ్యతిరేకత పెరిగింది. అమెరికా కంపెనీలకు చాలా నష్టం వాటిల్లుందని విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కొత్త నిబంధనలు రూపొందించారు. "నో కింగ్ ఇన్ అమెరికా" పేరుతో ఆదివారం అమెరికా వ్యాప్తం గా లక్షలమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేయడంతో ట్రంప్ పాలనాధికారులు బెంబేలెత్తారు.

ప్రధానంగా వలస విధానం, షట్‌డౌన్, టారిఫ్‌లు, దేశంలోని సంక్షేమ నిధుల్లో కోతలు వంటి చర్యలను వ్యతిరేకిస్తూ ఈ ప్రదర్శనలు జరిగిన రెండు రోజులకే ట్రంప్ యంత్రాంగం వలసలకు సంబంధించిన హెచ్–1 బి వీసాలపై ఈ కొత్త నిబంధనలను జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం హెచ్–1 బి వీసాలు ఉన్నవారు అమెరికాకు రావడానికి, అమెరికా నుండి వెళ్ళడానికి రాకపోకలు చేయడానికి ఎలాంటి అభ్యంతరాలూ ఉండవు. వలస విధానం ద్వారా కఠినమైన అణచివేతలకు ట్రంప్ పాల్పడతారని భావించినప్పటికీ తాత్కాలికంగా పాతవారందరి కీ ఉపశమనం లభించింది. ఇటీవలి సంవత్స రాలలో భారత్ నుండి 71 శాతం వల దరఖాస్తు దారులకు హెచ్–1 బి వీసా క్లియరెన్సు లు లభించాయి.

## ఎంతకాలం?

(మొదటి పేజీ తరువాయి)

దాసరిభవన్‌లో మంగళవారం జరిగింది. సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్యను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈశ్వరయ్యకు జాతీయ, రాష్ట్ర సమితి సభ్యులు, నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ కార్యదర్శులు రామకృష్ణ పాండ, కె.రామకృష్ణ, నూతన కార్యదర్శి ఈశ్వరయ్య, రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి రాజా విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యకు రాజా శుభాకాంక్షలు తెలిపారు.

కడప జిల్లాకు చెందిన ఈశ్వరయ్య యువజన, విద్యార్థి విభాగాల్లోను, పార్టీలోను ప్రజాఉద్యమాల ద్వారా చురుకైన పాత్ర పోషించారని కొనియాడా రు. ఇటీవల చండీగఢ్‌లో జరిగిన జాతీయ మహాసభ లో జాతీయ కార్యదర్శిగా రాష్ట్రం నుంచి ఎన్నికైన రామకృష్ణకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలతో దేశానికి అత్యంత ప్రమాదం పొంచి ఉందని, దేశ ప్రయోజనాలను విస్మరించి... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కనుసన్నల్లో ప్రధాని నరేంద్ర మోదీ నడుస్తున్నారని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. బిహార్ ఎన్నికల ఫలితాలు కీలకం కానున్నాయని, ఆ ఫలితాలు దేశంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయన్నారు. అందుకోసం బీహార్‌లో ఎన్‌డిఎ కూటమి ఓటమే లక్ష్యంగా అందరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ కూటమి ఓటమి కోసం ఇండియా ఐక్య సంఘటన శక్తివంచన లేకుండా పాటుపడుతోందన్నారు. వాస్తవంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన ఒక్క హామీనైనా కేంద్రం అమలు చేసిందా అని రాజా ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, సరైన ఆర్థిక మద్దతు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అన్ని లౌకిక, ప్రజాస్వామిక పార్టీలతో కలిసి బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా బలమైన ఐక్య పోరాటానికి సిపిఐ సన్నద్ధమవుతోందన్నారు. ఇతర వామపక్ష పార్టీలు, ప్రజాతంత్ర, లౌకిక పార్టీలు కలిసి రావాలని, ఇది దేశానికి చారిత్రక అవసరమని నొక్కిచెప్పారు. దేశం ఒక సెక్యులర్, డెమోక్రటిక్‌గా కొనసాగాలంటే, సంక్షేమ దేశంగా విలసిల్లాలంటే అన్ని ప్రజాస్వామ్య, లౌకికవాద పార్టీలు బలమైన పోరాటం చేయాల్సిన అవసరముందన్నారు. ఈనెల 25న ఢిల్లీలో జరగనున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ స్థాయిలో ఉద్యమ కార్యాచరణపై చర్చిస్తామని రాజా తెలిపారు. దళితులపై దాడులు, అన్యాయాలు పెరిగిపోతున్నాయని వివరించారు.

**సహకరించిన అందరికీ ధన్యవాదాలు: రామకృష్ణ**

ఇంతకాలం సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన తనకి సహకరించిన అందరికీ సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నూతన కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. నవంబర్ 2,3 తేదీల్లో జరగనున్న రాష్ట్ర సమావేశాల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తున్నదని, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు.

**అందరికీ కృతజ్ఞతలు: ఈశ్వరయ్య**

తనకు పార్టీ కార్యదర్శిగా అవకాశం ఇచ్చిన అందరికీ ఈశ్వరయ్య ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని వెల్లడించారు. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## పోలీసు సంక్షేమ నిధికి రూ.8 లక్షల విరాళం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఛామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీని పోలీస్ క్రికెట్ టీం గెలుపొందింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఉప్పల్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో టాలీవుడ్ టీంపై పోలీస్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. విన్నర్ టీమ్‌కు లభించిన ఐదు లక్షలు, రన్నర్ టీమ్‌కు లభించిన 3 లక్షల రూపాయల నగదు బహుమతిని పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని పోలీసు సంక్షేమ నిధికి అందచేస్తూ ఈ చెక్కును రాష్ట్ర ప్రభుత్వ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్‌కు మంగళవారం సచివాలయంలో నిర్వాహకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ క్రికెట్ టీమ్ సభ్యులతో పాటు, బిసిసిఐ, ప్రణవ గ్రూప్ ప్రతినిధులు పాల్గొనన్నారు.

# గరిష్ఠ స్థాయిలో రైతులకు ప్రయోజనం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేంద్ర రాష్ట్ర వాటాలతో అమలయ్యే పథకాలన్నింటినీ ఒక్కొక్కటిగా పునరుద్ధరిస్తూ, గరిష్ట స్థాయిలో రైతుల ప్రయోజనం చేకూరేలా వ్యవసాయ, ఉద్యాన శాఖలు చర్యలు చేపట్టాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద నాణ్యమైన పప్పుదినుసుల వంగడాలను, పొద్దుతిరుగుడు, కుసుమ వంగడాలను సబ్సిడీపై రైతులకు అందచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర వాటా విడుదల చేయకపోవడంతో రాష్ట్ర రైతాంగం గత పదేళ్లలో దాదాపు రూ.3000 కోట్ల మేరకు నష్టపోయిందని, కేంద్ర ప్రభుత్వాలు కూడా రాష్ట్రానికి కేటాయించిన ఆ నిధులను తిరిగి అవే రాష్ట్రాలకు తరువాత కేటాయిస్తే కనీసం రాష్ట్రాల ప్రాథమిక హక్కులను, ఆ రాష్ట్రాల రైతులు ప్రయోజనాలను కాపాడే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించినట్లు ఉండేదన్నారు. కేంద్రం అలా చేయకపోవడంతో అప్పటి ప్రభుత్వ రాజకీయ దురుద్దేశాలకు రైతులు నష్టపోయాయరని మంత్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను పూర్తి స్థాయిలో వాడుకోవాలని, దానికి తగిన రాష్ట్ర వాటా నిధులు విడుదల చేసి రాష్ట్ర రైతులకు ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని కృతనిశ్చయంతో ఉన్నదని మంత్రి తెలిపారు. రైతుల ప్రయోజనాలే ప్రజా ప్రభుత్వానికి పరమావధి అని, అందుకు తగిన ఆర్థిక వెసులుబాటు రాగానే ఒక్కొక్క పథకాన్ని పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో వరితో పాటు పప్పుదినుసులు, నూనె గింజల సాగును కూడా పెంచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఈ పథకంలో భాగంగా ఈ యాసంగిలో రూ.2.68 కోట్ల సబ్సిడీతో 49,397 ఎకరాలకు సరిపడా 5825 క్వింటాళ్ల శనగ విత్తనాలు 14 జిల్లాలలో పంపిణీకి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. 2025–26లో రూ.48.54 కోట్లతో జాతీయ ఆహార భద్రత పథకాన్ని అమలు చేస్తున్నామని, విత్తనాలతో పాటు ప్రదర్శన క్షేత్రాలు, విత్తనోత్పత్తి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతువేదికల వద్ద రైతులని సమీకరించి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలు, రైతులకు లబ్ధి కలిగించే పూర్తి సమాచారాన్ని పక్కాగా అందించాల్సిన బాధ్యత డిఏఓ, ఎఓ, ఎఈఓ తీసుకోవాలని, ఇందుకు అవసరమైన శాస్త్రవేతలను, వ్యవసాయ నిపుణలను ఆహ్వానించి రైతులకు వ్యవసాయ ఉత్పతులకు, మార్కెటింగ్‌పై అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు.

**పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

పత్తి కొనుగోలు మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలియజేశారు. మొత్తం 317 జిన్నింగ్ మిల్లులను సిసిఐ నోటిఫై చేశారని అన్నారు. సీసీఐ వారు తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 21,07,272 మంది రైతులు రిజిస్టర్ చేసుకున్నారని, దీంతో వారు అనుకూలమైన సమయం చూసుకుని వారి పంటను అమ్ముకోవడానికి స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఖమ్మంలో బుధవారం, ఈ నెల 24న నల్గొండ జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయని మంత్రి ప్రకటించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 5779 ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ టోల్ ఫ్రీ నంబర్ ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు రైతులకు అందుబాటులో ఉంటుందని, 24 గంటలలో రైతుల సమస్యకు పరిష్కరించే విధంగా ఒక సీనియర్ అధికారితో పర్యవేక్షణ ఉంటుందని వివరించారు.

## మాఫియా, డాన్లు, కాంట్రాక్టులు, కమీషన్లు అంటూ
# బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/హైదరాబాద్: మాఫియా, డాన్లు, కాంట్రాక్టులు, కమీషన్ల గురించి బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదమని, బ్లాక్ మెయిలింగ్ చేయడంలో దిట్ట అయిన బాల్క సుమన్, ఆర్ ఎస్.ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ మంత్రుల గురించి మాట్లాడే ముందు కెసిఆర్ పదేళ్ల పాలనపై ఒక సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కెసిఆర్ కుటుంబంతో సన్నిహితంగా మెలిగే బాల్క సుమన్ వారి అండతో చేసిన అరాచకాలపై చర్చకు సిద్ధమా, శాంతి భద్రతల గురించి మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్ బిఆర్‌ఎస్ హయాంలో కెసిఆర్ కుటుంబం చేసిన ఫోన్ ట్యాపింగ్, దౌర్జన్యాల గురించి చర్చకు ముందుకొస్తారా అని మంత్రి సవాల్ చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ నోరు ఎత్తని ప్రవీణ్ కుమార్ ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో గురుకులాల పరిస్థితిని, ప్రస్తుతం గురుకులాలలో పరిస్థితులను బేరీజు వేసుకుంటే బడుగు బలహీనవర్గాల విద్యార్థుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ప్రాధాన్యతను ఇస్తుందో స్పష్టమవుతుందన్నారు. కొందరు గురుకులాల విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేసి సొంత సైన్యాన్ని నిర్మించుకుని ప్రవీణ్ కుమార్ చేసిన అరాచకాలు బహిరంగ రహస్యమేనని మంత్రి లక్ష్మణ్ అన్నారు. ఐపిఎస్ అధికారిని అని చెప్పుకునే ప్రవీణ్ కుమార్ తెలంగాణలో సంచలనం రేపిన నేరెళ్ల సంఘటనపై ఎందుకు నోరు మెదపలేదని, అప్పుడు బిఆర్‌ఎస్ నేతలను కెసిఆర్ ప్రభుత్వం కాపాడుతుంటే దళితులకు న్యాయం కోసం ప్రవీణ్ కుమార్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. ఉద్యమం పేరుతో యువతను, విద్యార్థులను రెచ్చగొట్టిన బాల్క సుమన్ బిఆర్‌ఎస్‌లో పదవులు అనుభవించారే కానీ, యువత కోసం ఎప్పుడు పోరాడలేదని, బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామకాలు లేకుండా యువత ఉద్యమిస్తుంటే యువనేతగా చెప్పుకునే సుమన్ ఎక్కడ దాక్కున్నారని మంత్రి నిలదీశారు. సొంత కుటుంబ సభ్యులు, మంత్రుల ఫోన్ ట్యాపింగ్ చేసి తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న కెసిఆర్ కుటుంబానికి దాసోహమైన ప్రవీణ్ కుమార్, బాల్క సుమన్‌లకు కాంగ్రెస్ మంత్రుల గురించి మాట్లాడే హక్కే లేదన్నారు. సోషల్ మీడియాలో కేసీఆర్ ప్రభుత్వం అరాచకాలను ప్రశ్నించిన వారిని వేధించిన ఘటనలను ప్రవీణ్ కుమార్ మర్చిపోయారన్నారు.

# భూరి విరాళం



సిపిఐ శతాబ్ది ఉత్సవ సభ ముగింపు సభకు రూ.3.88 లక్షల చెక్కు అందజేసిన ఏదులాపురం గ్రామ శాఖ

ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి ఊతగా నిలుస్తున్న ఏదులాపురం పాత పంచాయతీ సిపిఐ శాఖ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నది. ప్రజా ఉద్యమాలలో తమదైన రీతిలో పాల్గొంటున్న శాఖ ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భూరి విరాళాన్ని అందించింది. మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్‌కు రూ.3,88,000లను అందించి పార్టీ పట్ల తమకున్న అంకిత భావాన్ని చాటారు. రూరల్ మండల సమావేశంలో ఈ విరాళాన్ని అందించారు. ఏదులాపురం పాత గ్రామ పంచాయతీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డు సత్యనారాయణపురం తాళ్లేసేతండా కార్యకర్తల సమావేశం మంగళవారం దరావత్ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సురేష్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి భారత దేశ రాజకీయాలలో ఒక ప్రత్యేక స్థానం ఉందని అధికారం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం, హక్కులు, సంక్షేమం సాధనే లక్ష్యంగా పనిచేసిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో సాయుధ తెలంగాణ పోరాటం ఒక ఉద్యమ ఘట్టమైతే ఖమ్మం జిల్లా అందులో కీలక భూమిక పోషించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ చరిత్ర, ఉద్యమ నేపథ్యానికి అనుగుణంగా ముగింపు సభకు భారీ సంఖ్యలో తరలి రావడంతో పాటు ఇంటింటికి ఉద్యమ చరిత్రను తెలియజేయాలని ఆయన కోరారు. నేటి తరానికి ఉద్యమ చరిత్రను అందించడంతో పాటు కార్యోన్ముఖులను చేయడమే శతాబ్ది ఉత్సవ ముగింపు లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడికంటి వెంకటరెడ్డి, ఐఎఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరిరావు, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, బానోత్ రాంకోటి, మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, నాయకులు మామిడి శంకర్‌రెడ్డి, బాబురెడ్డి, దొంతగాని వెంకన్న, మేళ్లచెరువు వీరబాబు, గణపారపు ఉపేందర్, మిడికంటి అభిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కెసిఆర్ సహా 40 మంది స్టార్ క్యాంపెయినర్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల్లో బిఆర్‌ఎస్ తరపున ఆ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావుతో పాటు మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయిన్ జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆమోదించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్టార్ క్యాంపెయిన్‌గా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు ఎంఎల్‌ఎల పేర్లను చేర్చారు. అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో రెండవ సారి జరుగుతున్న ఉపఎన్నికల్లో కెసిఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారా?, లేదా? అనేది పార్టీ శ్రేణులలో చర్చనీయాంశంగా మారింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం పర్వం మొత్తం కెటిఆర్ నేతృత్వంలోనే సాగుతాయని, ఎన్నికల ప్రచారానికి కెసిఆర్ దూరంగానే ఉండే అవకాశాలు ఉన్నాయని కొందరు పార్టీ వర్గాలు చెబుతున్నారు.

స్టార్ క్యాంపెయిన్ జాబితాలో కెసిఆర్ పేరు ఉన్నప్పటికీ ఆయన మాత్రం ఉప ఎన్నికల ప్రచారానికి దూరంగానే ఉంటూ తన వ్యవసాయ క్షేత్రం నుంచే సమన్వయం చేస్తున్నారని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. స్టార్ క్యాంపెయిన్ జాబితాలో మాజీ మంత్రులు వి.ప్రశాంత్ రెడ్డి, జి.జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, ఎస్. నిరంజన్ రెడ్డి, మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్ రావు, వి.శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్‌తో పాటు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు ఉన్నారు.

## వైన్ షాప్ టెండర్లలో ఆంధ్ర వ్యాపారుల పెత్తనం




ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్న ఆంధ్ర వ్యాపారుల పెత్తనం వైన్ షాప్ టెండర్లలో కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్ ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు హైదరాబాద్ నాంపల్లి అబ్కారి భవన్‌లోని ఎక్సైజ్ శాఖ కమిషనర్‌ను దామోదర్‌గౌడ్‌ను కలిసి సమస్యను వివరించారు. ఆంధ్ర సిండికేట్ వ్యాపారులు తెలంగాణలో చొరబడి అక్రమంగా వ్యాపారాలు చేస్తూ తెలంగాణ వ్యాపారుల పొట్ట గొడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఆంధ్ర వ్యాపారుల కోసమే టెండర్ల గడుపు తేదీని ఎక్సైజ్ శాఖ అధికారులు పెంచినట్టు ఉన్నారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకుని ఆంధ్ర వ్యాపారులకు కేటాయించిన టెండర్లను రద్దు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజా ఆరోగ్యాన్ని పక్కన పెట్టిన ప్రభుత్వం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. బస్తీ దవాఖానలోని సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, బస్తీ దవాఖానల్లో మందులు అందుబాటులో లేవన్నారు. ఖైరతాబాద్‌లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖానను కెటిఆర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో తెలంగాణ డయాగ్నస్టిక్స్ సేవలు కూడా దెబ్బతిన్నాయన్నారు. నాటి సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో పేదల కోసం నాలుగు టిమ్స్, వెయ్యి పడకల ఆసుపత్రులను ప్రారంభించామని, 2000 పడకల నిమ్స్ విస్తరణ పనులను 90 శాతం పూర్తి చేశామని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మిగిలిన 10 శాతం పనులు కూడా చేయలేకపోతోందని మండిపడ్డారు. నగరంలో సక్రమంగా చెత్త ఎత్తడం లేదని, దోమల బెడద పెరిగిందని, తద్వారా ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారని చెప్పారు. ప్రజల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మరో 450 దవాఖానాలను ఏర్పాటు చేయాలని, టిమ్స్ ఆసుపత్రులను వెంటనే పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని, లేదంటే త్వరలో టిమ్స్ ఆసుపత్రుల వద్ద ధర్నా చేస్తాం కెటిఆర్ హెచ్చరించారు. మాజీ మంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులపై నివేదిక సిద్ధం చేసి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తాన్నారు. దానం నాగేందర్ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ అయినప్పటికీ, ఆయన పేరు కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో కనిపించడం ఆశ్చర్యకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్యతో పాటు పలువురు బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లల గొంతు నులిమి తల్లీ ఆత్మహత్య

కుటుంబ కలహాలతో కలత చెంది బలవన్మరణం



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : కుటుంబ కలహాలతో తల్లి, ఇద్దరు పిల్లలు మృతి చెందిన హృదయ విదారక సంఘటన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా జనకవరం గ్రామానికి చెందిన కుంచాల రమేష్ నాగలక్ష్మి దంపతులు, కొండమల్లేపల్లి మండల కేంద్రానికి మూడు సంవత్సరాల క్రితం బతుకు దెరువు కోసం వచ్చి ఆర్.టి.సి బస్టాండ్ వెనుక ఒకరి ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. భర్త రమేష్ తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజుల నుండి భార్య భర్తల మధ్య కుటుంబ సమస్యల విషయంతో గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో వారు ఇద్దరు ఎప్పటి మాదిరిగానే ఆదివారం రాత్రి గొడవ పడ్డారు. భర్త రమేష్ ఇంటి నుండి బయటికి వెళ్ళి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో క్షణికావేశంలో ఆవేదనకు గురైన భార్య నాగలక్ష్మి (30) రాత్రి 9 గంటల తర్వాత తన కుమారుడు భువన్ సాయి(9), కుమార్తె అవంతిక (7)లను ఊపిరి ఆడకుండ చేసి గొంతు నులిమి చంపి ఆమె కూడా ఇంటిలోని చీరతో ఉరి వేసుకొని చనిపోయింది. తెల్లవారిన తరువాత ఇంట్లోవారు ఎవరు బయటికి రాకపోవడంతో గమనించిన ఇరుగుపొరుగు వారు తలుపులు తెలిచి చూడగా తల్లి, పిల్లలు, విగతజీవులుగా కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పంచనామ నిర్వహించి, మృతురాలి తండ్రి తన్నీరు పెద్దరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాలను దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నటు సి.ఐ నవీన్ కుమార్ తెలిపారు.

# నలుగురు మావోయిస్టులు లొంగుబాటు

పోరు కన్నా ఊరు మిన్న... మన ఊరు తిరిగి రండి.. అవగాహన కార్యక్రమం విజయవంతం



ప్రజాపక్షం/ములుగు : ములుగు జిల్లా పోలీసులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన పోరు కన్నా ఊరు మిన్న మన ఊరుకి తిరిగి రండి అనే అవగాహన కార్యక్రమం ఫలితంగా నిషేధిత సిపిఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన నలుగురు అజ్ఞాత సాయుధ దళ సభ్యులు మంగళవారం ములుగు జిల్లా పోలీస్ సూపరింటిండెంట్ డాక్టర్ శబరీష్ ఐపిఎస్ సమక్షంలో లొంగిపోయారు. వీరిలో ముగ్గురు పార్టీ సభ్యులు కాగా, ఒకరు మిలీషియా కమాండర్‌గా పనిచేశారు. లొంగిపోయిన ఈ నలుగురికి తెలంగాణ ప్రభుత్వం సరెండర్ పాలసీ ప్రకారం ప్రతి ఒక్కరికి రూ.25వేల చొప్పున పునరావాస నిమిత్తం నగదు రివార్డు ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ పి స్వయంగా అందజేశారు. ఈ సంవత్సరం జనవరి 2025 నుండి ఇప్పటి వరకు ములుగు జిల్లాలో మొత్తం 84 మంది నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ హోదాల్లో ఉన్న సభ్యులు స్వచ్ఛందంగా ములుగు పోలీసుల సమక్షంలో జనజీవన స్రవంతిలో కలిశారు. వీరిలో డివిసిఎంఎస్ 3, ఏసిఎంఎస్ 11, పార్టీ సభ్యులు 28, మిలీషియా సభ్యులు 32, ఆర్‌పిసి 2 ఒక్కరు, డిఏకెఎంఎస్ ఇద్దరు, సిఎన్‌ఎం సభ్యులు 7 మంది ఉన్నారు. వీరందరికి తెలంగాణ ప్రభుత్వ పునరావాస పథకం ప్రకారం తగిన ఆర్థికసాయం, వైద్య సేవలు, జీవనోపాధి అవకాశాలు కల్పించబడతున్నాయన్నారు. మావోయిస్టు పార్టీ బలహీనపడుతున్న నేపథ్యంలో క్రింది స్థాయి క్యాడర్లపై నాయకత్వంపై అసంతృప్తితో రహస్య జీవితం వదిలి కుటుంబాలతో కలిసి శాంతియుత జీవితం గడపాలనే సంకల్పంతో లొంగిపోతున్నారని జిల్లా ఎస్‌పి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ సరెండర్ పాలసీని అమలు చేస్తుందని, లొంగిపోయిన వారికి నగదు రివార్డు, వైద్య సేవలు, పునరావాస సదుపాయాలు, సమాజంలో తిరిగి స్థిరపడేందుకు పూర్తి మద్దతు అందిస్తుందన్నారు. అలాగే అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులను వివిధ పద్ధతుల్లో, మాధ్యమాల ద్వారా ప్రజా స్రవంతిలో కలవాలని పోలీస్‌శాఖ విజ్ఞప్తి చేస్తోంది. లొంగిపోయిన వారిలో కోమటిపల్లికి చెందిన మడావి కోసి మడారి ఎదుర్నే, ముచాకి దేవా వెంకటాపురం, జన్నగూడకు చెందిన మడకం బండిలు ఉన్నారు. ములుగు జిల్లా పోలీసులు మావోయిస్టులకు శాంతి మార్గం వైపు తిరిగి రావాలని విజ్ఞప్తి చేస్తూ సమాజంలో సుస్థిర అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం

తెలంగాణలో ఐదు రోజులు భారీ వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాగల ఐదురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మంగళవారం ఉదయం అల్పపీడనంగా మారిందని తెలిపారు. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ బుధవారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళ నాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకొని ఉన్న నైరుతి, పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత పశ్చిమవాయువ్య దిశగా కదిలి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర వైపు కదులుతూ 24 గంటల్లో మరింత బలపడే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణలో ఐదురోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. మంగళవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వండి

కోదండరామ్‌కు టిపిసిసి చీఫ్ లేఖ





ప్రజాపక్షం/హైదరాబాద్: జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతు ఇవ్వాలని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఆయన కోదండరామ్‌కు లేఖ రాశారు. ప్రస్తుత తరుణంలో వచ్చిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు అత్యంత కీలకమని, అందుకే బిఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఇప్పటికే సిపిఐ, సిపిఐ(ఎం), ఎంఐఎం పార్టీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. గత బిఆర్‌ఎస్ పాలనలో కెసిఆర్ ఎంతటి విధ్వంసానికి పాల్పడ్డారో 'మీకు' (కోదండరామ్) బాగా తెలుసని, అర్ధరాత్రి 'మీ' ఇంటి తలుపులు పగులగొట్టి ఒక ఉగ్రవాది తరహాలో అరెస్ట్ చేసిన ఉదంతాన్ని తెలంగాణ సమాజం ఇంకా మరచిపోలేదని మహేష్ కుమార్ గౌడ్ ఆ లేఖలో పేర్కొన్నారు. గత 22 నెలలుగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ ఆ లేఖలో పేర్కొన్నారు.

# ఆ స్కామ్‌కు.. ఐటి శాఖ పేషీతో సంబంధం లేదు: మంత్రి ఓఎస్‌డి స్పష్టం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఐటి ప్రాజెక్ట్ ఇప్పిస్తామని మోసగించిన స్కామ్ లో ఐటి శాఖ పేషీలో ఎవరికి సంబంధంలేని అదంతా ప్రైయివేట్ వ్యక్తుల ప్రమేయంతో జరిగిందని ఐటి మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్‌డి రఘురామశర్మ ఒక ప్రకటనలో స్పష్టత ఇచ్చారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో సచివాలయంలో ఐటి మంత్రి పేషీ పేరిట 'ఐటీ ప్రాజెక్ట్ ఇప్పిస్తామంటూ రూ.1.77 కోట్లు స్వాహా' అంటూ వస్తున్న వార్తా కథనంపై మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్‌డి రఘురామ శర్మ వివరణ ఇచ్చారు. ఈ ఘటన సుమారు నాలుగు నెలల కిందట జరగడంతో సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో ఈ ఏడాది జూన్ 3న ఎఫ్ఐఆర్ నమోదు అయ్యిందని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు స్వయంగా తానే సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కూడా కోరడం జరిగిందన్నారు.

ఈ వ్యవహారంలో ఆరుగురికి ప్రమేయం ఉన్నట్లుగా గుర్తించిన సైఫాబాద్ పోలీసులు వారిపై కేస్ నమోదు చేసి... దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు కూడా పంపించారన్నారు. తీవ్రత దృష్ట్యా కేసును పోలీసులు తాజాగా సైఫాబాద్ పిఎస్ నుంచి హైదరాబాద్ సిసిఎస్‌కు బదిలీ చేశారు. అందుకే గతంలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చిందని అన్నారు. ఈ ఘటనలో తమ పేషీకి గానీ, సిబ్బందికి గానీ ఎలాంటి సంబంధం లేదు. మీడియా ఈ విషయాన్ని గమనించి సహకరించగలరని ఆయన విజ్ఞప్తి చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
**పర్యవేక్షక అధికారి కార్యాలయం, నీటి పారుదల శాఖ, కామారెడ్డి జిల్లా**

టెండర్ నోటీస్ నంబర్: 14/SE/IC/KMR/2025-26, Dt: 14-10-2025 రూ. 45.459 లక్షలకు పని లభ్యమగు తేది: 21-10-2025, ఉదయం 11:00 గం. నుండి 04-11-2025 సాయంత్రం 5:00 గం. వరకు టెండర్లు ఆహ్వానించనైనది.
మిగతా వివరాలకు మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు.
Sd/- I/c. Superintending Engineer, Irrigation Circle, Kamareddy.
DIPR R.O. No. : 9498-PP/CL/ADVT/1/2025-26 Date: 21-10-2025

hmda Growing Global
**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
**హైదరాబాద్ ఏకీకృత మహానగర రవాణ అథారిటీ కార్యాలయం**
7వ ఫ్లోర్, నార్త్ వింగ్, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

NIT No.116/ HMDA/ HUMTA/SKYWALK-JNTUH/2025 (ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్) తేదీ: 21.10.2025

'జెఎన్‌టియు-హైదరాబాద్ పరిసరాల్లో పాదచారుల స్కైవాక్ కోసం వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్టును తయారుచేయడానికి కన్సల్టెన్సీ సేవలు పని కోసం' చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ సంస్థల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్లు ఆహ్వానించబడ్డాయి. బిడ్డింగ్ ప్రక్రియ షెడ్యూల్ ఈ క్రింది విధంగా చూపబడింది.

| క్ర.సం. | ఈవెంట్ వివరణ | తేదీ |
|---|---|---|
| 1. | RFP పేపర్ పబ్లికేషన్ ఇష్యూ | 23.10.2025 |
| 2. | ప్రశ్నలు /వివరణలు స్వీకరించడానికి చివరి తేదీ | 28.10.2025 సాయంత్రం 5: 00 గంటల వరకు |
| 3. | ప్రీ-బిడ్ సమావేశం తేదీ | 30.10.2025 @ 3: 30PM. |
| 4. | సాంకేతిక బిడ్ & : ఫైనాన్షియల్ బిడ్ సమర్పణ | 11.11.2025 3:00 PM వరకు |
| 5. | అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్స్ హార్డ్ కాపీలను సమర్పించడానికి చివరి తేదీ | 13.11.2025 మధ్యాహ్నం 3గంటలకు. O/o MD, HUMTA, HMDA. |
| 6. | సాంకేతిక బిడ్ తెరవడం | 13.11.2025 @ 3 : 30 PM. |
| 7. | ఫైనాన్షియల్ బిడ్ తెరవడం | 28.11.2025. |

మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.in
సం/- మేనేజింగ్ డైరెక్టర్ HUMTA, HMDA.
DIPR R.O. No. : 9526-PP/CL/ADVT/1/2025-26, Date: 21-10-2025


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
బాదావత్తు బాలకిషన్
తాజా మాజీ సర్పంచ్ నాజీతండా
బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు


కా॥ పల్లా వెంకట్‌రెడ్డి
కా॥ కూనంనేని సాంబశివరావు
కె. శ్రీనివాస్‌రెడ్డి
కా॥ నెల్లికంటి సత్యం
పాఠకులకు, పాత్రికేయులకు, యాజమాన్యానికి, సిబ్బందికి
ప్రజాపక్షం దినపత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
- కలకొండ సంజీవ
ప్రజాపక్షం రిపోర్టర్
సంస్థాన్ నారాయణపురం, యాదాద్రి భువనగిరి జిల్లా


Keerti Hospital
Women and Children
WE CARE FOR EVERY MOTHER & CHILD
MATERNITY | GYNECOLOGY | PEDIATRICS
GYNECOLOGY
Menstrual problems
PCOD
Infertility
Normal delivery
Cesarean delivery
Pain less delivery
Laparoscopy surgeries
PAEDIATRICS
NICU
PICU
Phototherapy
Baby Spa & Hydrotherapy
Ventilator
Vaccination
Paediatric Superspeciality
All private Health Insurances& Reimbursement facilities available
9305 444 555, 9014 140 455
Opp: CMR Shopping Mall Lane, Beside Rang Bar Lane, Naim Nagar, Hanamkonda


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
డా॥ ఎ. నరేష్
MD, FIRH (Manipal)
సీనియర్ రుమటాలజిస్ట్
(కీళ్ళ వైద్య నిపుణులు)
డా॥ నరేష్ ఆర్థరైటిస్ & రుమటిజం సెంటర్
సెల్: 9492831111, 9492841111


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
STATE BEST SCHOOL AWARDEE
41 Years of Excellence in Education
KAKATIYA
BRILLIANT STARS
HIGH SCHOOL (E.M)
Nursery - X | Day & Residential
IIT & NEET Foundation
SSC RESULTS - 2025
100% First Division
ADMISSIONS OPEN
RUDRAGUDEM
Nallabelly Mdl., Warangal Dist., TG
9177995833, 9951132266, 9908762234


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..
THALLADA MANDAL SCHOOL GAMES CHAMPION
UNIVERSAL VIDYALAYAM
(Recognized by Govt. of Telangana) Nursary to X Class E.M.
Thallada, Khammam Dist. 507 167


ప్రజాపక్షం
దిన పత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
బుర్రని శ్రావని-బాలు


ప్రజాపక్షం దినపత్రిక 7 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు..


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
హెల్త్ ప్లస్ హాస్పిటల్స్
HEALTH PLUS Hospitals
రోడ్డు ఆక్సిడెంట్స్ లేదా ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి క్షణం విలువైనదే...
24/7 అన్ని సమయాల్లో అన్ని రకాల ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ సేవలు...
+91 769 108 108 4
+91 9010862108



ప్రజాపక్షం దినపత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజా గొంతుకై నిలుస్తున్న ప్రజాపక్షం దినపత్రికకు
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీకాంతప్ప
నిట్టలక్కప్ప
ఆకుల శ్రీనివాస్


ప్రజాపక్షం దినపత్రిక
7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
బొమ్మల మైసయ్య
కాసాల విఠల్


ప్రజాపక్షం దినపత్రికకు 7వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి
కార్తీకపౌర్ణమి శుభాకాంక్షలు...
శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు
MLA వరంగల్ పశ్చిమ
బంక సంపత్ యాదవ్ - నాయిని లక్ష్మారెడ్డి


ప్రజాపక్షం
దినపత్రికకు
7వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు


7 వ వార్షికోత్సవ
ప్రజాపక్షం దినపత్రిక
శుభాకాంక్షలు...



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నామినేషన్ వేసిన వెంటనే ఆర్‌జెడి అభ్యర్థి అరెస్టు

**ససారామ్ :** బిహార్‌లోని ససారాం అసెంబ్లీ స్థానం నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన వెంటనే అభ్యర్థి సతేంద్ర సాహ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ పెండింగ్‌లో ఉన్నందున సతేంద్రను జార్ఖండ్ పోలీసులు అరెస్టు చేశారని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు తెలిపారు. సతేంద్ర సోమవారం ససారాం స్థానం నుండి నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి సంబంధిత సర్కిల్ అధికారి కార్యాలయానికి చేరుకోనేగానే జార్ఖండ్ పోలీసు అధికారులు అతడిపై పెండింగ్‌లో ఉన్న ఎన్ బిడబ్ల్యును అమలు చేయడానికి అక్కడికి వచ్చారని, అతను నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి అనుమతించినప్పటికీ ఆ తరువాత అతన్ని అరెస్టు చేసినట్లు రోహ్తాస్ జిల్లాకు చెందిన ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గర్వా జిల్లాలోని చిరౌంజియా మోర్‌లో 2004లో జరిగిన బ్యాంకు దోపిడీ కేసులో అతను నిందితుడని జార్ఖండ్ పోలీసులు తెలిపారు. ఈఅరెస్టును ఖండిస్తూ సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. 'రాజకీయ ప్రేరేపిత అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## బోనస్ ఇవ్వలేదని టోల్‌ప్లాజా గేట్లు ఎత్తేసిన సిబ్బంది



**ఫతేహాబాద్ :** దీపావళి పండుగకు సరిపడా బోనస్ ఇవ్వలేదన్న కారణంతో సిబ్బంది విధులను పక్కనబెట్టి టోల్ గేట్లను ఎత్తేశారు. దీంతో వేలాది వాహనాలు ఎలాంటి చార్జీలు చెల్లించకుండానే ఉచితంగా వెళ్లిపోయాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేహాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే ఆగ్రా–లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై సోమవారం ఈ ఘటన జరిగింది. టోల్ బూత్‌ల గుండా వాహనాలు స్వేచ్ఛగా కదులుతున్నట్లు ఫుటేజ్‌లో చూపించారు. ఈ నిరసన వల్ల కేంద్ర ప్రభుత్వానికి లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని భావిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కీలక మార్గం అయిన ఈ ఎక్స్‌ప్రెస్‌వే, ఆగ్రా, లక్నో మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటుంది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా ఢిల్లీ–ఎన్‌సిఆర్‌ను కూడా అనుసంధానిస్తుంది. జీతాలు తరచుగా ఆలస్యం అవుతాయని, కంపెనీ ఎటువంటి బోనస్ ఇవ్వకుండా వాటిని భర్తీ చేయాలని చెప్పిందని ఉద్యోగులు చెబుతున్నారు. శనివారం రాత్రి, శ్రీ సాయి, దాతర్ కంపెనీలకు చెందిన 21మంది ఉద్యోగులు నిరసనగా టోల్ ప్లాజా బూమ్‌ను ప్రారంభించారు. ధర్నా 10 గంటల పాటు కొనసాగింది. అధికారులు బోనస్ అందిస్తామని హామీ ఇచ్చే వరకు టోల్ ప్లాజా పనిచేయలేదు. కంపెనీ గత వారం బోనస్‌లకు హామీ ఇచ్చిందని, కానీ ఆ మొత్తం ఇంకా జమ కాలేదని ఉద్యోగులు చెబుతున్నారు. అయితే ఈ నిరసన దీపావళి బోనస్ రూ. 1,100పై జరిగిందని తెలుస్తోంది. ఇది గత సంవత్సరం రూ. 5,000 బోనస్ ఇవ్వగా, ఈసారి భారీగా తగ్గించడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఘటనకు సంబంధించి కంపెనీ ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు.

## ఎక్కడా కనిపించని దీపావళి ఆంక్షలు

ఐదేళ్ళలో లేనంతగా ఢిల్లీలో పెరిగిన కాలుష్యం
బాణసంచా అరికట్టలేకపోయారు
ప్రతి మనిషి రోజుకు పది సిగరెట్టు కాల్చినట్టే!



**న్యూఢిల్లీ:** దీపావళి వేడుకల తర్వాత ఢిల్లీ నగరంలో గాలి నాణ్యతా ప్రమాణాలు కనిష్ఠస్థాయికి క్షీణించాయి. కాలుష్య ధూళి మేఘం ఢిల్లీని దుప్పటిలా కప్పేసింది. ఢిల్లీలో పీల్చేగాలిలో నాణ్యతా ప్రమాణాలు పెంచడానికి ఎన్నో ఆంక్షలు అమలు చేస్తున్నప్పటికీ ప్రజలు సహకరించడంలేదని దీపావళి మరునాటి కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది దీపావళి పండుగ బాణసంచా వేడుకలు ఇటీవలి సంవత్సరాలలో అత్యంత దారుణమైన కాలుష్యం సృష్టించాయని సంబంధిత నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఎన్‌సిఆర్‌లో ఇప్పటికే ఊహించనిస్థాయిలో గాలి కాలుష్యం ఉండగా, బాణసంచాను అనుమతించడంతో తట్టుకోలేనంతస్థాయిలో ఈ ఏడాది దీపావళికి కాలుష్యం పెరిగింది. దీనివల్ల కాలుష్య రేణువుల చిక్కదనం గాలిలో అతి తీవ్రస్థాయికి చేరింది.దీ సిగరెట్టు అలవాటు లేకపోయినాగానీ ఈ గాలి పీలిస్తే రోజుకు 10 సిగరెట్లు కాల్చినట్లే అవుతుందని వైద్యులు హెచ్చరించారు. ఇది సుదీర్ఘంగా కొనసాగితే ఆస్తమా తీవ్రస్థాయికి చేరుతుంది. శ్వాసకోశ సమస్యలు, గుండెకు రక్తాని సరఫరా చేసే నాళాలకు అతి తీవ్రమైన వ్యాధులు సోకే ప్రమాదం ఉంటుంది. గుండె వ్యాధులు పెరిగే అపాయం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల ప్రకారం, గుండె ఆరోగ్యానికి ప్రధానమైన స్వచ్ఛమైన గాలిలో కాలుష్య కారక రేణువులు దీపావళి పండుగ మరునాటికల్లా ఢిల్లీలో గణనీయ స్థాయిలో పెరిగిపోయాయి. ఊపిరి పీల్చుకున్నప్పుడు శ్వాసకోశాల ద్వారా ఈ కాలుష్య కారక రేణువులు శరీరంలో ప్రవేశించి ఆరోగ్యానికి తీవ్ర హాని చేస్తాయి.ఢిల్లీలో దీపావళి తర్వాత గాలిలో ఈ కాలుష్య కారక రేణువులు ఐదేళ్ళలో ఎన్నడూ లేనంతగా (పిఎం 2.5) పెరిగాయి. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో కాలుష్య కారక రేణువుల చిక్కదనం గాలిలో ఒక్కొక్క క్యుబిక్ మీటరుకు 488 మైక్రోగ్రాములకు పెరిగిపోయింది. పండుగకు ముందు గాలిలో ఈ రేణువుల చిక్కదనం ఒక క్యుబిక్ మీటరుకు 156.6 మైక్రోగ్రాములుగా ఉండేది. సోమవారం నుండీ బాణసంచా కాల్చిన తర్వాత 24గంటల్లో ఈ కాలుష్య కారక రేణువులు ఒక్కొక్క క్యుబిక్ మీటరుకు 350 మైక్రోగ్రాములు పెరిగాయి. 2021 నుండి 2025 వరకూ చూసినప్పుడు ఈ కాలుష్య కారకాలు ఈ ఏడాదిలో అనూహ్యంగా ఐదేళ్ళ గరిష్ఠస్థాయికి పెరిగాయి. ఈ కాలుష్య కారకమైన రేణువుల పరిమాణం అంటే పిఎం 2.5 విలువ స్థిరంగా పెరగుతోంది. 2021 నుండీ లెక్కవేస్తే ఇప్పటివరకూ ఐదేళ్ళలో దీపావళి రోజు రాత్రిళ్ళు ప్రతి సంవత్సరం ఈ కాలుష్య కారకాలు గణనీయంగా స్థిరంగా పెరగుతున్నాయి. 2021లో పిఎం 2.5 స్థాయి ముందురోజు క్యుబిక్ మీటరుకు 163.1 మైక్రో గ్రాములుండగా తర్వాత 454.5 మైక్రోగ్రాములకు పెరిగింది. 2022లో దీపావళి ముందురోజు 129.3 నుండి 168 మైక్రోగ్రాములకు, 2023లో 92.9 నుండి 319.7 మైక్రోగ్రాములకు, 2024లో 204 నుండి 220 మైక్రోగ్రాములకు పెరుగుతూ వచ్చాయి. ఈ ఏడాది ఇంకా గణనీయంగా ఒక క్యుబిక్ మీటరుకు 488 మైక్రోగ్రాములకు పెరిగిపోయింది.

అనేక సంవత్సరాలుగా ఢిల్లీలో కాలుష్యం అతి పెద్ద సమస్యగా మారడంతో సర్వోన్నత న్యాయస్థానం కూడా దీనిపై దృష్టి కేంద్రీకరించి కాలుష్య నియంత్రణ చర్యలకు ఆదేశాలు ఇచ్చింది. కానీ ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన రాజధాని కాలేజీ ప్రొఫెసర్ ఎస్.కె.ధాకా చెప్పిన ప్రకారం చూస్తే, ఢిల్లీలో గాలి వేగం చాలా చాలా తక్కువగా ఉంది, గాలి చలనానికి అవకాశాలు తగ్గిపోయాయి.. అదే విధంగా హరిత బాణసంచా పేరుతో చలామణీ అవుతున్న టపాసులను కూడా నియంత్రించాలి. వాటి నాణ్యతలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్ని ఆంక్షలు విధించినా గానీ, కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడంలో ఎన్నో లోపాలు ఎదురవుతున్నాయి. ఆరోగ్యానికి తీవ్రహాని కలుగుతుందని ఎన్ని హెచ్చరికలు చేసినప్పటికీ కూడా ప్రజలు వాటిని గౌరవించకపోవడం, భయపడైనాగానీ అమలు చేయకపోవడం సమస్యగా మారింది. బాణసంచా కాల్చడంవల్ల జరుగుతున్న నష్టాలు ఏమిటో గడచిన ఐదు సంవత్సరాలుగా ప్రత్యక్షంగా అనుభవిస్తున్నప్పటికీ కూడా అదే తప్పు మళ్ళీ మళ్ళీ చేయడం చాలా బాధాకరంగా ఉందని ''క్లైమేట్ ట్రెండ్స్'' వ్యవస్థాపక సంచాలకులు ఆర్తీ ఖోస్లా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'క్లైమేట్ ట్రెండ్స్' రీసెర్చ్ లీడర్ పాలక్ బాయన్ మాట్లాడుతూ, ఈ ఏడాది దీపావళి ఇటీవలి సంవత్సరాలలో అత్యంత కాలుష్యమైన దీపావళిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సగటు ఉష్ణోగ్రతలు 19 డిగ్రీల సెల్సియస్ నుండి 27 డిగ్రీల సెల్సియస్ ఉండాలి. దీపావళి తర్వాత కాలుష్య రేణువులు పెరగడంవల్ల ఉష్ణోగ్రత కొద్దిగా తగ్గింది. వాహన కాలుష్యంతోపాటు ఎంతమాత్రం అనుకూలంగా లేని వాతావరణ పరిస్థితులు ఈ ఏడాది తోడయ్యాయి. పంటల వ్యర్థాలను కూడా విపరీతంగా దగ్ధం చేయడం మరో ప్రధాన సమస్య. దీనికి తోడు బాణసంచా కాల్చడానికి కూడా బాగా అనుమతించారని స్థానిక వాతావరణ కాలుష్య విభాగం వెల్లడించింది.

## సమాజంలో కొత్తరకంగా నేరాలు, ఉగ్రవాదం

కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులకు శ్రద్ధాంజలి

**న్యూఢిల్లీ :** సరిహద్దులో అస్థిరత ఉన్నప్పటికీ సమాజంలో కొత్త రకం నేరాలు, ఉగ్రవాదం, సైద్ధాంతిక యుద్ధాలు ఉద్భవిస్తున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. మంగళవారంనాడు ఆయన పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఇక్కడి జాతీయ పోలీస్ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ మిలిటరీ, పోలీస్ వేర్వేరు వేదికలుగా పనిచేస్తారని, అయితే వారి లక్ష్యం దేశాన్ని రక్షించడమేనని సింగ్ చెప్పారు. 2047నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలంటే దేశం యొక్క బాహ్య, అంతర్గత భద్రత చాలా ముఖ్యమైనదని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు (సిఎపిఎఫ్), ఢిల్లీ పోలీస్ సంయుక్తంగా కవాతు నిర్వహించారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ నేరాలు మరింత వ్యవస్థీకృతంగా, అదృశ్యంగా మారాయని, సమాజంలో గందరగోళాన్ని సృష్టించడం, విశ్వాసాన్ని దెబ్బతీయడం, దేశ స్థిరత్వాన్ని దెబ్బతీయడమే దీని ఉద్దేశ్యమని ఆయన అన్నారు.త సమాజంపై నమ్మకాన్ని కాపాడుకునే నైతిక విధిని నిర్వర్తిస్తూనే నేరాలను అరికట్టే అధికారిక బాధ్యతను నిర్వర్తించినందుకు మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పోలీసులను ప్రశంసించారు. 'ఈరోజు ప్రజలు ప్రశాంతంగా నిద్రిస్తున్నారంటే దానికి కారణం అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్న మన సాయుధ బలగాలు అప్రమత్తంగా ఉన్న మన పోలీసులపై ఉన్న నమ్మకమేనన్నారు. ఇది మన దేశ స్థిరత్వానికి పునాది వేస్తుంది' అని ఈ కార్యక్రమానికి హాజరైన సిబ్బందిని ఉద్దేశించి సింగ్ చెప్పారు. చాలా కాలంగా అంతర్గత భద్రతకు సవాల్‌గా మారిన నక్సల్స్ సమస్యపై దృష్టిని మరల్చుతూ పోలీసులు, సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్ మరియు స్థానిక పరిపాలన యొక్క సమష్టి, వ్యవస్థీకృత ప్రయత్నాలు సమస్య



తీవ్రతరం కాకుండా చూసుకున్నాయని, దీంతో వామపక్ష తీవ్రవాద ప్రాబల్యం ఉన్న ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని చెప్పారు. నక్సల్ సమస్య వచ్చే ఏడాది మార్చి నాటికి ముగుస్తుందనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేస్తున్నారు. అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా భద్రతా సమస్య ఇప్పుడు చరిత్రగా మారే దశలో ఉందని అన్నారు. మార్చి 2026నాటికి నక్సల్స్ సమస్య ముప్పు అంతం అవుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించి ఉన్నారు. జాతీయ భద్రతను నిర్ధారించడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం నిబద్ధతను రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. 'చాలాకాలంగా, మనం, ఒకదేశంగా, పోలీసుల సహకారాన్ని మనం పూర్తిగా గుర్తించలేకపోయాం. అయితే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం 2018లో మన పోలీస్ దళాల జ్ఞాపకాలను గౌరవించుకోవడానికి జాతీయ పోలీస్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేసింది' అని రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడించారు. 1959లో లద్దాఖ్ ప్రాంతంలో చైనా దళాల ఆకస్మిక దాడిలో మరణించిన 10 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది (సిఆర్‌పిఎఫ్) జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటాం.

## బిహార్‌లో పోటీ నుంచి తప్పుకున్న జెఎంఎం..

143 మంది అభ్యర్థులను ప్రకటించిన ఆర్‌జెడి

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్నప్పటికీ విపక్ష ఇండియా కూటమిలో సీట్ల పంపకాలపై ఓ స్పష్టత రాలేదు. దీంతో లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ ఆర్‌జెడి 143 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ 60 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. సీట్ల సర్దుబాటులో కూటమి పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) ఎన్నికల బరి నుంచి తప్పుకుంది. తాము ఈ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని ప్రకటించింది. ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగుతామని ప్రకటించిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. కాంగ్రెస్, ఆర్‌జెడి రాజకీయ కుట్ర కారణంగానే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. 'మహాఘట్‌బంధన్' కూటమిలో భాగంగా తమకు సీట్లు దక్కకుండా ఆర్‌జెడి, కాంగ్రెస్ కుట్ర పన్నాయని జెఎంఎం ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఝార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్‌జెడిలతో ఉన్న పొత్తును తమ పార్టీ సమీక్షిస్తుందని జెఎంఎం సీనియర్ నేత సుదివ్య కుమార్ తెలిపారు. వారికి తమ పార్టీ తగిన సమాధానం ఇస్తుందని చెప్పారు. మరోవైపు తొలివడతలో భాగంగా పోలింగ్ జరుగనున్న 121స్థానాల్లో విపక్ష కూటమి నుంచి 125మంది పోటీలో ఉన్నారు. కూటమిలో సమన్వయ లోపానికి ఇదే నిదర్శనమని ప్రత్యర్థులు పేర్కొంటున్నారు. కాగా, ఆర్‌జెడి 143 మంది అభ్యర్థులను ప్రకటించడంతో మహాఘట్‌బంధన్‌లో సీట్ల పంపకాలు కూడా ఓ కొలిక్కి వచ్చినట్లేనని అనుకోవాలి. ఆర్‌జెడి 143, కాంగ్రెస్ 55, సిపిఐ(ఎంఎల్) 20, సిపిఐ 6, సిపిఐ(ఎం) 4, విఐపి 15 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. అయితే ఇప్పటికే కాంగ్రెస్ 60 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో కొన్ని చోట్ల విపక్ష కూటమిలోని పార్టీల మధ్య పోటీ తప్పడం లేదు. బిహార్‌లో తొలివిడుత నామినేషన్ల గడువు అక్టోబర్ 17న ముగిసింది. అదేవిధంగా రెండో విడతకు సోమవారమే చివరి రోజు. నవంబర్ 6, 11వ తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అదే నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలను ప్రకటిస్తారు.

## ఎంఇఎ ప్రయత్నాలను తిరస్కరించిన ట్రంప్

రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపేస్తామని
మోదీ హామీనిచ్చినట్లు ట్రంప్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** మోదీ నేతృత్వంలోని బిజెపి సర్కార్ తీవ్రంగా విరుచుకుపడింది. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులకు సంబంధించిన అంశాన్ని గత రోజుల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తావించడంపై మండిపడింది. రష్యా నుంచి భారతదేశం చమురు దిగుమతులను నిలిపివేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చిన సంభాషణను తిరస్కరించడానికి భారత విదేశాంగ మంత్రిత్వశాఖ చేసిన ప్రయత్నాలను తొలగించారని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తే భారతదేశం భారీ సుంకాలు చెల్లించబోతోందని ట్రంప్ చెప్పిన తర్వాత, న్యూఢిల్లీ మాస్కో నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని పునరుద్ఘాటించిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ ఈ ప్రకటన చేసింది. 'రష్యా నుంచి భారతదేశం చమురు దిగుమతులను నిలిపివేస్తుందని అధ్యక్షుడు ట్రంప్ గత ఐదు రోజుల్లో మూడుసార్లు లేవనెత్తారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ఈ వారం చివర్లో బుడపెస్ట్‌లో రష్యా అధ్యక్షుడు (వ్లాదిమిర్) పుతిన్‌ను కలవడానికి సిద్ధమవుతున్నందున ట్రంప్ తన వ్యాఖ్యలను ముమ్మరం చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ట్రంప్ తన మంచి స్నేహితుడు మిస్టర్ మోదీతో మాట్లాడానని, భారతదేశం ఈ దిగుమతులను నిలిపివేస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. అయితే అటువంటి సంభాషణల గురించి తమకు తెలియదని ఎంఇఎ చెబుతోంది, కానీ ట్రంప్ ఎంఇఎ తిరస్కరించే ప్రయత్నాలను స్పష్టంగా తోసిపుచ్చారన్నారు. కాగా, ట్రంప్ ఆపరేషన్ సిందూర్‌ను ఆపివేసినట్లు లేదా భారతదేశం రష్యా నుండి చమురు దిగుమతులను తగ్గిస్తుందని చెప్పినప్పుడల్లా ప్రధాని అకస్మాత్తుగా 'మౌని బాబా' అవుతారని కాంగ్రెస్ శనివారం పేర్కొంది.

## మహారాష్ట్రలో విషాదం – అగ్నిప్రమాదంలో నలుగురు మృతి

**ముంబయి :** మహారాష్ట్రలోని విషాదం చోటు చేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పొరుగున ఉన్న నవీ ముంబయిలోని ఒక బహుళ అంతస్తుల నివాస భవనంలో జరిగిన అగ్నిప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో 10 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. దీపావళి తెల్లవారుజామున జరిగిన వాషి ప్రాంతంలోని సెక్టార్ 14లోని రహేజా రెసిడెన్సీ, ఎంజిఎం కాంప్లెక్స్‌లోని 10వ అంతస్తులో తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. మంటలు వెంటనే 11, 12వ అంతస్తులకు వ్యాపించాయని అగ్నిమాపక దళ అధికారి తెలిపారు. ఎనిమిది అగ్నిమాపక దళాలు, పోలీసులతో 40 మంది అగ్నిమాపక దళ సిబ్బంది తెల్లవారుజామున మంటలను ఆర్పివేసినట్లు ఆయన తెలిపారు. మృతుల్లో వేదిక సుందర్ బాలకృష్ణన్(6), ఆమె తల్లిదండ్రులు సుందర్ బాలకృష్ణన్(44), తల్లి పూజ రాజన్(39) ఉన్నారు. వీరంతా ఫ్లాట్ 1205లో నివసిస్తున్నారు. కమలా హిరాలాల్ జైన్ (84) అనే మరో మహిళ 11వ అంతస్తులో నివాసముంటున్నారు. ఆమె మంచానికే పరిమితం కాగా, మంటలు చెలరేగిన తర్వాత కదలలేకపోయిందని అధికారి తెలిపారు. రెండు ఆసుపత్రులలో చేరిన గాయపడిన వారిలో ఎక్కువ మంది ఊపిరాడక ఇబ్బంది పడుతున్నట్లు ఫిర్యాదు చేశారని, వారిలో ఏడుగురిని డిశ్చార్జ్ చేయగా, మిగిలిన ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉందని, అగ్నిమాపక దళం భవనం నుండి డజనుకు పైగా ప్రజలను రక్షించిందని కదమ్ చెప్పారు. వాషి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడి తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన చెప్పారు.

## ఏదైనా కుట్ర కోణం ఉందా?

అయ్యప్ప దేవాలయంలోని విగ్రహాల బంగారం తాపడం
బరువులో వ్యత్యాసంపై దర్యాప్తు చేయాలి
కేరళ హైకోర్టు ఆదేశం

**తిరువనంతపురం :** శబరిమల అయ్యప్ప దేవాలయంలోని విగ్రహాల బంగారం తాపడం బరువులో వ్యత్యాసం కేసులో ఏదైనా కుట్ర జరిగిందా అని దర్యాప్తు చేయాలని కేరళ హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్ని కృష్ణన్ పొట్టి వెనుక భారీ శక్తులే ఉన్నాయని అనుమానం వ్యక్తం చేసింది. ఈ కేసులో వేగవంతమైన, కచ్చితమైన దర్యాప్తు జరగాలని సిట్‌ను జస్టిస్ రాజా విజయరాఘవన్ వి,జస్టిస్ కెవి జయకుమార్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. మంగళవారం ఈ కేసుకు సంబంధించిన సిట్ తన తాత్కాలిక నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పించింది. మరోవైపు దర్యాప్తు గోప్యతను కాపాడేందుకు హైకోర్టు సుమోటోగా కొత్త పిటిషన్‌ను నమోదు చేయాలని నిర్ణయించింది. దీనిలో ప్రస్తుత పిటిషన్‌లోని ఉన్నికృష్ణన్ పొట్టి, స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ మినహాయించాలని, బదులుగా ప్రభుత్వాన్ని, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, పోలీసులను చేర్చాలని ధర్మాసనం స్పష్టం చేసింది. బంగారం దొంగతనం జరిగిన సమయంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు, కమిషనర్ తీసుకున్న చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని పేర్కొంది. దేవస్థానం బోర్డు అధ్యక్షుడు, ఉన్నికృష్ణన్ పొట్టికు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాన్ని తేలికగా తీసుకోలేమని తెలిపింది. దేవస్థానం మాన్యువల్ ఉల్లంఘనలపై కూడా తీవ్ర అనుమానాలు ఉన్నాయని చెప్పింది. ఈ క్రమంలో గత రెండు సంవత్సరాల్లో జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, కుట్రలను పూర్తిగా పరిశీలించాలని సిట్‌ను ధర్మాసనం ఆదేశించింది. సుమారు 500 గ్రాముల బంగారం ఎక్కడికి వెళ్లిందో దేవస్థానం అధికారులకే తెలిసి ఉండవచ్చని కూడా కోర్టు వ్యాఖ్యానించింది. ఉన్నికృష్ణన్ పొట్టి ఉద్దేశాలు సరైనవి కాదని, అన్ని సంబంధిత పత్రాలు పరిశీలించి తుది నివేదిక సమర్పించాలని సిట్‌కు సూచించింది. ఈ కేసు కేవలం కేరళ పోలీసుల ప్రతిష్ఠకే కాకుండా, హైకోర్టు నమ్మకానికీ సంబంధించినదని బెంచ్ పేర్కొంది.

## తమిళనాడు అంతా విస్తరించిన ఈశాన్య రుతుపవనాలు

8 జిల్లాలకు రెడ్ అలర్ట్
పరిస్థితిపై సిఎం స్టాలిన్ సమీక్ష

**చెన్నై :** తమిళనాడు అంతటా ఈశాన్య రుతుపవనాలు విస్తరించాయి. దీంతో మంగళవారం ప్రాంతీయ వాతావరణ కార్యాలయం అనేక జిల్లాలకు భారీవర్ష హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అధికారులతో పరిస్థితిని సమీక్షించి, వర్షాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో విస్తృత వర్షాలు కురుస్తున్నప్పటికీ, 8 జిల్లాలకు 'రెడ్ అలర్ట్, చెన్నైకి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. నగరం, దాని చుట్టుపక్కల జిల్లాలు, నిరంతరం వర్షాలు కురుస్తున్న కావేరి డెల్టా జిల్లాల్లో తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యలను స్టాలిన్ సమీక్షించారు. విల్లుపురం, కడలూరు, మైలదుత్తురై, నాగపట్నం, తిరువళ్లూరు, తంజావూరు, పుదుక్కోట్టై, రామనాథపురంలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం (ఆర్‌ఎంసి) అధికారి ఒకరు తెలిపారు. పొరుగున ఉన్న పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతానికి కూడా ఇలాంటి హెచ్చరిక జారీ చేసింది. 'ఉత్తర తీరప్రాంతం అంతటా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది, కానీ పైన పేర్కొన్న జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉంది' అని వాతావరణశాఖ అధికారి తెలిపారు. చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం, కళ్లకురిచ్చి, అరియలూర్, పెరంబలూర్, తూత్తుకుడి, తిరునెల్వేలి, కన్యాకుమారిలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. చెన్నైలో సిఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించి, వర్షంతో ప్రభావితమైన ప్రజల కోసం సహాయ శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు ఆహారం, తాగునీరు, మందులు సహా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారిక ప్రకటనలో తెలిపారు. వర్షం వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడానికి జెసిబి యంత్రాలు, పడవలు, మోటార్ పంపులు, ట్రక్కులు, రంపాలు వంటి అవసరమైన పరికరాలతో సిద్ధంగా ఉండాలని సిఎం బృందాలకు సూచించారు. తిరునెల్వేలి జిల్లాలోని అంబసముద్రం, చుట్టుపక్కల ప్రాంతా ల్లో గత రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు వేలాది ఎకరాల వరి పంట కోతకు అంతరాయం కలిగించాయని స్థానిక రైతు లు తెలిపారు. కాకనల్లూరు గ్రామానికి చెందిన రైతు పిటిఐతో మాట్లాడుతూ ఈసంవత్సరం నైరుతి, ఈశాన్య రుతుపవనాల మధ్య విరామం లేకపోవడంతో వరి కోతకు సమయం లేదన్నారు.


BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 09 of 2025
Between:-
**Sri Sai Thirumala Chit Funds India Pvt.Ltd., Bhupalpally-Branch**
..... Disputant
And
**PINGILI NARMADA & Others**
.....Opponents
To,
1. Pingili Narmada, W/o, Prakash Reddy, Age: 45 Yrs, Occu: Home Maker, R/o:Q.No:T2--611, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally-506169.
2. Poosa Vasanth Kumar, S/o, Ilaiah, Age: 54 Yrs, Occu:Civil Engineer, R/o: Q.No: MD-56, Manjoor Nagar, Bhupalpally, Jayashankar Bhupalpally-506169.
3. Naredla Sarvotham Reddy, S/o, Venkata Papi Reddy, Age: 56 Yrs, Occu: Sanitory Inspector, R/o: Q.No: M-28, G.M.Office, Oppo:Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally-506169.
4. Jinna Kondal Reddy, S/o, Prathap Reddy, Age: 58 Yrs, Occu: Electrician, O/o:OC Sector, R/o: Q.No: T2-569,Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally-506169.
5. Pingili Prakash Reddy, S/o, Sunder Reddy, Age: 56 Yrs, Occu: Civil Engineer, R/o: Q.No: T2-611, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally-506169.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **07-11-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 24 of 2025
Between:-
**Sri Sai Thirumala Chit Funds India Pvt.Ltd., Bhupalpally-Branch**
..... Disputant
And
**GORRE ASHOK & Others**
.....Opponents
To,
1. Gorre Ashok, S/o, Yellaiah, Age: 41 Yrs, Occ: Badili Worker, R/o: H.No: T2-1094, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally.
2. Kola Chandra Mohan, S/o, Balaiah, Age: 45 Yrs, Occ: MV Driver, R/o: H.No:9-48, Vidyanagar, Ramakrishnapur, Mandamarri, Mancheriyal.
3. Marri Anilkumar, S/o, Raja Komuraiah, Age: 35 Yrs, Occ:Badli Worker, R/o:H.No:T2-888, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally.
4. MD. Thasleemareef, S/o, Khaja Moinuddin, Age: 41 Yrs, Occ:General Mazdoor, R/o:H.No:4-170, Gandhinagar, Bhupalpally, Jayashnakarbhupalpally.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **07-11-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 25 of 2025
Between:-
**Sri Sai Thirumala Chit Funds India Pvt.Ltd., Bhupalpally-Branch**
..... Disputant
And
**BATHINI SUDHARSHAN & Others**
.....Opponents
To,
1. Bathini Sudharshan, S/o, Veeresham, Age: 51 Yrs, Occ:General Mazdoor, R/o:H.No:T2-411,Krishna Colony, Bhupalpally, Jayashankarbhupalpally.
2. Pasunooti Rajender, S/o, Kanakaiah, Age: 51 Yrs, Occ: general Mazdoor, R/o: H.No: T2-311, Krishna Colony, Bhupalpally, Jayashankarbhupalpally.
3. Maloth Prem Singh, S/o, Cheralu, Age: 51 Yrs, Occ: EP Fitter, R/o: H.No: T2-87, Krishna Colony, Bhupalpally, Jayashankarbhupalpally.
4. Pillala Kumaraswamy, S/o, Cheralu, Age: 51 Yrs, Occ: Fitter, R/o:T2-451,Krishna Colony, Bhupalpally, Jayashankarbhupalpally.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **07-11-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL
ARB.NO. 26 of 2025
Between:-
**Sri Sai Thirumala Chit Funds India Pvt.Ltd., Bhupalpally-Branch**
..... Disputant
And
**MOHAMMED MOHINUDDIN & Others**
.....Opponents
To,
1. Mohammed Moinuddin, S/o, Shamuddin Ehatha, Age: 40 Yrs, Occu: Business, R/o:H.No:16-9-207, Kalyan Nagar, Godavarikhani. Peddapally.
2. Sunakari Upender Reddy, S/o, Chandra Reddy, Age: 50 Yrs, Occu:Genaral Mazdoor, O/o:RGM-III, Godavarikhani, R/o:H.No:1-65, Jupaka, Huzurabad, Karimnagar.
3. Gaddam Bhoopal, S/o, Mallaiahy, Age: 50 Yrs,Occu:Genaral Mazdoor, O/o: RGM-III, Godavarikhani, R/o: Q.No:2449,Nagarjuna Colony, C.C.C.Naspur,Mancherial.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **07-11-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT WARANGAL
ARB.NO. 27 of 2025
Between:-
**Sri Sai Thirumala Chit Funds India Pvt.Ltd., Bhupalpally-Branch**
..... Disputant
And
**MOHAMMED MOHINUDDIN & Others**
.....Opponents
To,
1. Mohammed Moinuddin, S/o, Shamuddin, Age: 40 Yrs, Occu: Business, R/o: H.No: 16-9-207, Kalyan Nagar, Godavarikhani. Peddapally.
2. Merugu Ramesh, S/o, Laxminarayana, Age: 43 Yrs, Occ:Badli Worker, R/o: Q.No: SD-485, B.S.Nagar, Ramakrishnapur, Mandamarri, Mancheriyal.
3. Barnabas Anthony, S/o, Thomas, Age: 50 Yrs, Occ: General Mazdoor, R/o:H.No:14-2-448/1, 1-1-315, Vittalnagar, Godavarikhani, Peddapally.
4. Chedagoppula Srinivas, S/o, Ramaswamy, Age: 52 Yrs, Occ:General Mazdoor, R/o:Q.No:SD-784, Shivajinagarlane, Ramakrishnaour, Peddapally.
Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **07-11-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.
DEPUTY REGISTRAR OF CHITS WARANGAL

ప్రజాపక్షం
బుధవారం, 22 అక్టోబరు

# మేధావులకు 'నో ఎంట్రీ'!

దీపావళి మెరుపులు ఢిల్లీలో కాలుష్యాన్ని పెంచిన మరుసటి రోజు ఉదయమే, ఓ రాజకీయ చీకటి కోణం వెలుగు చూసింది. మంగళవారం ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన ఫ్రాన్సిస్కా ఓర్సిని దేశంలోకి రావడానికి వీల్లేదంటూ తిరుగు ప్రయాణానికి అధికారులు ఆదేశించడం మేధావుల పట్ల వివక్షకు పరాకాష్ఠ. హిందీ భాషపై విస్తృత పరిశోధనలు చేసి, లండన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఓర్సిని అడ్డుకోవడం జ్ఞాన భావనకు, భారతీయ సంస్కృతికి తీరని అవమానం. ఒక వ్యక్తిని దేశంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకునే అధికారం ఎవరికి ఉందో అందరికీ తెలుసు. ఓర్సిని అనుమతిస్తే రాజకీయంగా సమస్యలు వస్తాయేమోనన్న భయం ఎవరిని వేధిస్తున్నదో ఊహించుకోవచ్చు. ఓర్సీ ఘటనను సాధారణమైనది కాదు. తేలిగ్గా కొట్టివేయడానికి వీల్లేదు. ఇది ప్రమాదకర భవిష్యత్తుకు సంకేతం. ఆమె వద్ద అన్ని రకాల అధికారిక పత్రాలు ఉన్నప్పటికీ, అడ్డుకోవడం కేంద్ర ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఒకవైపు దేశాన్ని 'విశ్వగురువు'గా ప్రకటిస్తున్న మోదీ ప్రభుత్వం, మరోవైపు మేధో ప్రవాహాన్ని అడ్డుకోవడం విచిత్రం. మేధస్సుకు కులం, మతం, జాతి, ప్రాంతం వంటి అంతరాలు లేవు. విజ్ఞానానికి అవధులు ఉండవు. సరిహద్దులు గీయడం దుర్మార్గం. ఓర్సిని ఎందుకు వెనక్కు పంపుతున్నారనేది ఓ బ్రహ్మపదార్థం. ఎవరూ నోరు మెదపరు. వివరణ ఇవ్వరు. కనీసం ఓర్సీకి కూడా కారణం చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఎన్నో ఏకపక్ష నిర్ణయాల్లో ఇదీ ఒకటి. భారతదేశం గురించి విదేశీయులు అర్థం లేని విషయాలు రాస్తారని, దీనివల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుందని బిజెపి భావన. వారి రచనలను నిరోధించే అవకాశం లేనప్పుడు, వారు దేశంలోకి రాకుండా నిరోధించడమే మేలన్న గొప్ప ఆలోచన! ఓర్సీ ఘటనే ప్రమాణికం.

ప్రొఫెసర్ లిడ్సే బ్రెమ్నర్ లేదా కశ్మీరీ విద్యావేత్త నితాషా కౌల్ లేదా ఫిలిప్పో ఒసెల్లా లేదా ఓర్సీ..అందరూ ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన మేధావులు. మన దేశంలో మాత్రం వారికి 'నో ఎంట్రీ' బోర్డుతో అవమానాలు. ఓర్సీ రచనలు ఎప్పుడు రాజకీయ లేదా విద్యా వివాదానికి దారితీయలేదు. కానీ, ఆమెకు దేశంలోకి అడుగుపెట్టే అవకాశం లభించలేదు. దేశంలో విదేశీ ప్రైవేటు యూనివర్సిటీలను ఆహ్వానించడానికి, విద్యావంతులను, మేధావులను తిరుగుటపాలో పంపడానికి మధ్య పొంతన లేదు. దేశ ఘన చరిత్రను ఒక మతం లేదా వర్గంతో ముడిపెట్టి, పబ్బం గడుపుకొంటున్న తరుణంలో, అందుకు భిన్నమైన వాస్తవాలు బయటపడితే రాజకీయ పునాదులు కదులుతాయని భయం బిజెపిని వెంటాడుతున్నది. విద్యా సంబంధిత కార్యక్రమాలకు ఆహ్వానించే వక్తల జాబితాకు ముందుగానే ఆమోద ముద్ర వేయించుకోవాలంటూ ఆదేశాలు జారీకావడమే ఇందుకు నిదర్శనం. ఇలాంటి చర్యలతో, జాతీయ సరిహద్దులకు అవకాశం లేని విస్తారమైన జ్ఞాన ప్రపంచంలో మనం వినయపూర్వకమైన విద్యార్థులుగా మారే సామర్థ్యాన్ని కోల్పోతున్నామన్నది నిజం. హిందీని జాతీయ భాషగా మార్చాలన్న లక్ష్యాన్ని కేంద్ర సర్కారు పలుమార్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రకటించింది. దక్షిణాది రాష్ట్రాలపై బలవంతంగానైనా రుద్దడానికి ప్రయత్నిస్తున్నది. అదే హిందీ భాషలో విస్తారమైన పరిశోధనలు చేసి, ఎన్నో పుస్తకాలు రాసిన ఓర్సిని అడ్డుకుంది. అంటే, భాషపై బిజెపి ప్రేమ ఓ నాటకం. దేశ వాస్తవ చరిత్ర బయటపడుతుందేమోనన్న భయం. దేశ ప్రయోజనాల పేరిట ప్రదర్శిస్తున్న కపటత్వానికి నిదర్శనం. విద్య, సంస్కృతులను సైతం బిజెపి రాజకీయ అస్త్రాలుగా మార్చుకుంటున్న వైనం. అనుమానాస్పద వ్యక్తులకు, మేధావులకు మధ్య తేడాలేదా? అందరినీ ఒకే కర్రతో బెదిరిస్తారా? అవమానించి తరిమేస్తారా? ఇదెక్కడి న్యాయం! విదేశాల్లో ఉంటున్న ఎంతోమంది భారతీయ భాషలు, సాహిత్యాలపై పరిశోధనలు చేస్తుంటే, మన దేశంలో మాత్రం వారిని ఆదరించే వాతావరణం లేకపోవడం అత్యంత బాధాకరం. ఓర్సీ ఘటన తర్వాత మన దేశానికి రావడానికి మేధావులు ఎంత భయపడతారో.. ఎంత ఒత్తిడిని అనుభవిస్తారో.. దీర్ఘకాలంలో వారి ఆసక్తి ఎంతగా మసకబారుతుందో.. ఊహించడానికి భయపడాల్సిన పరిస్థితి. శతాబ్దాలుగా, విదేశీ పండితులు భారతదేశ భాషలు, సాహిత్యాలపై అధ్యయనం చేస్తునే ఉన్నారు. కొన్నిసార్లు వారి పద్ధతులు లేదా దృక్పథాలతో మనం విభేదించవచ్చు, కానీ వారి శ్రమ, అంకితభావం, ప్రమాణాలను సందేహించలేం. వేదకాలాన్ని నిత్యం కీర్తించే బిజెపి, 'అన్ని దిశల నుంచి మనకు గొప్ప ఆలోచనలు రావాలి' అనే రుగ్వేద సూత్రాన్ని ఎందుకు మరచింది? ఓర్సిని నిరోధించడం ముమ్మాటికీ గర్హనీయమే.. చరిత్రను వక్రీకరించే ప్రయత్నమే. వాస్తవాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయం బిజెపిలో నరనరాన జీర్ణించుకుంది. అందుకే, మేధోపరమైన అడ్డుకట్టలు వేసి, తన వాదన నిజమని ప్రచారం చేసుకుంటున్నది. కానీ, జ్ఞానాన్ని ఎవరూ నియంత్రించలేరు. దేశ సరిహద్దుల్లో బంధించలేరు.

# దేశాన్ని ఇరకాటంలోకి నెట్టిన నరేంద్ర మోదీ సామర్థ్యం!



ఎం.కోటేశ్వరరావు

అన్నీ వారే చేశారంటూ గాంధీ, నెహ్రూ వంటి నేతలను ఇప్పటికీ ఆడిపోసుకుంటున్నారు. కాంగ్రెస్ ఐదు దశాబ్దాలలో చేయలేనిదానిని తమ మోదీ ఐదేండ్లలో చేశారు చూడండని డబ్బాకొట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు చంద్రబాబు నాయుడు వంటి వారు రంగంలోకి దిగి జిఎస్‌టి సంస్కరణలతో బొందితో కైలాసానికి తీసుకుపోతున్నారన్నట్లుగా ఆకాశానికి ఎత్తుతున్నారు. సెప్టెంబరు మాసంలో దేశ వాణిజ్యలోటు వివరాలు వెల్లడయ్యాయి. ఎగుమతులు 6.7శాతం పెరిగి 36.38 బిలియన్ డాలర్లకు చేరగా దిగుమతులు 16.7శాతం పెరిగి 68.53 బిలియన్ డాలర్లకు చేరాయి. కిందపడ్డా 'గెలిచింది మేమే' అన్నట్లుగా దిగుమతులు అంటే మేం వస్తుకొనుగోలు శక్తి పెంచిన కారణంగానే అవసరం అవుతున్నాయని సమర్థించుకుంటున్నారు. మోదీ మూడోసారి పాలన ఐదేండ్లు గడిచే సరికి ఇప్పుడున్న 89 డాలరుకు ముచ్చటగా వంద రూపాయలకు పతనమైనా ఆశ్చర్యం లేదు.

వికసిత భారత్ 2047 పేరుతో నరేంద్రమోదీ దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామన్నారు, ఇప్పుడు ఎటు తీసుకుపోతున్నారో తెలియదు. కొన్ని చేదు నిజాలను అంగీకరించకతప్పదు. ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం మన దేశానికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మోదీ అధికారానికి వచ్చిన తరువాత జిడిపిలో 2.1శాతం ఉండగా 2023 నాటికి 0.8శాతానికి దిగజారాయి. అంకెల్లో చూస్తే 2014 నుంచి 2024 వరకు వచ్చిన మొత్తం 509.69 బిలియన్ డాలర్లు(సగటున ఏడాదికి 46.34బి. డాలర్లు) అధికారానికి వచ్చిన కొత్తలో విమానం వేసుకొని దేశదేశాలూ ఎందుకు తిరుగుతున్నారంటే దిగజారిన దేశ ప్రతిష్ఠ పునరుద్ధరణ, పెట్టుబడుల కోసం అని చెప్పారు. గొర్రెతోక బెత్తెడు అన్నట్లుగా 2016లో 46 బిలియన్ డాలర్లు వస్తే 2024లో 53 బిలియన్ డాలర్లు ఉంది. చైనాకు 2019 నుంచి 21 వరకు మూడు సంవత్సరాల్లో వచ్చిన మొత్తం 787 బిలియన్ డాలర్లు. తరువాత కాలంలో చైనాకు మనదేశానికి వచ్చిన మొత్తం కూడా రాలేదు. 2021లో 344 బిలియన్ డాలర్లు వస్తే 2023లో 51.3, 2024లో 18.6బిలియన్ డాలర్లు మాత్రమే వచ్చాయి. దానికి ఉన్న కారణాల గురించి మరో సందర్భంలో చెప్పుకోవచ్చు. చైనాలో పెరిగిన ఉత్పాదకత ఖర్చులతో వచ్చే లాభదాయకత కంటే అమెరికాలో వడ్డీ రేటు ఎక్కువగా ఉండటం ఒకటి. ఇక్కడ ముఖ్యాంశమేమంటే చైనాకు పెట్టుబడులు ఆగిపోయాయి, మనదేశానికి అవి రూటుమార్చాయి, కంపెనీలు వరుసలో నిలుచున్నాయి అని చెప్పిన వారు యాపిల్ కంపెనీ గురించి పదేపదే చెప్పటం తప్ప చైనాకు తగ్గిన ఎఫ్‌డిఐ మనకు ఎందుకు రాలేదో చెప్పాలి. చైనా కంపెనీలు మనదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడితే గత ఐదు సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఆశించిన అమెరికా, ఇతర దేశాల కంపెనీల జాడకనిపించకపోవటంతో ఇప్పుడు చైనా పెట్టుబడులకు ద్వారాలు తెరిచేందుకు మోదీ సర్కార్ పూనుకుంది.

ఇతర అభివృద్ధి చెందిన, చైనా వంటి దేశాలతో పోల్చితే మనదేశంలో కాలం చెల్లిన సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల పరిమితం, బలహీనమైన మౌలిక సదుపాయాలు ఆకర్షణీయంగా లేనపుడు రాజకీయ నేతలు, వారికి భజన చేసే మీడియా ఎన్ని కబుర్లు చెప్పినా ఉపయోగం ఉండదు. ఇప్పుడు అమెరికా విధించిన పన్నులతో ఇక్కడ పరిశ్రమలే ఎలా మనుగడ సాగించాలా అని ఆలోచిస్తుండగా కొత్తగా వచ్చేవారి సంగతి వేరే చెప్పనవసరం లేదు. మన కార్పొరేట్ల తీరుతెన్నులు చూస్తే మిగతావారి మాదిరే తమ లాభాలు తప్ప వేరే పట్టవు. కేంద్రంలో అధికారంలో ఎవరున్నా తమకు అనుకూలమైన విధానాలను అమలు చేయిస్తారు. ఇప్పుడు అమెరికా, ఇతర దేశాలతో తలెత్తిన పరిస్థితుల్లో ఏం చేయాలో దిక్కుతోచటం లేదని చెప్పవచ్చు. గతంలో ఆసియన్ దేశాలతో కూడిన ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం (ఆర్‌సిఇపి) కూటమిలో లేదా పసిఫిక్ భాగస్వామ్య కూటమి సిపిటిపిపి(కాంప్రహెన్సివ్ అండ్ ప్రోగ్రెసివ్ ఎగ్రిమెంట్ ఫర్ ట్రాన్స్ పసిఫిక్ పార్టనర్‌షిప్)లో చేరాలా? చేరితే వచ్చే లాభాలేమిటి? నష్టాలేమిటనే గుంజాటనలో పాలకవర్గం దాని ప్రతినిధిగా ప్రస్తుతం ఉన్న నరేంద్రమోడీ సర్కార్ ఉంది.

ముందుగా ఆర్‌సిఇపి గురించి చూద్దాం. ఈ కూటమి ఒప్పందంపై 2020 నవంబరు 15 సంతకాలు చేసింది. అది 2022 జనవరి నుంచి అమల్లోకి వచ్చింది. దీనిలో ఆస్ట్రేలియా, బ్రూనీ, కంపూచియా, చైనా, ఇండోనేషియా, జపాన్, దక్షిణ కొరియా, లావోస్, మయన్మార్, మలేసియా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం ఉన్నాయి. ఏడు సంవత్సరాలు తర్జన భర్జన పడిన తరువాత 2019 నవంబరులో ఈ కూటమిలో చేరకూడదని మోదీ సర్కార్ నిర్ణయించింది. ముందు ఎట్టిపరిస్థితిలోనూ చేరకూడదని రైతు, వ్యవసాయ కార్మిక, పారిశ్రామిక కార్మికులు, ఇతరులూ స్పష్టం చేశారు. చైనా ఉన్న ఏ వాణిజ్య కూటమిలోనూ చేరకూడదని పారిశ్రామికవేత్తలు గట్టిగా పట్టుబట్టారు. దాంతో ఈ కూటమికి మన దేశం దూరంగా ఉంది. అయితే ఇప్పటికీ ఆర్‌సిఇపి మన దేశానికి ఆహ్వానం పలుకుతూనే ఉంది. గతంలో వ్యతిరేకించిన కార్పొరేట్ శక్తులే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ దెబ్బతో పునరాలోచన చేయాలని కోరుతున్నాయి. వారెందుకు నాడు వ్యతిరేకించారంటే ఒకటి, చైనాతో అప్పటికే ఉన్న వాణిజ్యలోటు మరింత పెరుగుతుంది, రెండు, ఆ కూటమిలోని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తమ పాడి ఉత్పత్తులకు మన మార్కెట్‌ను తెరవాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో సున్నితమైన అంశం. మూడవది, సేవా రంగానికి ఇతర దేశాలు తమ మార్కెట్లను తెరిచే అంశంపై మన ప్రతిపాదనలకు ప్రత్యేకించి నిపుణుల రాకపోకలకు సంబంధించి తగిన మద్దతు రాకపోవటం.

అయితే, ఇప్పుడు కార్పొరేట్లలో పునరాలోచనకు పరిస్థితులేమైనా మారాయా? ఒక్క మాటలో చెప్పాలంటే లేదు. చైనాతో వాణిజ్య లోటు ఆరేళ్ల క్రితం 48.6 బిలియన్ డాలర్లు ఉంటే ఇప్పుడు వంద బిలియన్ డాలర్లకు చేరింది. వ్యవసాయం, పాడి పరిశ్రమలపై మన వైఖరిలో అప్పుడూ ఇప్పుడూ ఒకటిగానే ఉంది. అందుకే ఆస్ట్రేలియా, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవటానికి మోడీ సర్కార్ భయపడుతోంది. నయా ఉదారవాదం ప్రకారం మనకు లబ్ధి కలిగించే సేవారంగ మార్కెట్‌లను తెరవాలన్న మన ప్రతిపాదనలకు ఇతర దేశాలు సుముఖంగా లేవు. దీని అర్థం ఎవరి రక్షణ చర్యలకు వారు కట్టుబడి ఉన్నారు. ఈ స్థితిలో పునరాలోచన చేయాలని కొందరు ఎందుకు కోరుతున్నారంటే ట్రంప్ ఇచ్చిన షాక్‌తో ప్రభావితమైన రంగాలకు ఏం చేయాలో తోచక ఈ ప్రయత్నం ఏమైనా ఉపయోగపడుతుందా అని భావిస్తున్నారని చెప్పవచ్చు. పోనీ చేరితే వెంటనే ఏమైనా ప్రయోజనం ఉంటుందా అంటే ఉండదు. దాని నిబంధనావళి ప్రకారం 2022 నుంచి ఇరవై సంవత్సరాల వ్యవధిలో నాడున్న పన్నులను 92శాతం తగ్గించాల్సి ఉంటుంది. అదే విధంగా ఎగుమతి, దిగుమతుల కోటాలను ఖరారు చేస్తారు.

ఇక రెండో ఆర్థిక కూటమి సిపిటిపిపిని చూద్దాం. దీనిలో ఆర్‌సిఇపిలో ఉన్న కొన్నింటితో పాటు ఇతర దేశాలు ఉన్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వియత్నాం, సింగపూర్, బ్రూనీ, కెనడా, మలేసియా, జపాన్, చిలీ, పెరూ, బ్రిటన్, మెక్సికో ఉన్నాయి. వీటి మధ్య ఒప్పందం 2018లో ఉనికిలోకి వచ్చింది. దీని ప్రకారం 99శాతం వరకు పన్నులను తగ్గించాల్సి ఉంటుంది. ఆర్‌సిఇపి కంటే నిబంధనలు గట్టిగా ఉన్నాయి. అంతకు ముందు ట్రాన్స్ ఫసిఫిక్ పార్టనర్‌షిప్ (టిపిపి) పేరుతో కుదిరిన ఒప్పందం నుంచి అమెరికా వైదొలగటంతో అది మూలనపడి దానిస్థానంలో కొత్తగా ఉనికిలోకి వచ్చింది. దీనిలో సభ్యత్వంకోసం చైనా దరఖాస్తు చేసినప్పటికీ దానికి ఇచ్చే అవకాశం లేదు. ఎందుకంటే ఆర్థిక సేవారంగాన్ని తెరవాలన్న నిబంధనతో పాటు సమాచారాన్ని స్వేచ్ఛగా ఇచ్చిపుచ్చుకోవాలని, ప్రభుత్వరంగ సంస్థల గుత్తాధిపత్యాన్ని తొలగించాలనే షరతులు ఉన్నాయి. వాటిని చైనా అంగీకరించటం లేదు. అమెరికా, చైనా రెండూ లేవు గనుక మనం చేరితే ఉపయోగం ఉంటుందన్న ఆశతో సిపిటిపిపిలో చేరితే ఎలా ఉంటుందని మన కార్పొరేట్లు ఆలోచన చేస్తున్నారు.

ఏ దేశానికైనా ఒక దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలు ఎత్తుగడలు అవసరం. అందువల్లనే అమెరికా మనమీద పెద్ద ఎత్తున ఒత్తిడి తెస్తున్నది. దాన్ని తప్పించుకొనేందుకు మాటల్లేవ్, మాట్లాడుకోవటాలు లేవు అన్నట్లుగా ఐదేండ్ల క్రితం అన్ని సంబంధాలను తెంచుకున్న చైనాతో తిరిగి చేయి కలపటం, అవసరమైతే రష్యా, చైనా, భారత్ ఒక కూటమిగా ఏర్పడతాయనే సందేశాన్ని షాంఘై సహకార సంస్థ సమావేశాల సందర్భంగా ఇచ్చారు. అయితే అమెరికాతో సంబంధాలకు కూడా తహతహలాడుతున్నారు. అందుకే చైనా, రష్యా బహిరంగంగా చెప్పనప్పటికీ ప్రతి అడుగూ అనుమానంతో వేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం, ఐరోపా సమాఖ్యతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవాలని, స్థానిక గిరాకీని పెంచేందుకు పరిశ్రమలకు మద్దతు ఇవ్వాలని, అదనపు రిస్కులను తీసుకోకుండా అన్ని దేశాలతో ఉన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో గరిష్ఠంగా లబ్ధిపొందేందుకు చర్యలు తీసుకోవాలని మనకార్పొరేట్లు కోరుతున్నారు. పదేండ్ల మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా పిలుపులు ఘోరంగా విఫలమయ్యాయి. దీంతో చైనా ప్లస్ 1పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు.

బహుళజాతి కంపెనీలు ముందుకు తెచ్చిన ఈ వ్యూహం వాణిజ్యపరమైనది. సరఫరా వ్యవస్థ లేదా గొలుసులో చైనాను విస్మరించలేరు. చైనాలో కార్మికవేతనాలు పెరుగుతున్నందున, ఇతర నిబంధనలతో ఉత్పాదక ఖర్చులు పెరుగుతున్నాయి. అయితే 140 కోట్ల జనాభా ఉన్న మార్కెట్‌ను వదులుకోలేరు. అందుకే చైనాతో పాటు మరొక దేశంలో తమ కార్యకలాపాలను ప్రారంభించాలన్నదే చైనా ప్లస్ 1 అర్థం. మన దేశంలో యాపిల్ కంపెనీ కార్యకలాపాలకు కారణమిదే. వియత్నాం, ఇండోనేషియా, థాయ్‌లాండ్ ఇలా ఏది అనుకూలంగా ఉంటే దాన్ని ఎంచుకోవచ్చు. మన విషయానికి వస్తే సానుకూల, ప్రతికూల అంశాలు ఉన్నాయి. యువజనాభా గణనీయంగా ఉండ టం, కార్మికవేతన ఖర్చు తక్కువ(2023 సర్వే ప్రకారం చైనా కంటే వేతనాలు 47శాతం తక్కువ.) ఉత్పాదకతతో ముడిపెట్టిన ప్రోత్సాహకాలు ఉన్నాయి. రోడ్ల వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. ఇవి సానుకూల అంశాలు కాగా సవాళ్లు కూడా ఉన్నాయి. 2013 నుంచి చైనాలో వేతనాలు పెరుగుతున్నందున కంపెనీలు మన దేశాని కి వస్తాయని చెప్పినా వాటి జాడలేదు. నియంత్రణలు ఎక్కువ (అంబానీ, అదానీలకు ఎవరూ పోటీ రాకూడదు, అందుకే అమెజాన్ అధిపతి బెజోఫ్‌కు గతంలో మోడీ కనీసం దర్శన భాగ్యం కూడా కల్పించలేదు) మౌలిక సదుపాయాలు అంటే " తోలు " వలిచే రోడ్లు మాత్రమే కాదు. వియత్నాం, థాయ్‌లాండ్ వంటి చిన్నదేశాల నుంచి కూడా మనకు పోటీ ఎక్కువగా ఉంది. కబుర్లు ఎక్కువ ఆచరణ తక్కువ. మొత్తంగా చూసినపుడు సమర్థుడైన నావికుడిగా భావించి మన నావను నరేంద్రమోదీకి అప్పగిస్తే ఇప్పుడది చుక్కాని లేనట్లు ఎటు పోతుందో తెలియకుండా నడి సముద్రంలో ఉంది. చిత్రం ఏమిటంటే దీనికి కూడా నెహ్రూ కారణమని చెప్పగల సమర్థులుంటే నిజమే అని నమ్మే అమాయకులు పుష్కలంగా ఉండటం అసలైన సమస్య !


# పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

దేశ భద్రతకు ప్రజల కోసం విధి నిర్వహణలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ, సత్యాన్ని, ధర్మాన్ని, న్యాయాన్ని కాపాడే బాధ్యతగా ధైర్యంతో శత్రువులను తిప్పికొట్టడం పోలీసుల త్యాగాలకు నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే సరిహద్దుల్లో పోలీసులు మేల్కొని ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణపై కాపలా కాస్తుంటారు. ఎండా, వాన, చలి మరియు రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజల కోసం జీవిస్తూ, ప్రజల ప్రాణాల భద్రత కోసం పోలీసులు చేస్తున్న త్యాగాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందుకే ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' జరుపుకుంటారు. 1959 అక్టోబర్ 21న భారత్, చైనా సరిహద్దు ప్రాంతంలో డిఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో పంజాబ్‌కు చెందిన 21 మంది పోలీసుల బృందం సరిహద్దులో విధులు నిర్వహిస్తుండగా, చైనా రక్షణ బలగాలు సియాచిన్ భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలోసి ఆర్‌పిఎఫ్ దళం హాట్ స్ప్రింగ్ ప్రాంతంలో వారిని దీటుగా ఎదుర్కొని పోరాటం చేశారు. ఆ పోరాటంలో పది మంది భారత జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. వారి త్యాగాలకు గుర్తుగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటున్నాం. భారత జవాన్లు సుమారు 2500 మైళ్ల పొడవైన సరిహద్దును టిబెట్ ప్రాంతంలో పోలీస్ సిబ్బంది బాధ్యతతో కాపలా కాస్తున్నారు. భారత్ – చైనా సరిహద్దులోని ఆక్సయ్ చిన్ ప్రాంతాన్ని హాట్ స్ప్రింగ్ ప్రాంతం అంటారు. ఈ ప్రాంతం 16 వేల అడుగుల ఎత్తులో, రక్తం గడ్డకట్టే మంచు పర్వతాల మధ్య ఉంటుంది. దీనిని వేడి నీటి బుగ్గ అని కూడా పిలుస్తారు. ఈ ప్రాంతం అమరవీరుల జవానుల త్యాగాలకు ప్రతీకగా నిలిచింది. దేశవ్యాప్తంగా విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ, ప్రతియేటా ఈ ప్రాంతం వద్ద పోలీస్ అమర వీరులకు నివాళులర్పించడం ఆనవాయితీ. దేశాన్ని కాపాడే వారు సైనిక జవాన్లు అయితే, అంతర్గత శక్తులనుండి ప్రజలను కాపాడి, వారి భద్రత కు భరోసా ఇస్తూ, సామాజిక ఆస్తులు రక్షించేది మన పోలీసులు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోలిస్తే పోలీసుల విధులు భిన్నంగా ఉంటాయి. నిత్యం అప్రమత్తం గా ఉండాలి. పని గంటలలో తేడా ఉంటుంది. మానసిక ఒత్తిడి ఉంటుంది. ఒత్తిడికిలోనై అనారోగ్య సమస్యలు సైతం ఎదుర్కొంటారు. బందోబస్తు డ్యూటీలో పాల్గొనేవారు, డ్యూటీకి వచ్చింది మొదలుకొని ఇంటికి వెళ్లే వరకు విరామం లేకుండా పనిచేయాల్సిందే. కొన్ని సందర్భాల్లో సిబ్బంది కొరత కారణంగా, అత్యవసర పరిస్థితులలో సెలవులు మంజూరు కాకుండా విధి నిర్వహణలో ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. పోలీసులలో సిఆర్‌పిఎఫ్, రిజర్వు, బిఎస్ఎఫ్, సిఐఎస్ఎఫ్, ట్రాఫిక్ వంటి పోలీస్ వర్గాలు తమ విధి నిర్వహణలో తమ ప్రాణాలు ఫణంగా పెట్టి, ప్రజల ఆస్తులను, దేశ సమగ్రతను, శాంతి భద్రతలను కాపాడుతున్నా రు. అందుకే భారత ప్రభుత్వం వారి స్మారకార్థం అమరుల కుటుంబాలకు ఆయా రాష్ట్రాల్లో సంక్షేమ నిధి కేంద్రాలు ఏర్పాటు చేశాయి. 'ఫ్లాగ్ ఫండ్' పేరుతో కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ప్రతి యేటా నిధిని వసూలు చేసి వారి సంక్షేమం నిధిలో జమ చేయడం జరుగుతుంది. ఆ తర్వాత ఈ సంవత్సరం జూన్ 15 తూర్పు లడక్ యొక్క గాల్వాన్ వ్యాలీలో భారత్‌కి చెందిన బీహార్ రెజిమెంట్ 16వ బెటాలియన్‌కు చెందిన కల్నల్ సంతోష్ బాబుతో కూడిన 20 మంది బృందం వీరమరణం చెందడం చరిత్రలో మర్చిపోలేని సంఘటన. తూర్పు లద్దాఖ్ ప్రాంతంలో భారత రహదారి నిర్మాణం పై చైనా దళాలు అభ్యంతరం వ్యక్తం చేయడం, లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఓసి) వద్ద దొంగదెబ్బకొట్టి ఉద్రిక్తత దారితీసిన క్రమంలో మన జవాన్లు జరిపిన పోరాటం అజరామం. ఈ సంవత్సరం పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాల సంస్మరణలో భాగంగా ఈ నెల 21 న మొదలైన 'ఫ్లాగ్ డే' వేడుకలు 31వరకు నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ ఫ్లాగ్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం, పోలీసుల విధులు, రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రజలు, యువత నుండి రక్తం సేకరించి ఆయా బ్లడ్ బ్యాంక్‌లకు ఇవ్వడం, నేరాల అదుపునకు ఎలా చర్యలు తీసుకోవాలి అనే విషయాల మీద విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. పోలీసులు వినియోగించే ఆయుధాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ, సైబర్ క్రైమ్, సాంకేతిక పరిజ్ఞానం, పోలీసుల త్యాగాలు మొదలైన అంశాలపై ప్రజలకు విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర పోలీసుల పాత్ర, వారి సేవలు అనే అంశం పై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహిస్తారు. యువత, విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నప్పుడే వారికి నిజమైన నివాళి.




**కామిడి సతీశ్ రెడ్డి**

# కాదేదీ సుంకాలకనర్హం



ఎస్.బాబు
టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు

*భరత ఖండంబు చక్కని పాడి యావు*
*హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ*
*తెల్లవారను గడుసరు గొల్లవారు*
*పితుకుతున్నారు మూతులు*
*బిగియగట్టి*

ఇది చిలకమర్తి లక్ష్మీ నరసింహం వారి పద్యం. ఈ పద్యం నాలుగు పాదాలలో తెల్లవారి దోపిడీ గురించి కవి చాలా చక్కగా వివరించారు. బెంగాల్ విభజన సందర్భంగా హిందూ ముస్లింలను తెల్ల దొరలు వేరు చేస్తున్న సందర్భంలో ఆశువుగా చెప్పిన పద్యమిది. మొఘల్ చక్రవర్తులైనా, పర్షియన్‌లైనా, ఫ్రెంచ్, డచ్, పోర్చుగీస్, ఈస్ట్ ఇండియా కంపెనీ వారు అయినా భారతదేశ సంపదను వివిధ రూపాల్లో దోచుకున్నవారే. నాడు బ్రిటిష్ తెల్ల దొరలు ఇండియాను దోచుకుంటే, నేడు అమెరికా తెల్లదొరలు సుంకాల పేరుతో దోపిడీ చేస్తున్నారు. దేశ అవసరాల ను బట్టి దోచుకునేదే సుంకం. ఈ సుంకం, దోపిడీ కవలపిల్లలు. తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా నడుచుకునే దేశాలను తుదముట్టించాలనే దుర్మార్గపు ఆలోచన అమెరికా పెద్దన్నది. ఈ మధ్య కాలంలో అమెరికా అధ్యక్షుడు, చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఎక్కువగా చూస్తున్నట్టున్నాడు. ఆయన లాగే ఈయన కూడా పండితుడని అనుకుంటున్నాడు కాబోలు. చాగంటి వారు సహజ పండితులు. ట్రంప్‌కు పాండిత్యం ఎక్కువైతే బుద్ధికి పడిశం పడుతుంది. అదే ఈ సుంకాల తెగులు పొట్లపాదుకు బొంతపురుగులా పట్టింది. ఆదాయం లేని ఆలయాలు ఎలా మూసివేయబడతాయో ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతున్న వారి దేశాన్ని బాగు చేయటానికి ఈ సుంకాల వేటతో బయలుదేరాడు ట్రంప్ మహాశయుడు.

పాలకులు ప్రజల నుండి సుంకాలు వసూలు చేయడం సర్వసాధారణం. కొన్ని దేశాలు ఇతర దేశాల ఎగుమతి, దిగుమతులపై విధించే సుంకాలు ఆయా దేశాలను, వారి ప్రజలను ఇబ్బంది పెట్టకూడదు. అధిక సుంకాలను విధించే అమెరికా వంటి దేశాలు వారి రెవెన్యూ జెనరేట్ చేయటం కోసం సుంకాల జూదం ఆడుతున్నారు. కాని ఈ ఆట పులి మీద స్వారీ చేయటమే. సుంకాల పులి స్వారీ చేస్తున్నవారిని ఎప్పుడైనా మింగే అవకాశం ఉంది. ప్రపంచ దేశాలలో చక్రవర్తులు, రాజులు, పాలకులు పాలితులపై విచిత్రమైన సుంకాలు రుద్దారు. 17వ శతాబ్దం లో రష్యాను ఏలిన జార్ చక్రవర్తులు ఆ దేశ పౌరుల గడ్డాలపై 100 రూబుల్ సుంకాలు విధించారు. రోమన్ సామ్రాజ్యాన్ని పరిపాలించిన నీరో చక్రవర్తి ఫిడేలు రాగాలు వాయించుకుంటూ మూత్రసేకరణపై పన్ను విధించారు.

ప్రపంచంలో అత్యధిక జనాభా ఇండియాలో ఉండటం వల్ల నదులలోని ఎక్కువ టిఎంసిల నీటిని ఇండియా వారు వాడుతున్నందున దానిపై నీటి టారిఫ్ ను పెంచుతానని ట్రంప్ అన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. దక్షిణాఫ్రికా దేశం వారు బ్రహ్మచర్యంపై పన్ను విధించారు. ఆ రోజుల్లో వాజ్‌పేయ్, సల్మాన్ ఖాన్, రాహుల్ గాంధీ లేరు కాబట్టి బతికిపోయారు. పొరపాటున చాగంటివారి మహాభారత ప్రవచనం ట్రంప్ కనుక వింటే మహాభారతంలోని భీష్మ పితామహునికి, రామాయణంలోని ఆంజనేయస్వామికి బ్రహ్మచర్య సుంకం త్రేతాయుగం నుండి నేటివరకు చక్రవడ్డీతో చెల్లించాలంటారు. ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లండ్ దేశాల వారు పిరికితనంపై సుంకం చెల్లించాలంటూ హుకుం జారీ చేసారు. ఆ సమయంలో మన ఖడ్గతిక్కన గనుక దొరికి వుంటే ఈ సుంకం దెబ్బకి చిత్తైపోయేవాడు. అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో పిల్లలు లేని జంటల కు సంవత్సరానికి ఒక డాలర్ చొప్పున సుంకం చెల్లింపు ఇప్పటికీ అమలులో ఉంది. ఈ విషయం ట్రంప్ కు తెలిస్తే పిల్లలు లేని భారతీయుల జంటలను ఫెర్టిలిటీ సెంటర్లలో పట్టుకుని హెచ్1 బి వీసాదారులకు కోటి రూపాయలు చెల్లించాలని అన్నట్లుగా వీరికి కూడా ట్రంప్ టారిఫ్ అమలులోకి తెచ్చేవారు. నదీనదాలు, నవగ్రహాలు, పంచభూతాలన్నింటికీ తానే అధిపతి అయినట్లు, గ్రీన్‌లాండ్ మెక్సికో దేశాలను ఆక్రమణ్ కరో అంటాడు. కెనడా దేశాన్ని అమెరికా లో కలుపుకుంటా అంటాడు. అదేమన్నా మెక్ డొనాల్డ్ విస్కీనా? సోడా కలుపుకుని తాగటానికి. చిన్నపిల్లలు చాక్లెట్ కావాలని అని అడిగినంత సులువుగా డొనాల్డ్ ట్రంప్ కూడా అఫ్ఘనిస్థాన్ లోని బగ్రామ్ వైమానిక స్థావరం తనకు కావాలంటాడు.

బంగాళాఖాతంలోని సెయింట్ మార్టిన్ ద్వీపంలోకి అమెరికా సైన్యాన్ని అనుమతించాలని బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తెస్తాడు. భారత దేశాన్ని అష్టదిగ్బంధనం చేయాలని చీకటి బోన్లో సింహంలా చూస్తున్నాడు. అందుకే అమెరికాలో ఉంటున్న సుమారు లక్షమంది భారతీయ విద్యార్థుల ఎఫ్1 వీసాల కాలం చెల్లిందని, వారి దేశం నుండి వెళ్ళగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. భారతదేశాన్ని వ్యతిరేకించే పాకిస్తాన్ తుర్కియేతో ట్రంప్ జతకట్టి మనపై సర్జికల్ స్ట్రైక్ చేసినా చేయవచ్చు. భారతీయులు విష్ణుసహస్రనామం, లలితాసహస్రనామం వల్లించినంత అనర్గళంగా ట్రంప్ మహాశయుడు వారి టారిఫ్‌లను 50 శాతం, 100శాతం సుంకాలను ప్రపంచదేశాలపై విధించటం చూస్తుంటే మహమ్మద్ బిన్ తుగ్లక్ గుర్తురాక మానదు.

భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై ప్రధాన మంత్రి మోదీ జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రధానమంత్రిగా తన రికార్డు కోసం 103 నిమిషాలు సుదీర్ఘమైన ప్రసంగం చేసి అక్కడికొచ్చిన జనాల్ని బాది మరీ చరిత్ర సృష్టించినందుకు ఆయన స్పీచ్ పై 50 శాతం సుంకం చెల్లించాలని అన్నా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ట్రంప్ ముద్దుబిడ్డ అయిన Big Beautiful Bill (BBB) ద్వారా ఆ దేశ కార్పొరేట్ కుబేరుల కు 4.5 ట్రిలియన్ డాలర్ల పన్నులు తగ్గించి, ఆ నష్టాన్ని పూడ్చుకోవడం కోసం భారత్‌పై 50 శాతం సుంకాల పెంపు జరిగి ఉండవచ్చు.

న్యూయార్క్‌లోని స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఎత్తు 303 అడుగుల కంటే ఎక్కు వ ఎత్తులో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం 600 అడుగుల ఎత్తులో. 3వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆ విగ్రహాన్ని నిర్మించటంతో ట్రంప్ హర్టయి ఉంటాడు. అది ఆయనకు నచ్చలేదేమో. అంతే కాకుండా ప్రపంచ పెద్దన్న పాత్ర పోషిస్తున్న ట్రంప్ 2 సార్లు ఎన్నికల్లో గెలిస్తే మోదీ 3 సార్లు ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రావడం వలన కూడా ఆయన ఇగో దెబ్బతిని సుంకాల పెంపుకు కారణమై ఉండవచ్చు.

ట్రంప్ తన అధ్యక్ష పదవీకాలంలో 30,573 అబద్ధాలు ఆడారని, రోజుకు 21 అబద్ధాలు ఆడగల దిట్ట అని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక గణాంకాలు రికార్డు చేసింది. దీన్ని మనం నమ్మాల్సిందే. ఎందుకంటే 9 నెలల్లో 7 యుద్ధాలు ఆపానని, పెహల్గాం దాడి జరిగిన తర్వాత ఆపరేషన్ సింధూర్ ఆగిపోవటానికి కారణం తానే అని అబద్ధాలు చెప్పుకున్నాడు. దానికి మోదీ ఒప్పుకోకపోవడంతో అది మనసులో పెట్టుకుని ఉన్న సుంకాలను డబుల్ చేశాడు. అనంత జ్ఞానానికి ద్వారం తెరవటం ఎంత ముఖ్యమో, అనంత అబద్ధాలకు హద్దులు విధించటం కూడా అంతే ముఖ్యం అంటారు ద్రావిడ యూనివర్సిటీ ప్రొఫెసర్ తిరుపతి రావు. డొనాల్డ్ ట్రంప్ లో ఎప్పుడూ 4 సింహాలు కనిపిస్తాయి. ఆయన మోసపూరిత దౌత్యం చేస్తున్నప్పుడు అందమైన క్లియోపాత్రా సివంగి రూపంలో కనిపిస్తుంది.

అధికారం నిలుపుకోవటానికి ఆయన ఆడే అబద్ధాలలో నీరో చక్రవర్తి సాక్షాత్కరిస్తాడు. దౌత్యంలో వ్యూహాత్మక మోసం చేస్తున్న సందర్భంలో ఇంగ్లండ్ రాణి ఎలిజబెత్ 1 కనిపిస్తారు. ఇక కనిపించని నాలుగో సింహం స్వయంగా ఆయన రూపమే. అమెరికా దేశానిది సామ్రాజ్యవాదం. వారు తమ దేశంలో ఉన్న సరుకు అమ్ముకునే బిజినెస్ మ్యాన్‌లు. ఈ సామ్రాజ్యవాదమనే దేశ బనియన్ ట్రీ క్రింద అభివృద్ధి చెందుతున్న దేశాల్లాంటి వృక్షాలు పెరగవు. అందుకే వారి స్నేహహస్తాన్ని వీడి బయటపడితేనే భారత్‌కు మంచి భవిష్యత్తు ఉంటుంది. ట్రంప్ వల్ల కంపు వస్తుందే తప్ప విజయం రాదనే విషయాన్ని తెలుసుకుంటే మంచిది.

## లేఖ

# పేద విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

రాష్ట్రంలో 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్' (BASS) పేరుతో దళిత, గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించాలన్న గొప్ప సంకల్పం, నేడు ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25వేల మంది ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఈ పథకం కింద 237 ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అభ్యసిస్తుంటే, ప్రభుత్వం ఆ పాఠశాలలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కొండలా పేరుకుపోయాయి. గత రెండు, మూడు సంవత్సరాలుగా పేరుకుపోయిన ఈ బకాయిల మొత్తం సుమారు రూ.200కోట్లకు చేరుకోవడంతో, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. 1 నుంచి 5వ తరగతి విద్యార్థికి సుమారు రూ.28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.42వేల వరకు ప్రభుత్వం చెల్లించాలి. కానీ, ఈ నిధులు సకాలం లో విడుదల కాకపోవడంతో, పాఠశాలల నిర్వహణ పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. టీచర్ల జీతాలు, హాస్టల్ నిర్వహణ, విద్యార్థులకు భోజన సదుపాయాలు, రవాణా ఖర్చుల కోసం ప్రైవేట్ ఫైనాన్షియర్ల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని యాజమాన్యాలు ఆవేదన చెందుతున్నాయి. ఈ అప్పుల ఒత్తిడి తట్టుకోలేక, పలు పాఠశాలలు అత్యంత అమానవీయంగా వ్యవహరించి, విద్యార్థులను తరగతులకు రానివ్వకుండా గేట్లు మూసివేసిన దృశ్యాలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. దీంతో, తమ పిల్లలకు మెరుగైన చదువులు ఆశించిన పేద తల్లిదండ్రులు, వారి బిడ్డలు పాఠశాలల బయటే నిలబడి కన్నీరు పెట్టుకోవాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల నుండి తీవ్ర నిరసన వ్యక్తమైన తర్వాతే, ఈ అంశంపై ప్రభుత్వం మొక్కుబడిగా స్పందించింది. విద్యార్థులు వీధిన పడిన ఘటనలపై ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి రావడంతో, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లకు హడావుడిగా ఆదేశాలు జారీ అయ్యాయి.

కలెక్టర్లు రంగంలోకి దిగి, విద్యార్థులను తరగతులకు అనుమతించాలని, బకాయిలు త్వరలోనే విడుదల అవుతాయని హామీ ఇవ్వాలని యాజమాన్యాలకు సూచించి, తాత్కాలికంగా సమస్యను సద్దుమణిగేలా చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పేరుకుపోయిన బకాయిలను విడుదల చేసి, పేదల చదువులను నిలబెట్టాల్సిన నైతిక బాధ్యత పాలకులపై ఉంది.


వెంకగారి భూమయ్య

## మల్లాపూర్‌లో సదర్ సమ్మేళనం




ప్రజాపక్షం/కాప్రా : దీపావళి పర్వదిన సందర్భంగా మల్లాపూర్‌లో మంగళవారం సదర్ సమ్మేళన కార్యక్రమం జరిగింది. మల్లాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్‌కుమార్ పాల్గొని యాదవులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## న్యాయవాదుల ఫెడరేషన్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అమరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/చర్లపల్లి: తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జనరల్ సెక్రటరీగా మేడ్చల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేవూరి అమరేందర్‌రెడ్డి ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ క్రిమికల్ కోర్ట్స్ బార్ అసోసియేషన్ హాల్లో జరిగిన ఎన్నికలు హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రవీంద్రారెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించి గెలుపొందిన ప్రధాన కార్యదర్శి అమరేందర‌రెడ్డి, అధ్యక్షులు అనంత్‌రెడ్డి, కోశాధికారి లక్కినేని సత్యనారాయణలను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు నూతనంగా ఎన్నికైన ఫెడరేషన్ సభ్యులను అభినందించారు.



## వాలీబాల్ పోటీల్లో విజేతగా విజయలక్ష్మి

ప్రజాపక్షం/శామీర్‌పేట : 69వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల సైనిక కళాశాలలో ఇంటర్ మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విజయలక్ష్మి రంగారెడ్డి జిల్లా టీమ్ తరపున ఎంపికైంది. సోమవారం సంగారెడ్డి జిల్లా, సదాశివపేట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రంగారెడ్డి జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన విజయలక్ష్మి జట్టు విజేతలుగా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విజయలక్ష్మిని కళాశాల ప్రిన్సిపల్ జూపల్లి రేణుక, ఉపాధ్యాయులు, పిఇటిలు నవనీత, స్వప్నలు అభినందించారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఎస్‌జిఎఫ్ అండర్ 19 విభాగంలో సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం సంతోషకరమని ప్రిన్సిపల్ జూపల్లి రేణుక అన్నారు. విజయలక్ష్మి స్వగ్రామం శామీర్‌పేట మండలం. వాలీబాల్ క్రీడల్లో రాణించినందుకు తల్లిదండ్రులు శ్రవణ్‌కుమార్ దంపతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



## ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌కు పలువురు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాపక్షం/నిజాంపేట్ : బిఆర్‌ఎస్ ఎల్పీ, విప్ కెపి.వివేకానంద్ పుట్టినరోజును పురస్కరించుకొని కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు బిఆర్‌ఎస్ కి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ రావు శంభీపూర్ రాజు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి హుజూర్ నగర్ ఇంచార్జి ఓ. నర్సింహా రెడ్డి కెపి.వివేకానంద్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మానసిక వికలాంగుడు ఆకాష్ అదృశ్యం




ప్రజాపక్షం/శామీర్‌పేట:శామీర్‌పేటలోని క్రిష్టన్ ఆశ్రమం నుంచి ఓ విద్యార్థి తప్పిపోయిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్పెషల్ హోమ్ ఫర్ డిజేబుల్డ్ చిల్డ్రన్ ఆశ్రమం నుంచి ఆకాష్ (14) ఈ నెల 16 నుంచి కనిపించకుండా పోయాడు. తప్పిపోయిన బాలుడు మానసిక వికలాంగుడని సరైన రీతిలో మాటలు మాట్లాడలేదని, తనపేరు కొన్ని మాటలు మాత్రమే చెప్పగలుగుతాడని పోలీసులు తెలిపారు. ఆశ్రమ సూపర్‌వైజర్ రాజన్ బేహరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని శామీర్‌పేట పోలీసులు తెలిపారు.



## ఘనంగా క్రీస్తు జయంతి వేడుకలు

ప్రజాపక్షం/ఉప్పల్ : రామంతపూర్‌లోని భక్త యోహాను ప్రాంతీయ గురు విద్యాలయంలో క్రీస్తు జయంతి 2025 జూబిలీ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకలను బిషప్ కార్డినల్ పూల ఆంథోనీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ వేడుకల తొలి రోజున వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కర్నూలు, కడప, ఆదిలాబాద్, శంషాబాద్ పీఠాల నుంచి 150 మంది చొప్పున ప్రతినిధులు పాల్గొన్నారు. బిషప్‌లు సమిష్టిగా ప్రార్థనలు నిర్వహించి, జూబిలీ ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా బిషప్ కార్డినల్ పూల ఆంథోనీ మాట్లాడుతూ ఈ జూబిలీ వేడుకలు కతోలిక సంఘంలో సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు ఇతర క్రైస్తవ సంఘాలతో సంబంధాలను మరింతగా పెంపొందించడానికీ తోడ్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్‌లు సాగిలి ప్రకాష్, జోహన్నెస్ గోరంట్ల, సాగినాల ప్రకాష్, ధమన్ కుమార్, ఫాదర్ క్రిస్టోఫర్ కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి ఇద్దరు మృతి



ప్రజాపక్షం/గండిపేట:నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని జెఎన్‌ఎన్‌యు ఆర్‌ఎం క్వార్టర్స్ సమీపంలో ఉన్న చెరువులో పడి ఇద్దరు మృతి చెందారు. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో పీరం చెరువు గ్రామంలోని జె ఎన్ ఎన్‌యుఆర్‌ఎం క్వార్టర్స్ సమీపంలో ఉన్న చెరువు వద్దకి యూసుఫ్ బి W/o జానీ మియా (60)లు ఆమె మనవరాళ్లు సబియా (10), ఆయేషమ్మ (19) కలిసి బట్టలు ఉతకడానికి వెళ్లారు. బట్టలు ఉతుకుతుండగా యూసుఫ్ బి , ఆమె మనవరాలు సబియా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఈతరాక మునిగిపోయినారు. వెంటనే ఆయేషమ్మ అరుచుకుంటూ బయటికి రాగా యూసుఫ్ బి అల్లుడు మహమ్మద్ కు విషయం తెలపడం తో ఆయన వెంటనే చెరువు వద్దకు వెళ్ళి స్థానికుల సహాయంతో వారిద్దరిని చెరువుల నుంచి బయటికి తీసి చూసేసరికి అప్పటికే వారు చనిపోయినారు. ఈ సంఘటనపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ కి తరలించారు.

# అవినీతికి కేరాఫ్‌గా రెవెన్యూ విభాగం

* ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన కలెక్టర్
* డిప్యూటేషన్ల పేరిట అంతర్గత బదిలీలు



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ విభాగంలో అవినీతి తాండవిస్తోంది. రాజధాని శివారు జిల్లాగా ఉన్న మేడ్చల్ మల్కాజిగిరి రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంతో విస్తరిస్తూ ఉండటం మరింత అవినీతికి మార్గంగా మార్చుకొంటున్నారు. గత కొద్ది కాలంగా జిల్లాలోని పలువురు తహసీల్దార్లతో పాటు పలువురు ఉద్యోగులు ఒకే కార్యాలయంలో ఏళ్ల తరబడి పని చేస్తుండటం, కొన్ని సందర్భాల్లో తమకు బదిలీలు అయినప్పటికి రాజకీయ పలుకుబడిని వినియోగించుకొని బదిలీలు రద్దు చేసుకొని అక్కడే తిష్టవేసి ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించుకోవటమేకాక భూ తగాదాల్లో దూర్చి లక్షలు పిండుకోవటంలాంటి విషయాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకొని వచ్చిన భూభారతి చట్టంలో రెవెన్యూ అధికారులకు భూసమస్యల పరిష్కారానికి గాను మరిన్ని అధికారాలు కట్టబెట్టటం రెవెన్యూ విభాగంలో కొనసాగుతున్న అవినీతికి మరింత అవకాశాలు కలుగనున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. తలాపాపం తిలా పడికెడు అన్న చందంగా కింది నుండి పైవరకు ఎవరి స్థాయిలో వారు వాటాలు తీసుకొంటూ ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి చిన్న పనుల నుండి మొదలెడితే భూసమస్యల వరకు దరఖాస్తుదారుల నుండి ముక్కు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాధితుల నుండి అందిన ఫిర్యాదుల మేరకు ఎసిబి విభాగం చేస్తున్న దాడుల్లో పలువురు చిక్కుకున్నా, కేసులు నమోదు చేస్తున్నా లంచాలు తీసుకొనే విషయంలో ఏ మాత్రం వెనుకడుగు వేయటం లేదు. భూముల కు సంబంధించి వ్యవహారాలు రెవెన్యూ అధికారులకు కాసుల పంట పండిస్తున్నాయి.

భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు, పట్టాదారు పాస్ పుస్తకా జారీ, వ్యవసా య భూములు వ్యవసాయేతర భూములుగా మార్పిడి వంటి పనుల్లో అయితే భారీ మొత్తాల్లో మామూళ్లు వసూ లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు రియల్ ఎస్టేట్ రంగం ఈ జిల్లాలో శరవేగంగా పెరుగుతుండటంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వివాదంలో ఉన్న భూములను కొనుగోలు చేయటం, ఆ తర్వాత వాటిని సంబంధిత తహసీల్దా ర్లు, రెవెన్యూ సిబ్బందిని మామూళ్ల మొత్తంలో ముడుపులిచ్చి తమకు అనుకూలంగా మార్చుకోవటంలో లక్షల నుండి కోట్ల రూపాయల వరకు ఇచ్చి తమ పనులను సులభంగా జరిపించుకొంటున్న విషయాలు బహిరంగ రహస్య మే. దుండిగల్ గండి మైసమ్మ మండల తహసీల్దార్ పొలం పట్టా పాస్‌బుక్‌లు ఇవ్వకుండా లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నాడంటూ దుండిగల్ తాండా 1 ప్రాంతానికి చెందిన సిద్దునాయక్ ఈ నెల 14న సిద్దూ నాయక్ తన కుటుంబ సభ్యులతో కల్సి పెట్రోల్ పోసుకొని ఆత్యహత్యాయత్నానికి పాల్పడటం సంచలనం జిల్లాలో కలకలం సృష్టించింది. ఈ ఉందంతం రెవెన్యూ విభాగ అవినీతికి ఓ ఉదాహరణ మాత్రమే.

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఎట్టకేలకు రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేసే దిశగా 14 మంది తహసీల్దార్లను గత శనివారం డిప్యూటేషన్ల పేరిట బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేరు. బదిలీ ఉత్తర్వులను ఉమ్మడిగా కాకుండా వ్యక్తిగతం గా ఆయా అధికార్లకు ఇవ్వటం చర్చనీయంగా మారింది. శామీర్‌పేట తహసీల్దార్ పి.యాదగిరిరెడ్డిని కీసర తహసీల్దార్‌గా, శామీర్‌పేట డిప్యూటి తహసీల్దార్ సమ్మక్కను అక్కడే తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పచెప్పారు. కలక్టరేట్‌లోని డి సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌ను ఘట్కేసర్ తహసీల్దార్‌గా, సిసిఎల్‌ఏ కార్యాలయంలో పనిచేసే కృష్ణ చైతన్యను మేడిపల్లి తహసీల్దార్ గా, కాప్రా తహసీల్దార్ సుచరితను మూడుచింతలపల్లి తహసీల్దార్‌గా, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్‌ను కుత్బుల్లాపూర్ తహసీల్దార్‌గా, కలెక్టరేట్‌లో హెచ్ సెక్షన్‌లో పని చేసే రాజశేఖరరెడ్డిని కాప్రా తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ బదిలీ చేసారు. కాగా తాజా బదిలీలు కేవలం జిల్లా కే పరిమితం కావటం ఏ మేరకు ఫలితాలిస్తాయా అన్నది వేచి చూడాల్సి ఉంది.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

### ఉప్పలి మల్కయ్య

ప్రజాపక్షం/తాండూరు:ప్రభుత్వం వెంటనే జిల్లా వ్యాప్తంగా సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన యాలాలలో వారు మీడియాతో మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన పత్తి పంట ఇప్పటికే సగం వరకు పాడై పోయిందని, పండించిన పంటకు సైతం గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో గ్రామాలలో దళారులు తిష్టవేసి అడ్డగోలుగా కొనుగోలు చేస్తూ రైతులను నిలువున దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధరను ప్రకటించినప్పటికి సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో మిల్లర్లు, దళారులు ఏకమైన గ్రామాలలో తక్కువ ధరకు కొనుగోలు చేసిన దండుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే జిల్లా వ్యాప్తంగా సిసిఐ ఆద్వర్యా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ఎడల జిల్లా వ్యాప్తంగా రైతులందరిని ఏకం చేసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శివప్ప, హనుమప్ప, గొల్ల వెంకటప్ప నర్సిములు తదితరులు ఉన్నారు.

## పోలీస్ అమరవీరల త్యాగం చిరస్మరణీయం

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ : పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. అక్టోబర్ 21న దేశ వ్యాప్తంగా నిర్వహించే పోలీస్ సంస్మరణ దినోత్సవాన్ని వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల బలిదానం దేశానికి గర్వకారణం అని కొనియాడారు.

పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవి. సమాజంలో భద్రత,శాంతి కాపాడటంలో పోలీసులు నిరంతరం పోరుతున్నారుని అన్నారు. దేశ సరిహద్దులో 1959లో జరిగిన చైనా దళాల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 10మంది వీరుల స్మారకార్థం ఈ రోజును జరుపుకోవడం మనందరి బాధ్యత అని వారి ధైర్యసాహసాలు, దేశభక్తి భావితరాలకు ఎంతో ఆదర్శమన్నారు. జిల్లా పరిపాలనలో పోలీస్ వ్యవస్థ పాత్ర చాలా కీలకమని, జిల్లా ప్రజల తరఫున అమరవీరులకు నివాళులు అర్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి మాట్లాడుతూ దేశ అంతర్గత భద్రతను కాపాడుతూ, చట్టాన్ని అమలుచేస్తు ప్రాణాలు కోల్పోయిన వీర పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు.

పోలీసు ఉద్యోగం కేవలం విధి నిర్వహణ మాత్రమేకాదని, ప్రజలకు సేవచేసే మహత్తర అవకాశంగా భావించాలన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో మన జవాన్లు చేసిన, చేస్తున్న కృషి వెలకట్టలేని వారి నిస్వార్థ సేవ, త్యాగా లు జిల్లా పోలీసులకు నిత్యస్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అని విధాల అండగా ఉంటామాని హామీ ఇచ్చారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా నేటి నుండి సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం అక్టోబర్ 31వ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇట్టి సందర్భంగా జిల్లా పోలీసు అధికారులకు వ్యాసరచన పోటీలు, రక్తదాన కార్యక్రమాలు, సైకిల్ ర్యాలీలు మొదలగు వివిధ కార్యక్రమాలలో పెద్దసంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎస్‌పి కోరారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రాములు, డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణ, జానయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 12 మంది రైతుల నామినేషన్లు..

### ఫార్మాసిటీ రద్దుపై కాంగ్రెస్ మోసం .. రైతుల ఆగ్రహం..



ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన ఫార్మాసిటి గ్రామాలకు చెందిన దాదాపు 12 మంది రైతులు మంగళవారం జూబ్లిహిల్స్ ఎంఎల్‌ఏ ఉప ఎన్నికల్లో పోటి చేయడానికి నామినేషన్లు వేశారు. నాలుగు గ్రామాల నుండి దాదాపు 150 మంది రైతులు పెద్దెత్తు న తరలి వెళ్ళారు. డప్పు చప్పుళ్ళతో ఆటాపాటలతో రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేశారు. ప్లేకార్డులను చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మాకు హామీ ఇచ్చి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ గ్రామాల రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మాసిటిని రద్దు చేస్తామని గొప్పలు చెప్పింది. రైతుల ఉద్యమాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇక్కడ ఎట్టి పరిస్థితిలో ఫార్మా సిటీని రానివ్వమని కల్లబొల్లి మాటలు చెప్పింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ఫార్మాసిటిని రద్దు చేస్తామని చెప్పింది. అధికారంలోకి రాగానే మాట మార్చి ఫార్మాసిటిని రద్దు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి మంత్రులు, భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర రైతుకమిషన్ చైర్మేన్ ముదిరెడ్డి కోదండారెడ్డిలు రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఎందుకు ఇప్పుడు నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగించడానికే నామినేషనుల్ల వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం దిగి వచ్చి ఫార్మాసిటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫార్మా సిటి ఉద్యమ నాయకులు తదితరు లు పాల్గొన్నారు.





## డిసెంబర్‌లో గ్లోబల్ టిపిఒ అండ్ హెచ్‌ఆర్ సమ్మిట్

ప్రజాపక్షం/ఖైరతాబాద్: గ్లోబల్ టిపిఒ అండ్ హెచ్‌ఆర్ సమ్మిట్ – 2025ను డిసెంబర్ 5, 6న హైదరాబాద్ గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్‌ఐటిహెచ్‌ఎం)లో నిర్వహించనున్నట్టు తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిపిఒ) అధ్యక్షులు ప్రొఫెసర్ జయరామ్ తెలిపారు. విద్యార్థులకు నైపుణ్యత, ఉద్యోగాల కల్పనపై చర్చించడమే ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశమన్నారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సమ్మిట్‌కు సంబంధించిన బ్రోచర్‌ను టిపిఒ ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ కల్పన ధ్యేయంగా టిపిఒ కృషిచేస్తుందన్నారు. ఈ సమ్మిట్‌లో 24 రాష్ట్రాల ప్రతినిధులు, హెచ్‌ఆర్‌లు పాల్గొని, యువత ప్రతిభ, సాంకేతిక, పారిశ్రామి క, పర్యాటక అంశాలపై నిపుణులు, సలహాలు, సూచనలిస్తారని తెలిపారు.

మొదటిరోజు 5న పరస్పర బృంద చర్చలు, 6న అవార్డు ప్రదానోత్సవం ఉంటుందన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ దేవిప్రసాద్, టిపిఒ ఉపాధ్యక్షులు ప్రశాంత్, ప్రధానకార్యదర్శి సతీశ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో టాలీవుడ్ నటుడు పూజలు



ప్రజాపక్షం/శంకర్ పల్లి: శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలసిన 11 వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో సోమవారం టాలీవుడ్ నటుడు చిన్నా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. దీపావళి పండగ రోజున స్వామివారి సన్నిధిలో పూజలు చేయడం నా అదృష్టంగా భావిస్తున్నానని చిన్నా అన్నారు. అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్ రెడ్డి చిన్నాను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పరీక్షల మూల్యాంకన జవాబు పత్రాల వేలం

ప్రజాపక్షం/రంగారెడ్డి:జిల్లా విద్యాశాఖాధికారి, రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన 10వ తరగతి మార్చి 2024, అడ్వాన్స్ సప్లిమెంటరీ జూన్ 2024 ప్రభుత్వ పరీక్షల మూల్యాంకన జవాబుపత్రాల వేలం వేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా విద్యా శాఖ అధికారి పి. సుశీందర్ రావు తెలిపారు.వేలములో పాల్గొన దలచిన జిల్లా లోని రద్దీ వ్యాపారులు రూ.10,000 జిల్లా విద్యాశాఖాధికారి, రంగారెడ్డి జిల్లా పేరున డిమాండ్ డ్రాఫ్టు తీసి వారి వారి రే ట్లివరాలతో పాటు సీల్డ్ కోటేషన్ ను జిల్లా విద్యాశాఖాధికారి, రంగారెడ్డి జిల్లా,ఐడిఒసి కొంగ కలాన్, జిల్లా కార్యాలయం నందు తేది. 24.10.2025 ఉదయం 11.00 గంటల నుండి సాయం త్రం 300 గంటలలోపు సమర్పించ వలసినది గా డిఇఒ సుశీందర్ రావు కోరారు. అదేరోజు సాయంత్రం 400 గంటలకు టెండర్స్ ఓపెన్ చేయబడుతుందని పేర్కొన్నారు.

## కట్ట పోచమ్మ దేవాలయంలో అన్నదానం



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: శ్రీ కట్ట పోచమ్మ, శ్రీ కట్ట మైసమ్మ అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మంగళవారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి సన్నిధితో అమావాస్య రోజు భక్తులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఆలయ కమిటి చైర్మెన్ నట్టమోని శ్రీధర్ మాట్లాడు తూ భక్తుల కోరిన కోరికలు తీర్చుతు కొంగు బంగారంగా నిలుస్తున్న అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లప్పుడు ప్రజలపై ఉండాలని పేర్కొన్నారు. ప్రతి అమావాస్య రోజు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాల ను నిర్వహించడం జరుగుతుందని, ఇందుకు భక్తులు కాలనీల నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి సైతం ఎక్కువగా వస్తుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి గౌరవ అధ్యక్షుడు నల్లమోని బిక్షపతి, ట్రెజరర్ అందె రాజేశ్వర్, ఉపాధ్యక్షులు జిటి సంతోష్, రోమియో రమేష్, ప్రధాన కార్యదర్శి అందె జంగరాజు, ప్రచార కార్యదర్శి మంచిర్యాల సురేష్, శ్రీనివాస్, భరత్, శ్రీను, అశోక్, మహేష్, బూర్గుల రమేష్, వీరేష్, కృష్ణ, తరుణ్, దినేష్, రవి, శంకర్, అరవింద్, సల్ల మహేష్, అశోక్, వీరేష్, వెంకటేష్, అజయ్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ, లేఔట్ అనుమతుల్లో.. దూసుకుపోతున్న హెచ్ఎండిఎ

- ఆదాయ వృద్ధిలో రికార్డు స్థాయికి రూ.1225 కోట్ల ఆదాయం
- గత ఏడాదితో పోలిస్తే 137 శాతం పెరిగిన అనుమతులు
- విప్లవాత్మక మార్పులతో శరవేగంగా అనుమతుల మంజూరు
- వేగవంతమైన సేవలతోనే పురోగతి సాధించాం
- హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఎ) 2025లో పట్టణ ప్రణాళిక విభాగం(టౌన్‌ప్లానింగ్) భవన నిర్మాణ, లేఔట్ అనుమతులలో ఎన్నడూలేని విధంగా వేగంగా మంజూరు చేయడం ద్వారా చరిత్ర సృష్టించింది. దీని ద్వారా గడచిన తొమ్మిది నెలల్లోనే రూ.1,225 కోట్ల రికార్డు ఆదాయం సాధించింది. అనుమతుల విషయంలో వేగవంతమైన నిర్ణయాలు, పౌర సంస్కరణల్లో గణనీయమైన వృద్ధి సాధించింది. 137 శాతం పెరిగిన అనుమతులు, 88 లక్షల చదరపు మీటర్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు హెచ్ఎండిఎ ద్వారా 6,079 దరఖాస్తులు పరిష్కరించారు. గత ఏడాది తో పోలిస్తే ఇది 49 శాతం అధికం. 2,961 బిల్డింగ్ అనుమతుల దరఖాస్తుల్లో 2,904కు అనుమతులు మంజూరు చేశారు. మొత్తం 88.15 లక్షల చదరపు మీటర్ల బిల్ట్ అప్ ప్రాంతానికి అనుమతులు మంజూరు కాగా, ఇది 2024తో పోలిస్తే 239 శాతం అధికం కావడం విశేషం. భవన అనుమతులు, లేఔట్ అనుమతుల విషయంలోకానీ, ఆదాయ వృద్ధిలోకానీ గత రెండు సంవత్సరాలతో పోలిస్తే రెట్టింపు అభివృద్ధిని సాధించిందని హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. ఈ ఏడాది 2,961 భవన అనుమతుల దరఖాస్తులు అందగా, వాటిలో 2,904 కు అనుమతులు మంజూరు చేశామన్నారు. దీని ద్వారా హెచ్ఎండిఎకు రూ. 1,225 కోట్లు ఆదాయం సమకూరిందన్నారు. హెచ్ఎండిఎ సేవలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని చెప్పారు. అనుమతులలో వేగం, సమాచారం పంచుకునే తీరు, ప్రతి దరఖాస్తుపై సమగ్ర సమీక్షా విధానం ఈ పురోగతికి దోహదం చేశాయని తెలిపారు. ఈ విజయాల వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత, స్పష్టమైన మార్గదర్శనం ఉన్నదని సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో హెచ్ఎండిఎ దేశంలోనే ప్రగతిశీలమైన అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థగా ఎదుగుతోందన్నారు.

**ఫైల్ పరిష్కారాల్లో రికార్డు..**

2025 జనవరి నుంచి సెప్టెంబర్ వరకు మొత్తం 6,079 దరఖాస్తులు పరిష్కరించగా, ఇది 2024తో పోలిస్తే 49 శాతం, అలాగే 2023తో పోలిస్తే 36 శాతం అధికం. మొత్తం 5,499 దరఖాస్తులు వచ్చి, దానికంటే అధిక సంఖ్యలో పరిష్కారం జరగడం విశేషం.

**భవన అనుమతుల్లో వేగవంతమైన సేవలు..**

- ☞ ఈ ఏడాది 2,961 భవన అనుమతుల దరఖాస్తులు అందగా, వాటిలో 2,904 (98 శాతం పైగా)కు అనుమతులు మంజూరయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 47 శాతం వృద్ధి, 2023తో పోలిస్తే 26 శాతం వృద్ధి.
- ☞ మొత్తం బిల్ట్ అప్ ఏరియా : 88.15 లక్షల చదరపు మీటర్లు.
- ☞ మంజూరైన ఎంఎస్‌బి (బహుళ అంతస్తుల భవనాలు) : 77 దరఖాస్తులు 78.71 లక్షల చదరపు మీటర్లకు అనుమతి, రూ.514 కోట్ల ఆదాయం.

**ఆదాయ వృద్ధిలో రికార్డు..**

- ☞ 2025 (జనవరి సెప్టెంబర్) : రూ. 1,225 కోట్లు ఆదాయం
- ☞ 2024తో పోలిస్తే : 245 శాతం వృద్ధి (రూ. 355 కోట్లు)
- ☞ 2023తో పోలిస్తే : 82 శాతం వృద్ధి (రూ. 674 కోట్లు)
- ☞ సెప్టెంబర్ 2025లో ఒక్క నెలలోనే రూ.132 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం.

**వేగవంతమైన క్లియరెన్స్ విధానం..**

- ☞ హెచ్ఎండిఎ ఫైళ్ల పరిష్కారానికి ప్రత్యేక మానిటరింగ్ విధానాన్ని రూపొందించింది. పెండింగ్ ఫైళ్లను నిర్దిష్ట కాల వ్యవధి ఆధారంగా విభజించి, వారంవారం సమీక్ష ద్వారా సమస్యలపై త్వరితగతిన చర్యలు తీసుకుంటోంది. 30 రోజులకు మించిన పెండింగ్ ఫైళ్లను 2 శాతం లోపుకి తగ్గించడంలో విజయవంతమైంది.

**లేఔట్‌లలో విస్తృత అనుమతులు..**

- ☞ **ఓపెన్ ప్లాట్ల లేఔట్ అనుమతులు :** 2,862 ఎకరాలు (2024తో పోల్చితే 512 శాతం వృద్ధి)
- ☞ **హౌసింగ్‌తో కూడిన లేఔట్‌లు :** 38.24 లక్షల చదరపు మీటర్లు (2024తో పోల్చితే 186 శాతం వృద్ధి)

**హెచ్ఎండిఎ అనుమతించిన కొన్ని ప్రధాన మల్టీ-స్టోరీడ్ ప్రాజెక్టులు..**

- ☞ **కోకాపేట్ :** 5 సెల్లార్లు + 63 అంతస్తుల బిల్డింగ్ 15.45 లక్షల చదరపు అడుగులు, 362 యూనిట్లు
- ☞ **కోకాపేట్ :** 5 బ్లాకులు 56 అంతస్తులు 55.44 లక్షల చదరపు అడుగులు
- ☞ **బండ్లగూడ జగీర్ :** 30 అంతస్తుల టవర్లు 15.03 లక్షల చదరపు అడుగులు
- ☞ **బండ్లగూడ జగీర్ :** 47 అంతస్తులు 13.51 లక్షల చదరపు అడుగులు
- ☞ **కోకాపేట్ (కాంప్లెక్స్ ప్రాజెక్ట్) :** రెసిడెన్షియల్ + కమర్షియల్ 66.03 లక్షల చదరపు అడుగులు.

# ముగ్గురు అధికారులను నియమించిన ఎన్నికల కమిషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ ముగ్గురు పరిశీల కులను నియమించింది. ప్రక్రియను నిస్పా క్షికంగా, పారదర్శకంగా, శాంతియుతంగా జరపడానికి ఉప ఎన్నిక సాధారణ పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులుగా ఐపిఎస్ అధికారి ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి సంజీవ్ కుమార్ లాల్లను నియమించింది. ఈ అధికారులు ఎన్నికల ప్రక్రియలో సాధారణ పర్యవేక్షణ, శాంతి భద్ర తల పర్యవేక్షణ, పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ వంటి అంశాలను పరిశీలకులు పర్యవేక్షిస్తారు. ఈ పరిశీలకులు ఎన్నికల నిబంధనల అమలు, శాంతి భద్రతలు, ఎన్నికల ఖర్చు పర్యవేక్షణ వంటి అంశాలను దగ్గరగా పర్యవేక్షించనున్నారు. ఎన్నిక పూర్తి అయ్యేవరకూ అందుబాటులో ఉంటారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, శాంతి భద్రతలు, వ్యయాలపై వీళ్లకు తెలియజేయాలని కమిషన్ సూచించింది.

# అడుగడుగునా పోలీసుల నిర్లక్ష్యం ఇద్దరి నిండు ప్రాణాలు బలి

**● నిందితుడి చేతిలో కానిస్టేబుల్ హత్య ● పోలీసు కాల్పుల్లో నిందితుడి హతం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిజామాబాద్ సిసిఎస్ పోలీసుల నిండు నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణా లు బలి అయ్యాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించడంలో పోలీసులు నిర్లక్ష్యం వహించడం వల్ల కానిస్టేబుల్ దారుణ హత్య కు గురయ్యాడు. ఇక ఆసుపత్రిలో పోలీసుల బందోబస్తు నిర్లక్ష్యం మూలంగా పోలీసుల కాల్పుల్లో నిందితుడు హతమయ్యాడు. ఈ రెండు ఘటనల లో పోలీసుల నిలువెత్తు నిర్లక్ష్యం కొటొచ్చినట్లు క నిపించింది. పోలీసు అడుగడుగునా నిర్లక్ష్యం వ హించడం వల్లనే మూడు రోజుల్లో ఈ రెండు దా రుణ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇకనుంచై నా నేరస్తులను పట్టుకునే సమయంలో, తరలించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి ఘటనలకు చెక్‌పెట్టవచ్చు. నేరస్తులను అదుపులోకి తీసుకునే సమయంలో అతని జేబులో ఏమైనా మారణాయుధాలు ఉన్నాయా అని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. అయితే నేరస్తుడు రియాజ్‌ను ఈ నెల 17న రాత్రి 9 గంటలకు నాగారంలో పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో పోలీసులు ఎలాంటి తనిఖీ చేయలేదు. తనిఖీ చేసి ఉంటే అతని జేబులో ఉన్న కత్తిని అప్పుడే పోలీసులు స్వాధీనం చేసుకుని ఉండేవారు. ఫలితంగా కానిస్టేబుల్ ఎంపల్లి ప్రమోద్‌కుమార్ (35) హత్యకు గురికావాల్సి వచ్చింది. పలానా చోట నేరస్తుడు ఉన్నాడని తెలియగానే పోలీసులు నాలుగు చక్రాల వాహనం తీసుకెళ్లాలి. ఇక్కడ అది జరగలేదు. రెండు బైక్‌లపై ముగ్గురు పోలీసులు, ఒక ప్రైవేటు వ్యక్తి వెళ్లారు. ఒక బైక్‌పై ఎస్ఐ విఠల్‌రావు, మరో కానిస్టేబుల్. మరో బైక్‌పై కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ ఇతని అల్లుడు అక్షయ్ వెళ్లారు. నాగారం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని సిసిఎస్‌కు బయల్దేరారు. ప్రమోద్ బైక్ నడిపిస్తుండగా వెనకాల ప్రమోద్ అల్లుడు అక్షయ్ ఉన్నాడు. వీరిద్దరి మధ్యలో రియాజ్‌ను కూర్చోబెట్టారు. మరో బైక్‌పై ఎస్ఐ విఠల్‌రావు, కానిస్టేబుల్ వస్తున్నారు. బైక్‌పై నిందితుడిని స్టేషన్‌కు తరలించే సమయంలో సాధారణంగా ఇద్దరు పోలీసుల మధ్య నిందితుడిని కూర్చోబెట్టుకుంటారు. కానీ ఇక్కడ ఆ అవకాశం ఉన్నా అలా చేయకపోవడం పోలీసుల నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఇక నిందితుడిని తీసుకెళ్తున్న బైక్‌ను వెనకాల వస్తున్న ఎస్ఐ విఠల్‌రావు బైక్ అనుసరించాల్సి ఉండే కానీ ఇక్కడ అలా జరగలేదు. ఇక్కడ కూడా పోలీసులు నిర్లక్ష్యం వహించారు. నిందితుడు వెళ్తున్న బైక్‌ను వెనకాల వస్తున్న ఎస్ఐ బైక్ అనుసరించి ఉంటే కానిస్టేబుల్ హత్యకు గురి అయ్యేవాడు కాదు. ఇంతకి నిజామాబాద్ సిసిఎస్‌లో నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయా లేవా.. వాటిని ఇక్కడ ఎందుకు వాడలేదనేది కూడా ప్రశ్నార్థకంగా మారింది. కానిస్టేబుల్‌పై రియాజ్ కత్తితో పొడుస్తున్న సమయంలో ఎస్ఐ విఠల్‌రావు అక్కడే ఉన్నాడని పోలీసులు చెబుతున్నా నమ్మదగ్గ ఆధారాలు కనిపించడంలేదు. దాడి జరిగితే ఎస్ఐ తన సర్వీస్ రివాల్వార్‌తో రియాజ్‌పై ఎందుకు కాల్పులు జరపలేదు అనేది ప్రశ్నగా మిగిలింది. ఇంతకి ఎస్ఐ వద్ద సర్వీస్ రివల్వార్ ఉన్నదా లేదా అనే విషయం కూడా ఇక్కడ అధికారులు గోప్యంగా ఉంచారు. రివాల్వార్ ఉంటే ఎందుకు ఉపయోగించలేదనేది కూడా అనుమానాలకు తావిస్తుంది. నిందితుడిని ఎస్ఐ ఫాలో చేయలేదనడానికి ఈ ఘటన బలం చేకూరుస్తుంది. దీంతో అదును చూసి కానిస్టేబుల్‌ను చంపి రియాజ్ పారిపోడానికి మార్గం ఏర్పడిందనేది వినిపిస్తుంది. పారిపోయిన రియాజ్ ఆదివారం సారంగాపూర్ వద్ద కనిపించడంతో వెల్డింగ్ షాప్ యజమాని ఆసీఫ్ పట్టుకుందుకు ప్రయత్నించాడు. రియాజ్ కత్తితో దాడి చేయడంతో ఆసీఫ్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో మరికొంత మంది పోలీసులు వచ్చి రియాజ్‌ను అదుపులోకి తీసుకుని చేతులకు బేడీలు వేసి జీపులో సిసిఎస్‌కు తీసుకెళ్లారు. అయితే రియాజ్‌కు పెద్దగా దెబ్బలు లేకున్నా పోలీసులు సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడం పోలీసుల నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఆసుపత్రిలో చేర్పించిన రియాజ్ వద్ద తగిన రీతిలో బందోబస్తు చర్యలు తీసుకోకపోవడం మరో నిర్లక్ష్యానికి నిదర్శనం. ఫలితంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో రియాజ్ మృతి చెందాడు. సరైనా బందోబస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదు. ఆసుపత్రిలో నేరస్తులను చేర్పించిన సమయంలో పోలీసులు వాళ్ల కాళ్లకుగాని చేతులకు గాని గొలుసులు వేస్తారు. కానీ ఇక్కడ అలా పోలీసులు వ్యవహరించలేకపోవడంతో పోలీసుల నిర్లక్ష్యంపై మరోసారి ఆరోపణలు వస్తున్నాయి. దీంతో నిందితుడు కానిస్టేబుల్ చేతిలో ఉన్న ఎస్ఎల్ఆర్‌ను లాక్కోవడం, వెంటనే సిఎఆర్ ఇన్స్‌పెక్టర్ సతీష్ కాల్పులు జరపడంతో రియాజ్ మృతి చెందాడు. రక్షణ చర్యలు తీసుకుంటే ఇలా జరిగి ఉండేది కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

# ఆ రెండు పార్టీలకు ఓటేస్తే మజ్లిస్‌కు వేసినట్టే : కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే మజ్లిస్ పార్టీకి వేసినట్టేనని, లేదా మూసీలో వేసినట్టేనని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి నామినేసన్ దఖాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ హయాంలో మాదిరిగానే కాంగ్రెస్ మాటలు కోటలు దాటుతున్నాయి అని విమర్శించారు. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. ఎవరికి ఇచ్చారో సిఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరు అందుబాటులో ఉంటే వారికే వేయాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థిని దారుస్సలాం ఎంపిక చేసిందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ మూడూ కుటుంబ పార్టీలేనని అన్నారు. పదేళ్లు పాలించిన కెసిఆర్ ప్రజలకు ఇబ్బందులు వస్తే, ఫాం హౌస్ నుంచి బయటకు రావడం లేదన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాలన్నారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ లో పాతబడ్డ ఇండ్లు, మురికి కూపాలు తప్ప ఏమీ లేవన్నారు. బిఆర్ఎస్ వాళ్లు బిల్డింగ్ పర్మిషన్లు ఇచ్చి దోచుకున్నారని, కాంగ్రెస్ కబ్జాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ మీద కోపం తో బిఆర్ఎస్‌కి ఓట్లు వేస్తే, కొంప కొల్లేరు అవు తుందన్నారు. లంకల దీపక్ రెడ్డిని గెలిపిస్తే, జూబ్లీహిల్స్ అభివృద్ధి బాధ్యత కిషన్ రెడ్డి తీసుకుంటారని చెప్పారు. కాళేశ్వరంపై మీరు మాట్లాడకండి, మూసీలో దోచుకుంటే మేం మాట్లాడం అని కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒప్పందాలు చేసుకున్నాయని ఆరోపించారు. ఎంఐఎం పార్టీ నేతలు దేశమంతా తిరుగుతూ బిజెపిని ఓడిస్తం అంటున్నారని, కానీ జూబ్లీహిల్స్‌లో అభ్యర్థిని పెట్టేదన్నారు. ఎంఐఎంలో అన్న కాంగ్రెస్‌కు, తమ్ముడు బిఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నారని అసదుద్దీన్, అక్బ రుద్దీన్‌లను ఉద్దేశించి ఆరోపించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి, మజ్లిస్ మధ్యే పోటీ జరుగుతోందన్నారు. వాస్తవానికి ప్రజలు ఇప్పటికే బిజెపి వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిలు రఘునందన్ రావు, ఈటల రాజేందర్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


# గీత పనివారల సంఘం వార్షికోత్సవం

**అనంతపురం :** గీత పనివారల సంఘం 68 వార్షికోత్సవం అనంతపురంలోని పూతూరు ఉమానగర్‌లో ఉన్న నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ గీత పనివారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రఘు అధ్యక్షతన జరిగిన ఆవిర్భావ దినోత్సవానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల అధ్యక్ష కార్య నిర్వాహకులు లింగమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ శ్రమ విభజనల ఆధారంగా వృత్తులు, వృత్తులు ఆధారంగా కులాలు ఏర్పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో బొమ్మగాని ధర్మభిక్షం 1957 సంవత్సరంలో గీత పనివారుల మహాసభను నిర్వహించి ఆంధ్రప్రదేశ్ గీత పనివారుల సంఘం ఏర్పాటు చేసి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకున్నారన్నారు.



# పోలీస్ అచంచల చిత్తశుద్ధే జాతి క్షేమం

**ఉపరాష్ట్రపతి,ప్రధాని సహా మంత్రుల పోలీసు సంస్మరణ దినోత్సవ సందేశం**




**న్యూఢిల్లీ:** దేశంలో పోలీసు వ్యవస్థ కనబరుస్తున్న అచంచలమైన చిత్తశుద్ధే జాతికి క్షేమకరమని భారత ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇతర కేంద్రమంత్రులు అన్నారు. అమరులైన పోలీస్ జవానుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి సహా కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా తదితరులు మంగళవారం ఎక్స్ వేదికగా అభినందనలు చెప్పారు. విధి నిర్వహణలో విరామంలేకుండా చిత్తశుద్ధి, కృతనిశ్చయం, ధైర్య,పరాక్రమాలతోపాటు జాలి కరుణ ప్రదర్శించడంలో పోలీసులే ఉదాహరణ అని తమ సందేశంలో పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా ఉపరాష్ట్రపతి తన సందేశంలో, విశిష్టమైన ధైర్యసాహసాలు ప్రదర్శించిన అమర పోలీసులకు హృదయపూర్వక నివాళులు అర్పించారు. వారు విధి నిర్వహణలో మహోన్నతమైన త్యాగాలు చేశారన్నారు. ''జాతి భద్రతలో తిరుగులేని వారి ధైర్యసాహసాలు, ప్రజల క్షేమంపట్ల వారికున్న చిత్తశుద్ధి, లోతైన గౌరవం ప్రశంసనీయం''' అని పేర్కొన్నారు. పోలీసులు కనబరిచే అచంచలమైన చిత్తశుద్ధి, సంక్షోభ సమయాలతోపాటు ఎల్లవేళలా విధినిర్వహణతో సేవలందించేందుకు చూపించే సంసిద్ధత, మానవతా దృక్పథం గొప్ప ఉదాహరణలు'' అని సి.పి.రాధాకృష్ణన్ తన సందేశంలో ఎక్స్ వేదికగా తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన సందేశంలో ప్రజాభద్రత, ప్రజాక్షేమంపట్ల పోలీసులకు ఉన్న తిరుగులేని చిత్తశుద్ధే దేశాన్ని కాపాడుతోందన్నారు. ''పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మన పోలీసుల ధైర్యసాహసాలకు నేను గౌరవ వందనం చేస్తున్నాను, విధి నిర్వహణలో వారు చేసిన త్యాగాలను స్మరించుకుంటున్నా, చెక్కుచెదరని వారి చిత్తశుద్ధి, విశ్వాసమే జాతికి క్షేమదాయకం'' అని ఎక్స్ వేదికగా పోస్టింగ్ చేశారు. ప్రతి సంవత్సరం అక్టోబరు 21వ తేదీన అమరులైన పోలీసుల సంస్మరణ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా పాటిస్తారు. 1959లో 10 మంది కేంద్ర రిజర్వు పోలీసు దళ సభ్యులు ప్రాణత్యాగం చేసిన రోజును ప్రతి సంవత్సరం అమర జవానుల సంస్మరణ దినోత్సవంగా దేశవ్యాప్తంగా పాటిస్తారు. లద్దాఖ్‌లోని హాట్ స్ప్రింగ్ ప్రాంతంలో చైనా సైనికులు మాటువేసి చేసిన దాడిలో వారు ప్రాణాలు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందనలు తెలియజేస్తూ, దేశ ఆంతరంగిక భద్రతకు ఎదురయ్యే బెదిరింపులు, సవాళ్ళను పారద్రోలి, నేరాలను అదుపుచేయడంతో మన జవానులు గొప్ప చరిత్రను లిఖించారని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అత్యవసర సమయాలలో అందరికంటే ముందుగా దేశంలో తక్షణం స్పందించే అత్యవసర బలగాలుగా పోలీసులు దేశంలో ఒక చరిత్ర సృష్టించారని, వారికి నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నానన్నారు. అదేవిధంగా దేశ నేత, స్వాతంత్ర్యపోరాట యోధుడు నేతాజీ సుభాశ్‌చంద్రబోస్‌కు, ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో త్యాగాలు చేసిన వీరోచితమైన యోధులకు ప్రత్యేకంగా నివాళులు అర్పించారు.దేశ ప్రజలు తమ సొంత సైన్యంద్వారా, సైనిక ప్రచారం ద్వారా స్వాతంత్ర్యం సాధించగలరని విప్లవయోధుల హృదయాల్లో ఒక బలమైన విశ్వాసాన్ని పాదుగొప్పడంకోసమే సుభాశ్ చంద్రబోస్ భారత జాతీయ సైన్యాన్ని స్థాపించారని నివాళులు అర్పించారు. నేతాజీ నాయకత్వంలో భారత జాతీయ సైన్యం యోధులు అండమాన్,నికోబార్ దీవులలో 1943లోనే జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని,భారతదేశ స్వాంత్ర్యాన్ని ప్రకటించారని, జాతీయ మౌలిక విలువలకు ఆయన ఒక స్ఫూర్తిగా నిలిచారని స్మరించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా తన సందేశంలో, దేశ సరిహద్దుల్లో అస్థిరత ఏర్పడిన ప్రతిసారీ కొత్త తరహా నేరాలు, ఉగ్రవాదం, సైద్ధాంతిక యుద్ధం సమాజంలో రూపుదిద్దుకుంటున్నదని అన్నారు. ప్రాణత్యాగాలు చేసిన జాతీయ పోలీసు స్మారకచిహ్నం వద్ద న్యూఢిల్లీలో పుష్పగుచ్ఛాలు ఉంచి వారిని ఆయన స్మరించారు. ఈ సందర్భంగా అక్కడ హాజరైన పోలీసులను ఉద్దేశించి మాట్లాడుతూ, దేశంలో సైన్యం, పోలీసులు వేరువేరు వేదికల ద్వారా ఇంటా బయటా పోరాటం చేస్తున్నప్పటికీ, దేశ ప్రయోజనాలు కాపాడటమే వారి ఉమ్మడి లక్ష్యమని అన్నారు. 2047వ సంవత్సరం నాటికి వికసిత భారత్ సాధనకు వీలుగా దేశంలో అంతర్గతంగా, దేశం వెలుపల కూడా భద్రతను పటిష్టం చేసుకుని శత్రువులను సమతుల్యం చేయడం ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అన్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు బలగాలు, ఢిల్లీ పోలీసులు ఉమ్మడిగా పరేడ్ నిర్వహించారు. ఈనాడు దేశంలో నేరాలు చాలా వ్యవస్థీకృతంగా రూపుదిద్దుకుంటున్నాయని, కంటికి కనిపించకుండా, సంక్లిష్టమైన పద్ధతులలో, సమాజంలో కల్లోలం సృష్టించే ఉద్దేశంతో దేశ స్థిరత్వాన్ని దెబ్బతీసి చిందరవందర చేసేందుకు సవాళ్ళు విరుసుతున్నాయని పేర్కొన్నారు. దేశంలో నేరాలను అదుపు చేయడంలో పోలీసులు గొప్ప గురుతర బాధ్యతలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. నైతిక విలువలతో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. పోలీసులు ఎంతో అప్రమత్తంగా వ్యవహరిస్తూ కాపలాకాస్తున్నారనే గొప్ప విశ్వాసంతోనే ఈనాడు దేశంలో ప్రజలు ఎంతో ప్రశాంతంగా నిద్రపోతున్నారని అన్నారు. ఈ విశ్వాసమే దేశ స్థిరత్వానికి మూలమని అన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం జాతీయ భద్రతకు కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. అనేక దశాబ్దాలుగా దేశంలో పోలీసుల త్యాగాలకు, వారి సేవలకు గుర్తింపు కరువైందని, ఐనప్పటికీ నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం 2018లో జాతీయ పోలీసు స్మారకాన్ని నెలకొల్పిందని, వారి గౌరవార్థం, స్మారకంగా పోలీసు బలగాలను గౌరవిస్తోందన్నారు. పోలీసులకు ప్రభుత్వం అత్యాధునికమైన ఆయుధాలు, నేరాలను అదుపు చేసేందుకు ఇతర సాంకేతిక సదుపాయాలు కూడా సమకూరుస్తోందన్నారు.

# హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

## సర్వాంగ సుందరంగా 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి : మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి హుస్నాబాద్‌ను అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దుతామని తెలంగాణ బిసి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టే 250 పడకల ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడతూ హుస్నాబాద్‌లో ఇప్పటికే ఎల్లమ్మ చెరువు ఆధునీకరణ, కొత్తపెల్లి నుండి హుస్నాబాద్ వరకు ఏర్పాటు చేసే 4 వ రుసల రోడ్డు పనులు , 10 కోట్లతో మహాసముద్రం గండి ఆధునీకరణ, పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. అలాగే గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ ల నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. హుస్నాబాద్‌లో 8 2 కోట్లతో నిర్మించే నూతన ప్రభుత్వ అసుపత్రిని నాల్గు జిల్లాల మధ్యలో ఉన్నందున ప్రభుత్వ ఆసుపత్రిని స ర్వాంగ సుందరంగా నిర్మాణం పూర్తి చేసుకుంటామని అన్నారు. అలాగే హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి 38 మందితో అన్ని విభాగాల వైద్యులను నియమించుకుంటామని తెలిపారు. అలాగేహుస్నాబాద్‌లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసుకుంటామని ఈ ప్రాంత నిరుద్యోగ యువతీయువకులను మంచి భవిశ్యత్తును అందిస్తామని అన్నా రు. పట్టణంలో కొత్త చెరువు, పల్లె చె రువు, ఎల్లమ్మ చెరువును, ఇండోర్ స్టేడియంను పూర్తిగా ఆధునీకరించుకుని అలాగే మహాసముద్రం గండి చెరువును ఆధునీకరించి పర్యాటకు ల సందర్శన క్షేత్రంగా తీర్చిదిద్ది టూరిస్ట్ కేంద్రంగా మారుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు త్వ వైద్యాధికారి రమేశ్‌రెడ్డి , ఆర్‌డి ఒ రాంమూర్తి, ఎంఆర్‌ఒ లక్ష్మ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం చైర్ మన్ బొల్లిశెట్టి శివయ్య, మార్కెట్ క మిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందుపాల్గొన్నారు.

# 'చందన' మోహనరావు కన్నుమూత

## పలువురు ప్రముఖ వ్యాపార, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు సంతాపం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తన వస్త్రవ్యాపార ప్రపంచంలో వేలాది నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారందరి జీవితాలలో వెలుగులు నింపి, తరతరాలుగా తరగని చెరగని కీర్తిని సముపార్జించిన దక్షిణ భారత వస్త్ర వ్యాపార దిగ్గజం చందన మోహనరావు దీపావళి పర్వదినమైన సోమవారం పరమపదించారు.1943లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో చందన నాగేశ్వర్‌రావు, వీరమ్మ దంపతులకు జన్మించిన చందన మోహనరావుకు సుబ్బలక్ష్మి తో వివాహం జరిగింది. వారికి సంతానంగా ముగ్గురు కుమార్తెలు కలిగారు. చిరుద్యోగిగా తన కెరీర్‌ను ప్రారంభించి మొట్టమొదటిసారిగా 1972లో హోల్‌సేల్ వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. చందన మోహనరావుకు 5గురు అన్నదమ్ములు, నలుగురు అక్కాచెల్లెళ్ల బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని వారి జీవితాలకు దిక్సూచి అయ్యారు. విశాఖపట్నంలో మొట్టమొదటిసారిగా 1984లో జగదాంబ సెంటర్‌లో చందన బ్రదర్స్ పేరుతో నూతన వస్త్ర వ్యాపారాన్ని ఆరంభించి కనీవినీ ఎరుగని రీతిలో ఎక్స్ఛేంజ్ ఆఫర్ విధానానికి సృష్టికర్తగా నిలిచారు. 1988లో హైదరాబాద్‌లో, 1989లోవిజయవాడలో చందనాబ్రదర్స్ శాఖలను ప్రారంభించిన ఆయన వస్త్రవ్యాపారాన్ని శిఖరాగ్రాన నిలిపారు. 1998లో తొలిసారిగా హాల్‌మార్క్ బంగారు ఆభరణాలను ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో పరిచయం చేశారు. చందన బ్రదర్స్ అంటే పరిచయం అక్కరలేని పేరుగా రూపుదిద్దారు. ఆయన అల్లుడు మావూరి వెంకటరమణ ప్రోద్బలంతో మొట్టమొదటిసారిగా తెలుగు రాష్ట్రాలకు షాపింగ్ మాల్ అనే విధానాన్ని పరిచయం చేసిన ఘనతను సొంతం చేసుకున్నారు.విశాఖపట్టణంలో 2002లో సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించి విశాఖ నగరానికే ఒక తలమాణికంగా తీర్చిదిద్దారు.దినదిన ప్రవర్థమానమై సిఎంఆర్ గ్రూప్ 4 రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా, కర్ణాటక)లో శాఖోపశాఖలు విస్తరించి ప్రజాభిమానాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న ప్రముఖ వ్యాపార, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఆయన అల్లుడు మావూరి వెంకటరమణను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఆసిఫ్ వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది



డిజిపి శివధర్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కానిస్టేబుల్ ప్రమోద్‌ను చంపిన రియాజ్ నిందితుడిని పట్టుకునే ప్రక్రియలో గాయపడ్డ సయ్యద్ ఆసిఫ్‌ను అబిడ్స్‌లోని గ్రీన్ ఫీల్డ్ మల్లారెడ్డి ఆసుపత్రిలో మంగళవారం రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి, శాంతిభద్రతలు అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ..''ఆసిఫ్ ఆరోగ్య పరిస్థితి పరవాలేదు. ఒక ఎముక తప్ప మిగతా ఏమి లేని పరిస్థితులలో హాస్పిటల్‌కి వచ్చాడు. డాక్టర్లు ఆపరేషన్ చేసి మళ్ళీ చెయ్యిని ఒరిజినల్ షేప్‌కు తీసుకొని వచ్చారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అసిఫ్ ట్రీట్మెంట్‌కు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుంది. అసిఫ్ చాలా గొప్ప సాహసం చేశాడు. క్రిమినల్ చేతిలో కత్తి ఉన్న ధైర్యంగా అతనిని పట్టుకున్నాడు.'' అని అన్నారు. అసిఫ్ వెల్డింగ్ పని చేసుకొని జీవించేవాడని, అసిఫ్ ధైర్యాన్ని పోలీసు శాఖ ప్రశంసించిందని, పోలీస్ డిపార్ట్మెంట్ తరపు నుంచి మేము చేయవలసిన సాయం చేస్తున్నాం అని పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అవుతాడు. కోలుకోవడానికి మాత్రం రెండు, మూడు నెలలు సమయం పట్టే అవకాశం ఉందిని తెలిపారు.

### రియాజ్ ఎన్‌కౌంటర్ కేసు.. సుమోటోగా స్వీకరించినహెచ్‌ఆర్‌సి డిజిపికి నోటీసులు జారీ

కానిస్టేబుల్ ప్రమోద్‌కుమార్ హత్య కేసులో నిందితుడైన రియాజ్ నిజామాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ మేరకు డిజిపి నోటీసులు జారీ చేసింది.ఎన్‌కౌంటర్‌పై ఆయా దిన పత్రికలలో వచ్చిన కథనాలను ఆధారంగా తీసుకుని ఈ కేసు నమోదు చేసినట్లుగా హెచ్‌ఆర్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. పోలీస్ కానిస్టేబుల్ ఎం. ప్రమోద్ కుమార్ హత్య కేసులో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన రియాజ్ నిందితుడు.. ఇటీవల రియాజ్‌ను అరెస్టు చేసిన పోలీసులు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. రియాజ్, సాయుధ రిజర్వ్ కానిస్టేబుల్ సర్వీస్ ఆయుధాన్ని లాక్కునేందుకు ప్రయత్నించాడని, పారిపోవడానికి ప్రయత్నించాడని, ఆ తర్వాత పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపారని, ఫలితంగా అతను మరణించాడని పోలీసులు ఆరోపించారు.ఈ సంఘటనకు దారితీసిన పరిస్థితులు, ఏదైనా మెజిస్టీరియల్ లేదా జ్యుడీషియల్ విచారణ స్థితి, ఎన్‌కౌంటర్ మరణాలపై సుప్రీంకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్, మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నదా, ఎఫ్ఐఆర్, పోస్ట్‌మార్టం నివేదిక కాపీలతో సహా నవంబర్ 24లోపు సమర్పించాలని కమిషన్ తెలంగాణా డిజిపి బి.శివధర్‌రెడ్డిని ఆదేశించింది.

# పారదర్శకత పెంపు లక్ష్యంగా.. ఎన్నికల సంఘం కీలక చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ఐదు నెలల వ్యవధిలో భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చేయాలనే లక్ష్యంతో 30కిపైగా సరికొత్త కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ చర్యలు ఓటర్లకు మరింత సౌకర్యం కల్పించడం, ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం, ప్రజల్లో ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా చేపట్టారు. ఈ కార్యక్రమాలు ఓటర్ విద్య, సాంకేతికత వినియోగం, దివ్యాంగుల సౌకర్యం, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి అనేక అంశాలను కలిగి ఉన్నాయి.

**ప్రధాన చర్యలు..**

* మొబైల్ డిపాజిట్ సౌకర్యం ఓటు వేసేందుకు వచ్చే ఓటర్ల మొబైల్‌ల డిపాజిట్ సౌకర్యంకు చర్యలు
* స్పష్టమైన ఓటర్ సమాచారం స్లిప్పులు ఓటర్లకు తేలికగా అర్థమయ్యే విధంగా సమాచారం చేరేలా
* రియల్‌టైమ్ ఓటర్ టర్నౌట్ అప్‌డేట్స్ పారదర్శకతతో కూడిన సమాచారం అందించడానికి.
* పోలింగ్ స్టేషన్ పరిమితి ప్రతి కేంద్రంలో గరిష్టంగా 1,200 ఓటర్లు మాత్రమే, రద్దీ తగ్గించడానికి.
* వన్ స్టాప్ డిజిటల్ ప్లాట్‌ఫారం అన్ని ఎన్నికల సేవలు, ఫిర్యాదుల పరిష్కారం ఒకే వేదికలో.
* ఇవిఎం బ్యాలెట్ పేపర్ మార్గదర్శకాలు సవరణ ఏకరూపత, స్పష్టత కోసం.
* పోలింగ్ స్టేషన్‌లలో వెబ్‌స్ట్రీమింగ్ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు.
* ఉపఎన్నికల ముందు ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ తాజా ఓటర్ వివరాలు అందుబాటులో ఉండేందుకు. ఈ అన్ని కార్యక్రమాలు భారత ఎన్నికల సంఘం స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక, సమగ్ర ఎన్నికల నిర్వహణకు అంకితభావంతో ఉన్నదనే విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాయి.

# ఈసారి 30 లక్షల మంది అధికంగా ప్రయాణం




మీడియా సమావేశంలో రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దసరా, దీపావళి, ఛట్ పండుగల సందర్భంగా గత ఏడాదికంటే ఈ సారి 30 లక్షల మంది రైల్వే ప్రయాణికులు అధికంగా ప్రయాణించారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. సికింద్రాబాద్ రైల్‌నిలయంలో తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల రద్దీ పెరగడంతో రైల్వే శాఖ ప్రయాణికుల సౌకర్యార్థం సేవలను పెంచుతూ సుమారుగా 12 వేల ప్రత్యేకమైన రైళ్లను నడిపిందని తెలిపారు. ముఖ్యంగా దక్షిణ మధ్య రైల్వే, ఈ పండుగ సీజన్లోలో విస్తృతమైన ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక రైళ్లను నడపడంతో పాటుగా, రద్దీని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపాయి. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలు చేర్చడానికి రైల్వే శాఖ అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. సుమారుగా 973 ప్రత్యేకమైన రైళ్లను నడపడంతో పాటుగా, మరిన్ని పాసింగ్ త్రు స్పెషల్ సర్వీస్లను అందించామన్నారు. అలాగే పలు మార్గాలలో నడిచే, సాధారణ రైళ్లకు అదనపు కోచ్లను కూడా ఏర్పాటు చేసింది. ఈ స్పెషల్ సర్వీస్‌లన్ని నవంబర్ నెలాఖరు వరకు కొనసాగుతాయని స్పష్టం చేసింది. సికింద్రాబాద్ స్టేషన్ నుండి ప్రతి రోజు సుమారుగా 1.50లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. మన నగరం నుండి బయలుదేరే ప్రత్యేక రైళ్లు ప్రధానంగా హైదరాబాద్, సికింద్రాబాద్, లింగంపల్లి, కాచిగూడ, చర్లపల్లి ప్రధాన స్టేషన్ల నుండి బయలుదేరుతాయని, అదేవిదంగా జోన్ పరిధిలోని అన్ని ఆరు డివిజన్‌లలో ప్రధాన స్టేషన్‌లలో ప్రత్యేక హోల్డింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు సర్వలెన్స్ సిద్ధంగా ఉండి, కమాండ్ కంట్రోల్ ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పండుగ రోజులలో సాధారణ, మధ్య తరగతి ప్రయాణికులకు అవసరమైన రైళ్లను, దక్షిణ మధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా,రైళ్ళో బాణాసంచా, కిరోసిన్, పెట్రోల్, గ్యాస్ సిలిండర్ వంటి మండే పదార్థాలను రైళ్లలో తీసుకెళ్లడం నిషేధమని స్పష్టం చేశారు. పండుగ సీజన్లో రైల్వే శాఖ ప్రయాణికుల సౌకర్యం కొరకు ప్రత్యేక 12 వేల రైళ్లను దక్షిణాది నుండి ఉత్తరా భారతానికి ప్రయాణికుల కొరకు ఏర్పాటు చేశామని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పిఆర్ఓ ఎ.శ్రీధర్ వివరించారు.












































# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూనగర్:** తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు రూపకల్పనకై ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఈ సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25వ తేదీతో ముగుస్తుంది. www.telangana.gov.in/telangana rising అనే వెబ్సైట్‌ను సందర్శించి ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు సూచనలను అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఈ ప్రకటనలో తెలిపారు.



## రైతులకు కపాస్ కిసాన్‌పై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండలం ధన్వాడ, గున్ముక్ల, కొండాపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా రైతులకు కపాస్ కిసాన్ యాప్ గురించి అవగాహన సదస్సు కార్యక్రమం కల్పించడం జరిగింది. అదేవిధంగా ఫోన్ నెంబర్ అప్డేషన్ గురించి చెప్పడం జరిగింది. పత్తి పంట వేసిన ప్రతి రైతుల కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. పత్తి రైతులు వారి ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నెంబర్‌ను సంబంధిత ఏఈఓని సంప్రదించి సరిచూసుకోవాలి, రైతు యొక్క మొబైల్ నెంబర్ తప్పుగా ఉంటే యాప్‌లో ఓటిపి రాదు, కావున రైతులు మీ మొబైల్ నెంబర్ తప్పుగా ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద మొబైల్ నెంబర్‌ను అప్డేట్ చేయించుకోవాలి. పత్తి రైతులు సిసిఐ ద్వారా పత్తిని మిల్లుల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు సైమన్, రాజు,భరద్వాజ్,రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా దీపావళి అమావాస్య వేడుకలు



**ప్రజాపక్షం/మక్తల్ :** దీపావళి అమావాస్య పర్వదినం సందర్భంగా మక్తల్ పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో వెలిసిన శ్రీ ఉమామహేశ్వరాలయంలో అమావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకులు సిద్ధరామయ్య స్వామి, మహేష్ స్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4 గంటల నుండి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామి వారికి అభిషేకాలు చేయించి మొక్కలు చెల్లించుకున్నారు. అభిషేకం విశేష పూజలు అనంతరం స్వామివారికి విశేష అలంకరణ గావించారు. అలంకరణ అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలను నిర్వహించారు. తదుపరి మహా మంగళహారతి అనంతరం గడ్డం ప్రసన్య వెంకటేశ్వర్ రెడ్డి దంపతులు అన్నదాన కర్తలుగా వ్యవహరించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయన కమిటీ సభ్యులు సివి. ఆంజనేయులు, బి. ఆంజనేయులు సూర్య, చిన్న కృష్ణయ్య, పోలేపల్లి అనంత కుమార్, బి. శ్రీనివాసులు, వాకిటి అంజయ్య, నారాయణ రెడ్డి , జానమెల్ల పాపిరెడ్డి, సివి. ప్రవీణ్, నవీన్,చ పి. నాగరాజు, సివి. నాని, వంశీ , రవి, గుడిగండ్ల నర్సింహారెడ్డి, పెద్ద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను రక్షించండి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండలంలోని పుల్గర్ చర్ల గ్రామ పరిధిలో వివిధ సర్వే నెంబర్‌లో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను రక్షించాలని ప్రజలందరికి సమాన హక్కులు కల్పించాలని కోరుతూ మంగళవారం వీపనగండ్ల తహశీల్దార్ కు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఒక వర్గానికి చెందిన కొందరు ప్రభుత్వ భూములను తమ వారసత్వ హక్కుగా భావిస్తున్నారని, అల్ప సంఖ్యాక వర్గాల వారు ఎక్కడో ఒకచోట కొద్దిగా ప్రభుత్వ భూమిని అనుభవిస్తుంటే రాజకీయ పలుకుబడితో ప్రభుత్వ అధికారులను తమ ఆధీనంలోకి తెచ్చుకుని అల్పసంఖ్యాక వర్గాల వారిని భయ భ్రాంతులకు గురి చేస్తూ భయపెట్టడం జరుగుతుందని అందులో పేర్కొన్నారు. ఈ విషయంలో తగు చర్యలు తీసుకొని వారి నుండి అల్ప సంఖ్యాక వర్గాల వారిని రక్షించాలని అలాగే ఒక వర్గం వారు అనుభవిస్తున్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ప్రజలందరికీ సమాన హక్కుగా కల్పించాలని తహశీల్దార్ కు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో బిజ్జ జగదీష్, తరుపతయ్య, బూర్గు నాగరాజు, కేశవులు ,బండారి సహదేవ్, వడ్డేమోని నరేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

## వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై మినుములు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాతలకు యాసంగి 2025 సీజన్‌కు మినుములు విబిఎన్ 8 రకం సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ మున్నా తెలిపారు. ఒక ప్యాకెట్ నాలుగు కేజీలు ఉంటుంది. మొత్తం ధర రూపాయలు 580/ ప్రభుత్వ సబ్సిడీ రూపాయలు 200/ రైతు చెల్లించాల్సిన రూపాయలు 380/ కావలసిన రైతులు తమ ఆధార్ కార్డు పొలం పాస్ బుక్ జిరాక్స్ ఏఈఓ కు ఇచ్చి క్యూ తీసుకోగలరు. సూగూరు రైతు వేదిక నందు మినుముల అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన వడ్డె లింగమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బారాస మండల నాయకుడు ముంత మల్లయ్య యాదవ్ మంగళవారం ఆమె కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి కొంత ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సంతాప కార్యక్రమంలో బారాస యువ నాయకుడు, ముంత శివ తదితరులు పాల్గొన్నారు.

# విధినిర్వహణలో పోలీసుల త్యాగం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** పోలీసు పరేడ్ గ్రౌండ్లో నీ అమరవీరుల స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీద్, అదనపు ఎస్పి యం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య పోలీస్ అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సంఘవిద్రోహశక్తులచే పోరాడి చనిపోయిన పోలీస్ పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. అమరులైన పోలీసులకు, వారి కుటుంబాలకు ఎలాంటి అవసరాలు ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అమరులైన పోలీసులకు ప్రత్యేకంగా మంగళవారం నివాళులర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులైన పోలీసులకు మంగళవారం శ్రద్ధాంజలి ఘటించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 21,అంటే పోలీసు అమరవీరుల దినం. 1959 చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థంగా తిప్పిగొట్టిన రోజు ఇది. ఈ సమరంలో ఎంతోమంది సైనికులు అమరులయ్యారు. ఆ రోజును పురస్కరించుకుంటూ, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుందాం. ఈ సమాజం కోరుకునేది శాంతి, స్థిరత్వం, అభివృద్ధి పోలీసుల త్యాగాల ద్వారా ఎన్నో దశాబ్దాలుగా భౌతిక రక్షణ నుండి, సామాజిక రుగ్మతలను పారద్రోలడం వరకు పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడే కార్యదీక్షతో, సేవాభావంతో పని చేస్తుంది. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమరవీరులైన పోలీసుల త్యాగాలు వెల కట్టలేనివి చెప్పారు. ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా తీవ్రవాదులు, సంఘ నిద్రోహక శక్తుల్లో 191 మంది పోలీసులు అమరులయ్యారు. నారాయణపేట జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో కానిస్టేబుల్ రాజారెడ్డి 2005 సంవత్సరంలో వీర మరణం పొందారు. వారి కుటుంబ సభ్యులకు పోలీసు అండగా ఉంటారని తెలిపారు. పోలీస్‌ల త్యాగనిరతిని నిరంతరం మనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం జిల్లా పోలీసులు జిల్లా పోలీస్ కార్యాలయం నుండి సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ చౌరస్తా నుండి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు జోహార్ పోలీస్ అమరవీరులకు జోహార్ హోజర్ అంటూ వారికి నివాళులర్పిస్తూ జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ యం.డి. రియాజ్, డిఎస్పీ ఎన్‌లింగయ్య, పరేడ్ కమాండర్ ఆర్ఐ.నరసింహ, సిఐలు శివశంకర్, రామ్ లాల్, రాజేందర్‌రెడ్డి, సైదులు, ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, ఎస్‌యం నవీద్, బాలరాజు, భాగ్యలక్ష్మి రెడ్డి, రమేష్, సునిత, అశోక్ బాబు, ఆర్ఎస్ఐలు శివశంకర్, శిరీష, మద్దయ్య శ్వేత, ఆర్మ్డు రిజర్వు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వారి త్యాగం ఎప్పటికీ మరిచిపోలేనిది

జిల్లా పోలీస్ కార్యాలయ కవాతు మైదానంలో స్మృతి పరేడ్, ర్యాలీ, నివాళులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** పోలీసు అమరవీరుల స్మారక దినాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ ప్రధాన కార్యాలయం సమీపంలోని కవాతు మైదానంలో ఘనంగా స్మృతి పరేడ్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోగులాంబ జోన్ 7 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిఐజి) ఎల్.ఎస్.చౌహాన్, ఐపిఎస్ హాజరయ్యారు. జిల్లా ఎస్పి డి.జానకి నేతృత్వంలో ఈ వేడుకలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. దేశంలో గత సంవత్సరం కాలంలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన 191 మంది పోలీసు అమరవీరుల పేర్లను జిల్లా ఎస్పీ డి.జానకి, గౌరవంగా చదివి వినిపించారు. అనంతరం స్మృతి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మనం దేశానికి సేవ చేస్తూ ప్రాణత్యాగం చేసిన నిజమైన వీరులను స్మరించుకుంటున్నాం. వారి త్యాగం ఎప్పటికీ మరిచిపోలేనిది. వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఐజి ఎల్.ఎస్.చౌహాన్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో సేవ చేస్తూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరులు దేశానికి అందించిన అత్యున్నత సేవలకు చిహ్నం, వారి త్యాగం వల్లనే సమాజం శాంతియుతంగా సాగుతోంది. ఈ రోజే కాదు, ప్రతిదినం వారి సేవలను గుర్తు చేసుకుంటూ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. డిఐజి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్ నుండి ఓల్డ్ బస్టాండు క్లాక్ టవర్ చౌరస్తా, రామ్ మందిర్ చౌరస్తా, గ్రంథాలయం మీదుగా పరదేశి నాయుడు సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. పరదేశి నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించారు. అనంతరం అమరవీరులు అమర రహే, జై జవాన్, జై పోలీస్ వంటి నినాదాలతో ర్యాలీ ముగిసింది. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం, ఎఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, జైల్ సూపరింటెండెంట్ వెంకటేశం, మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనిత, ఎఓ రుక్మిణిభాయి, జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఇన్స్పెక్టర్లు , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు సీనియర్ సిటిజన్ ఫోరమ్ సభ్యులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం ద్వారా అమరుల త్యాగాన్ని స్మరించుకుంటూ, భవిష్యత్ తరాలకు దేశ సేవ విలువను వివరించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరినీ భావోద్వేగపరిచింది.



## కుక్కల బారి నుంచి కాపాడాలని వినతి

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మున్సిపాలిటీ ప్రజలు కుక్కల బెడద నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మున్సిపల్ పరంగా చర్యలు తీసుకొని కుక్కల బెడదను తొలగించాలని 15వ వార్డు మాజీ కౌన్సిలర్ ఖాజా మైనోద్దిన్, బిఆర్ఎస్ పార్టీ యూత్ లీడర్ ఎండి సాదిక్, ఎండి చాంద్‌లు మున్సిపల్ కమిషనర్ అందుబాటు లేకపోవడంతో మున్సిపల్ మేనేజర్ రవీందర్ కి వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీ కేంద్రంలో ని అన్ని వార్డులలో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ఒంటరిగా వస్తున్న పౌరుల పై చిన్నారులపై మహిళలపై దాడులు చేస్తున్నాయని వెంటనే కుక్కల భారి నుండి ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించాలని కోరారు. ఆదివారం మదనాపురం నుండి బైక్ పై కొత్తకోటకు వస్తున్న యువకుడు ఎండి యహియ బాబాకు కొత్తకోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట కుక్కలు అడ్డు రావడంతో అతని నిండు ప్రాణం బలైందని గుర్తు చేశారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు కోల్పోవడంతో భార్యతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా వెంటనే కుక్కలను నివారించి పట్టణ ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. కుక్కల వలన జరగరాని సంఘటన జరిగితే మున్సిపాలిటీ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# బిసి జాగృతి సేన రాష్ట్ర కార్యదర్శిగా పల్లె రఘు

బిసి జాగృతి సేన ఆధ్వర్యంలో ఘన సన్మానం



**ప్రజాపక్షం/జడ్చర్ల:** బీసీ జాగృతి సేన రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన పోలేపల్లి రఘు నందన్ చారికి శాలువా కప్పి సన్మానం చేసిన బీసీస జాగృతి సేన మండల కమిటీ సభ్యులు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ల సాధనకై బీసీ దళపతి ఆర్ కృష్ణయ్య పిలుపు మేరకు ఈనెల 18 తారీఖున రాష్ట్ర బంద్ విజయవంతం వెనక, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, బిఆర్ఎస్ బీజేపీ, సిపిఐ ఎం పార్టీల నాయకులతో పాటు ఎలక్ట్రానిక్, మీడియా ప్రింట్ మీడియా పాత్రికేయుల సమిష్టి కృషి ఉందని అన్నారు. వారం రోజుల్లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ ఏర్పాటుపై సమావేశం ఉంటుందని కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలుకై నిరంతర పోరాటం చేస్తామని తెలిపారు. బీసీ జాగృతి సేన రాష్ట్ర కార్యదర్శి చింతో జ్ రఘునందన్ చారి మాట్లాడుతూ బీసీ దళపతి ఆర్ కృష్ణయ్య బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు, నాకు అప్పగించిన బాధ్యతకు న్యాయం చేయడానికి నా వంతుగా కృషి చేస్తానని, జడ్చర్ల నియోజరవర్గంలో డిసెంబర్ నెలలో బీసీ గర్జన కార్యక్రమం నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నడిమింటి శ్రీనివాస్, తెలుగు సత్యయ్య, బీసీ జాగృతి సేన జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, బీసీ జాగృతి సేన నియోజకవర్గం అధ్యక్షులు బొల్లెమోని నిరంజన్, మండల అధ్యక్షులు గొడుగు నర్సిములు, కార్మిక విభాగ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి లింగం పేట్ శేఖర్, రైతు సంఘము జిల్లా అధ్యక్షులు గోపాల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, జిల్లా నాయకులు మాచారం శ్రీనివాస్, శివ శంకర్, మండల కార్యదర్శులు సురభి రఘు, చెన్నయ్య, శేఖర్ ముదిరాజ్, కరేట్ మాస్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీలలో ప్రతిభ చూపిన కొత్తకోట విద్యార్థులు

విద్యార్థులకు మెడల్స్ అందించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/కొత్తకోట :** జడ్చర్ల పట్టణంలోని చంద్ర గార్డెన్‌లో 19న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీలకు అన్ని రాష్ట్రాల నుంచి విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. దాదాపు 35 మంది విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచి బంగారు వెండి పథకాలతో పాటు ఓవరాల్ గ్రాండ్ ఛాంపియన్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులను ఈ కార్యక్రమానికి వచ్చిన ముఖ్య అతిథులు మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి విద్యార్థులకు పథకాలు అందించి అభినందించడం జరిగింది అని క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. విద్యార్థులు ఈ విద్యార్థులు క్లబ్ సీనియర్ కరాటే మాస్టర్ జఫర్ సాదిక్ హరీష్ యాదవ్ ఇంతియాజ్ విద్యార్థులను అభినందించారు.

# క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం సద్వినియోగం

కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా ఈ నెల 24న కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నారాయణపేట జిల్లాలోని కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సందర్శించి ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహణపై కడ ప్రత్యేక అధికారి వెంకట రెడ్డి, వైద్య శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈనెల 24న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి నిపుణులైన వైద్యులు వస్తారని, శిబిరంలో క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి ఆరోగ్య విద్య కౌన్సెలింగ్, మహిళలకు పీఏపీ స్మెర్, క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్, మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ మెడ, అల్ట్రాసౌండ్ ఉదరం పెల్విస్, సోనో మామోగ్రఫీ, డిజిటల్ ఎక్స్ రే ఛాతీ, నోటి పరీక్షలన్నీ నిపుణులైన వైద్యుల క్లినికల్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం నిర్వహించబడతాయని కలెక్టర్ తెలిపారు. శిబిరానికి ఇద్దరు మహిళా వైద్యులు ఇద్దరు పురుష వైద్యులు(రేడడియాలజిస్ట్‌తో సహా)నర్సులు, టెక్నీషియన్లు, హౌస్ కీపింగ్ సిబ్బందితో సహా 13 మంది సహాయక సిబ్బందితో వస్తారన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, క్యాన్సర్ స్క్రీనింగ్ అనేది మన ఆరోగ్యాన్న కాపాడుకునే ముందస్తు జాగ్రత్త అని ఆమె తెలిపారు. ఎలాంటి లక్షణాలు కనిపించకపోయినా క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి ఈ స్క్రీనింగ్ దోహదపడుతుందని, ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రాష్ట్ర హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖతో సమన్వయంతో ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ క్రష్ గదిని కలెక్టర్ పరిశీలించారు. వర్కింగ్ ఉమెన్స్ పిల్లల కోసం మోడల్ క్రష్ గదిని ఎంతో సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం కలెక్టర్ కోస్గి తహాసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని రైతులు మూగజీవాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్యాంసుందర్ పేర్కొన్నారు. సోమవారం మండలపరిధిలోని పెద్దాపూర్, లాలుతండాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి రోగ నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నరేష్‌రెడ్డి, నర్సింహ్మా, ఫణిందర్‌రెడ్డి, శ్రీను, తిరుపతయ్య, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్, రైతులు వీరారెడ్డి, విజయేందర్‌రెడ్డి, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

# ఉదండాపూర్ భూసేకరణ అక్రమాలు బయటపెడతాం

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి స్పష్టీకరణ

**ప్రజాపక్షం/జడ్చర్ల:** ఉదండాపూర్ ప్రాజెక్టులో భాగంగా గతంలో చేసిన భూసేకరణకు సంబంధించిన పరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలన్నీ బయటపెట్టి, బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకునేలా చూస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. ఈ అక్రమాలకు సంబంధించి కొంతమందికి ప్రస్తుతం నోటీసులు వచ్చాయని, వారితో పాటుగా భూములు లేకపోయినా గైరాన్, భూదాన్ భూములపై కూడా పరిహారాలు దిగమింగిన వారందరినీ బయటికి లాగుతామని హెచ్చరించారు. ఈ అక్రమాలకు సంబంధించిన బాధితులు, ప్రజలు కూడా తమ వద్ద ఉన్న సమాచారం కూడా తనకు అందించాలని కోరారు. ఉదండాపూర్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పరిహారాల చెల్లింపులో భారీ అవినీతి జరిగిందని, అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని తాను గతంలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసానని మంగళవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో అనిరుధ్‌రెడ్డి గుర్తు చేశారు. అయితే ఉదండాపూర్ భూసేకరణ పరిహారాల చెల్లింపులో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అలా జరిగి ఉంటే అందుకు ఆధారాలు చూపాలంటూ అప్పట్లోనే బిఆర్ఎస్ నాయకులు చెప్పారని తెలిపారు. అయితే ఇదే విషయంగా పోలేపల్లి సర్వే నెంబర్ 554 సర్వే నెంబర్‌లో భూములు లేకపోయినా ఎకరానికి రూ.12 లక్షలు చొప్పున అక్రమంగా పరిహారాలు పొందారనే విషయంగా రెవెన్యూ అధికారులు విచారణ చేసి ఈ ఒక్క సర్వే నెంబర్ మీదనే 23 మంది వ్యక్తులు అక్రమంగా రూ.3.84 కోట్ల రూపాయల పరిహారాన్ని దండుకున్నారని గుర్తించారని వెల్లడించారు. ఈ విషయంగా రెవెన్యూ అధికారిణి పద్మ జ నిగ్గు తేల్చిన నిజం ఆధారంగా ప్రస్తుతం 23 మందికి నోటీసులు జారీ చేస్తున్నారని, వారు దిగమింగిన కోట్లాది రూపాయల మొత్తాన్ని రెవెన్యూ రికవరి యాక్టు కింద వసూలు చేయడానికి చర్యలు చేపట్టారని వివరించారు. అయితే ఉదండాపూర్‌లో జరిగిన అనేక అక్రమాలలో ఇది ఒకటి మాత్రమేనని, ఇంకా బయటకు రావాల్సిన అక్రమాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. ఒకరి పేరిట ఉన్న పట్టా భూముల పరిహారాన్ని మరొకరి ఖాతాలోకి బదిలీ చేయడం, అసలు పట్టాదారులకు, మొండి చేయి చూపడం మాత్రమే కాకుండా గైరాన్, భూదాన్‌లకు సంబంధించిన భూముల పేరిట కూడా అక్రమార్కులు కోట్లు దండుకున్నారని విమర్శించారు. జరిగిన ఈ అక్రమాలన్నింటిని బయటకు తీసుకోస్తానని అక్రమార్కులపై చర్యలు తీసుకునేలా చూస్తానని ప్రకటించారు. ఈ అక్రమాలన్ని అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతల అండదండలతో, అప్పుడు పనిచేస్తున్న రెవెన్యూ అధికారులే చేసారనే విషయం తన దృష్టికి వచ్చిందని అనిరుధ్‌రెడ్డి చెప్పారు. అప్పట్లో జడ్చర్ల తాసిల్దార్‌గా పనిచేసిన లక్ష్మీ నారాయణ, ఆర్ఐ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోనే ఈ అక్రమాలు యథేచ్ఛగా జరిగాయనే ఆరోపణలు కూడా తనకు ప్రజల ద్వారా వచ్చాయని తెలిపారు. పోలేపల్లిలో సర్వే నెంబర్ 554లో జరిగిన అక్రమాలపై 23 మంది ప్రైవేట్ వ్యక్తులతో పాటుగా అప్పటి తాహసిల్దార్, ఆర్ఐలకు కూడా షోకాజ్ నోటీసులు వచ్చాయని తనకు తెలిసిందన్నారు. కాగా ఉదండాపూర్ భూసేకరణలో అధికారులు, బిఆర్ఎస్ నేతల అక్రమాల కారణంగా నష్టపోయిన బాధితులు, వీటికి సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు కూడా జరిగిన అక్రమాలకు సంబంధించిన వివరాలను తనకు అందించాలని అనిరుధ్‌రెడ్డి కోరారు. తమకు తెలిసిన సమాచారాన్ని క్లుప్తంగా కాగితాలపై రాసి తనకు నేరుగా అందజేయాని తాను అందుబాటులో లేకపోతే తన క్యాంపు కార్యాలయంలో ఉండే పీఆర్వోకు నేరుగా లేదా వాట్సాప్ నెంబర్ 9392017899 ద్వారా గాని సమాచారం అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ఉదండాపూర్ అక్రమాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని తాను ప్రభుత్వానికి మరోసారి ఫిర్యాదు చేయనున్నట్లు అనిరుధ్‌రెడ్డి వివరించారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ సంస్మరణ దినోత్సం



ప్రజాపక్షం/దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో మంగళవారం పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు ఎన్‌విటి సభ్యులతో కలిసి అమరుల చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయంత్రం మీనాక్షి చౌరస్తా నుండి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు పోలీసు అమరులకు నివాళులర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణకిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమామహేష్, నిరంజన్, అమర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనయ్య, విద్యార్థులు, క్రీడాకారులు,కళాకారులు పాల్గొన్నారు.

## దొడ్డ సురేష్‌కు పశ్యపద్మ నివాళులు



ప్రజాపక్షం/కోదాడ : చిలుకూరు మండల కేంద్రానికి చెందిన దొడ్డ సురేష్ ఇటీవల కాలంలో గుండె పోటుతో మృతి చెందినాడు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ సురేష్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్జి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు దొడ్డా వెంకటయ్య, హుజూర్‌నగర్ ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ పశ్య శ్రీనివాసరెడ్డి, సిపిఐ సీనియర్ నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు ఉన్నారు.



## బిసిలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నారు : వట్టె జానయ్య

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : బిసిలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని టిఆర్‌పి రాష్ట్ర కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలపై ఉందన్నారు. ప్రభుత్వం బిసిలను మోసం చేయాలనే ఉద్దేశ్యంతో జిఓ నెంబర్ 9 విడుదల చేసిందని ఆరోపించారు. బిసిలకు నిజంగా న్యాయం జరగాలంటే బిసిలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బిసిలు అన్ని రంగాలలో వెనుకబడటానికి కారణం గత ప్రభుత్వాల నిర్లక్ష్యమేనన్నారు. టిఆర్‌పి పార్టీ మాత్రం బిసిల హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాటాలు నిర్వహిస్తుందని వివరించారు. ఇటీవల నిర్వహించిన బంద్ పాక్షికంగా జరిగిందన్నారు. బిసి ఓట్లతో గెలిచిన నాయకులు బంద్ కార్యక్రమంలో పాల్గొనకపోవడం దురదృష్టకరమన్నారు. బిసిలకు గౌరవం, హక్కులు సాధించే వరకు నిరంతరం పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు చాంద్‌పాషా, మీర్ అక్బర్, కుంభం నాగరాజు, అన్నెపర్తి రాజేష్, ఆవుల అంజయ్య, శివ పాల్గొన్నారు.



## చిన్నారి స్ఫూర్తి అభినందనీయం

మైహోం ఎస్టేట్ మేనేజర్ చెరుకు అశోక్

ప్రజాపక్షం/కోదాడ : కోదాడ పట్టణ రెవిన్యూ అధికారి జానకిరాంరెడ్డి ప్రథమ పుత్రిక రామిడి సహస్రరెడ్డి తన పుట్టిన రోజున ఉన్నత పాఠశాలలో మొక్కను నాటడం అభినందనీయమని జడ్పీహెచ్ఎస్ వాకర్స్ సభ్యులు, హైహోంఎస్టేట్ మేనేజర్ చెరుకు అశోక్ సోమవారం చిన్నారి పుట్టినరోజు వేడుకలలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబాడీ అసోసియేషన్ కార్యదర్శి నామ నరసింహారావు, అధ్యపకులు మంద శ్రీనివాస్, జాతీయ వాలీబాల్ క్రీడాకారులు పంది కల్యాణ్, మాజీ కబాడీ క్రీడాకారులు ఎస్‌కె బాగ్దాద్, రావు రమేష్, నంబూరి నాగేశ్వరావు, కర్ల కాంతరావు, సుధాకర్‌రెడ్డి, సైదులు, పాముల భాస్కర్, తురక సాయిరాజ్, జంఫ్ శ్యాం, వాకర్స్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 25న మెగా జాబ్‌మేళా

పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవల్లి బాల్‌రెడ్డి

ప్రజాపక్షం/కోదాడ : ఈనెల 25న హుజూర్‌నగర్ పట్టణంలో రాష్ట్ర బారీనీటిపారుదల శాఖా మాత్యులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్వర్యంలో ఎంతో ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న మోగా జాబ్ మేళ్లను విజవంతం చేయాలని కోదాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడవెల్లి బాల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ నాయకులు, వార్డు బాద్యులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.



## ఘనంగా గీతపనివారల సంఘం ఆవిర్భావ దినోత్సవం

ప్రజాపక్షం/చిట్యాల : గీత పనివారల సంఘం 68వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘ నాయకులు సోమవారం ఘణంగా జరుపుకున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల సాధన కోసం దివంగత కామ్రేడ్ ధర్మభిక్షం అనేక సమరశీల పోరాటాలు చేశారని, వాటి కారణంగా ఆనాటి నైజాం పాలనలో నవాబు అరాజు విధానాన్ని రద్దు చేశారని ఆయన గుర్తు చేశారు. గీత పనివారల సంఘాన్ని కూడా ధర్మభిక్షం స్థాపించి నేటికి 68 సంవత్సరాలు ముగిశాయని అన్నారు. తాటి చెట్టుపై నుండి పడి మరణించిన కార్మికునికి రూ.5లక్షల నష్టపరిహారం చెల్లించాలని, 50 సంవత్సరాలు దాటిని గీత కార్మికులకు వృత్తి పెన్షన్లు, ప్రతి సంఘానికి 5 ఎకరాల భూమి ఆయన సాధించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, కూనూరు అంజయ్య, కూనూరు పాపయ్య, కూనూరు మారయ్య, దండిగ నర్సింహ్మలు పాల్గొన్నారు.

# ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి





ప్రజాపక్షం/మిర్యాలగూడ : ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామానికి చెందిన ఇరుగంటి చిన్నమట్టయ్య లింగమ్మ దంపతుల కుమారుడు నాగరాజు ఇటీవల జరిగిన గ్రూప్2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపిఒ ఉద్యోగాన్ని పొందిన సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజును అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికానికి చదువు అడ్డుకాదని నాగరాజు నిరూపించాడన్నారు. పేద కుటుంబం నుంచి ఉద్యోగం పొందిన వారందరు బాధ్యతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పేదల పక్షాన నిలబడి సేవలందించాలని సూచించారు. ఆ కాలనీవాసులతో కలిసి దీపావళి వేడుకలను జరుపుకున్నారు.

### విజయానికి ప్రతీక దీపావళి

మిర్యాలగూడ : మంచిపై చెడు సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ జరుపుకుంటారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం దీపావళి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాధవి దంపతులు స్థానిక క్యాంప్ కార్యాలయంలో దీపాలు వెలిగించి టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అజ్ఞాన అంధకారాలను తొలగించి జ్ఞానాన్ని ప్రకాశింపచేసేదే దీపావళి అన్నారు. జ్ఞానానికి దీపం సంకేతమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## దీపావళి పండుగ వేళ బొమ్మల కొలువు



ప్రజాపక్షం/యాదాద్రి : ఆధ్యాత్మికత చాటే దీపావళి పండుగ సందర్భంగా భువనగిరి పట్టణంలోని 8వ వార్డు జంపుఖాన గూడెం కాలనీలో ప్రాంత మహిళల ఆధ్వర్యంలో బొమ్మలకొలువు నిర్వహించారు. ఈ బొమ్మల కొలువులో సమాజం కోసం కొన్ని అవగాహన కల్పించే విధంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తాజా మాజీ కౌన్సిలర్ పంగారెక్క స్వామి పాల్గొని సమాజానికి అవసరమైన కొన్ని అంశాలను వార్డు మహిళలు బొమ్మల కొలువు ఏర్పాటు చేసి సమాజ శ్రేయస్సుకు పాటుపడటం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం దీపావళి సందర్భంగా పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబితా గోపాల్, కొలుపుల అమరేందర్, మాజీ జిల్లా రైతు సమన్వయ కమిటీ ప్రసిడెంట్ కొలుపుల విజయికుమార్, రజిత, విజయలక్ష్మి, పావని, అంజమ్మ, లక్ష్మి, అనిత, శ్రీలత, పోషాలు, చంద్రిక, ఎల్లమ్మ, రాధా, సరస్వతీ, మొగ్గలక్ష్మి, కలమ్మ, పుష్ప, వార్డు మహిళలు ప్రజలు పాల్గొన్నారు.



## అమరులైన పోలీస్‌ల త్యాగం మరువలేనిది

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : విధి నిర్వహణలో అమరులైన పోలీస్‌ల త్యాగం మరువలేనిదనీ పోచంపల్లి ఎస్‌హెచ్‌ఓ కే.భాస్కర్ రెడ్డి అన్నారు. మంగళ వారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు పోలీసు వీధి నిర్వహణలో ఉండి అమరులైనా వారి కుటుంభ సభ్యులను ఆహ్వానించి, అంబేర్పెట్ హెడ్ క్వార్టర్ నందు వారితో మాట్లాడి అమరులైన వారిని గుర్తు చేసుకొని, కుటుంభ సభ్యులకు పురస్కారాన్ని అందించారు. అందులో బాగంగా గతంలో పోచంపల్లి పోలీసు స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తు 2005 సంవత్సరంలో అశువులు బాసిన ఎండి అహ్మద్ మొయినుద్దీన్ కుటుంభ సభ్యులను ఆహ్వానించి మాట్లాడి పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కారాన్ని అందజేశారు. అంబేర్ పేట హెడ్ క్వార్టర్ నందు బ్లడ్ డొనేషన్ నిర్వహించారు, పోచంపల్లి పోలీసు స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వినోద్ కుమార్ కూడా బ్లడ్ డొనేషన్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోలీసుల కృషి

ఎసిపి శ్రీనివాస్ నాయుడు, రూరల్ సిఐ శంకర్ గౌడ్



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోలీసులు కృషి చేస్తున్నారని సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు నిరంతరం జీవితాన్ని అంకితం చేసి పనిచేస్తున్నారని యాదగిరిగుట్ట ఎసిపి శ్రీనివాస్ నాయుడు, రూరల్ సిఐ శంకర్ గౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం యాదగిరి గుట్టలో యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎసిపి శ్రీనివాస్ నాయుడు, రూరల్ సీఐ శంకర్ గౌడ్‌లు మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల విషయంలో పోలీసులది కీలకపాత్ర అని అన్నారు. పోలీసులకు అన్ని వర్గాల వారు, ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ అనేకమంది పోలీసులు విధి నిర్వహణలో అమరులు అయ్యారని, వారి త్యాగాలు మరువలేనివని అన్నారు. యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ గౌరవ అధ్యక్షులు కళ్లెం సంపత్, అధ్యక్షులు బూడిద శ్రీహరి మాట్లాడుతూ పోలీసుల త్యాగాలు మరువలేనివని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను ఫణంగా పెట్టి పోలీసులు పనిచేస్తున్నారని, వారి సేవలను కొనియాడారు. అనేక మంది పోలీసులు తమ జీవితాలను ప్రజల కోసం త్యాగం చేశారని అన్నారు. పోలీసులకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని, అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లి విరిసేలా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి అని అన్నారు. ప్రతి సంవత్సరం వారిని స్మరించుకోవడంతోపాటు, వారి ఆశయ సాధనకు అంకితమై ప్రతి ఒక్కరం పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల స్థూపం చిత్రపటానికి యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ జర్నలిస్టులు, పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై యాదయ్య ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందితో పాటు యాదగిరిగుట్ట ప్రింట్ మీడియా యూనియన్ గౌరవ అధ్యక్షులు కళ్లెం సంపత్, యూనియన్ అధ్యక్షులు బూడిద శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిహెచ్ శేఖర్, ఆకుల గిరిబాబు, ఉపాధ్యక్షులు పుట్ట హనుమంత్, సోలాపూర్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఇండ్ల మచ్చేందర్, సెక్రటరీ జనరల్ ఏలూరీ విక్రమ్, కోశాధికారులు ఆరుట్ల కిషోర్ కుమార్, డంగు నరేందర్, ప్రచార కార్యదర్శి మొగిలిపాక కనకరాజు, సంయుక్త కార్యదర్శులు కొల్ల సందీప్ రెడ్డి, బి.అమర్నాథ్, కార్యవర్గ సభ్యులు క్రాంతి, సుక్కల సంజీవ, శిఖ సాయి కిషోర్, కర్రే గణేష్, మీస వెంకటేష్, ఓరుగంటి శివకుమార్, బూడిద బలరాం తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల నిత్య పోరాటం

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ : శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి వారి సేవలను కొనియాడారు. మంగళవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల కుటుంబాలకు పరామర్శించి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ శాఖ దేశంలోనే శాంతి భద్రతల పరిరక్షణకు,ప్రజా రక్షణకు విది నిర్వహణలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. ప్రాణ త్యాగాలతో పాటు ఎటువంటి సెలవు లేకుండా ప్రజల రక్షణే ధ్యేయంగా పని చేయడం చాలా గొప్ప విషయం అని అన్నారు.ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా ఎందరో అమరులయ్యారని వారి త్యాగాలు మరవలేనివి అన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన అనుమతులు ఇవ్వడం జరిగిందనీ,ఇప్పటి వరకు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ నాలుగు ఖాళీలను గుర్తించడం జరిగిందని తెలిపారు.ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా విది నిర్వహణలో సంఘ విద్రోహ శక్తులతో పోరాడి 191 మంది పోలీసులు అమరులైనారనీ, వారిలో మన తెలంగాణ రాష్ట్రంలో ఐదుగురు ఉన్నారని తెలిపారు. ఎందరో పోలీస్ సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలను లెక్కచేయకుండా విధి నిర్వాహణలో వారి ప్రాణాలను త్యాగం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అమిత్ నారాయణ, అడిషనల్ ఎస్‌పి రమేష్, ఎస్.బి డిఎస్‌పిమల్లా రెడ్డి,డిఎస్‌పి శివరాం రెడ్డి,ఎ.ఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐలు రాఘవ రావు, రాము,మహాలక్ష్మయ్య, రాజశేఖర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, శ్రీను నాయక్,సురేష్,చంద్ర శేఖర్ రెడ్డి, ఆర్.ఐలు సంతోష్, శ్రీను, హరిబాబు, సూరప్ప నాయుడు,నరసింహ ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు,పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయ రాజు, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## స్నేహం పేరుతో మోసం

పరిష్కరించకపోతే ఆత్మహత్యే శరణ్యం

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : స్నేహాన్ని నమ్మి వ్యాపారం చేద్దామంటూ పెట్టుబడి పెడితే లెక్క తేల్చకుండా అమ్ముకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో హోటల్ క్యూ ముందు మంగళవారం పెట్రోల్ బాటిల్‌తో ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన ఇద్దరు వైద్యులు, ఓ ప్రైవేట్ వ్యక్తితోపాటు శ్యామల సందీప్ అనే బాధితుడు కలిసి హోటల్ పెట్టాలని నిర్ణయించుకొని ఓ డాక్టర్‌కి చెందిన భూమిలో రూ.2.20 కోట్ల భారీ పెట్టుబడితో హోటల్ నిర్మాణాన్ని చేపట్టారు. హోటల్ ప్రారంభంకు ముందే అన్ని అగ్రిమెంట్ చేసుకొని 2029 వరకు నలుగురికి సమాన హక్కులు ఉండేలా లీజు అగ్రిమెంట్ చేసుకున్నారు. కానీ హోటల్ అనుకున్న స్థాయిలో నడవకపోవడంతో నష్టం రాగా నిర్వాహకుల మధ్యలో భేదాభిప్రాయాలు వచ్చాయి. గుట్టుచప్పుడు కాకుండా మరో ముగ్గురు హోటల్‌ను అమ్మే ప్రయత్నాలు చేయడంతోపాటు హోటల్ ఉన్న ఫర్నీచర్ మొత్తం ఓ డాక్టర్‌కి సంబంధించిన ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించగా కొంత ఫర్నీచర్ సైతం అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయమై కోర్టు ద్వారా నోటీసులు అందించినా కోర్టుకు సెలవులు ఉన్న సమయంలో హోటల్‌ని పూర్తిగా కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా వాటాలు తెల్చకుంటే కుటుంబమంతా ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

# పత్తి రైతులు ఆధార్‌తో మొబైల్ నెంబర్ లింక్ చేసుకోవాలి

ఎ.ఓ సూరజ్ కుమార్

ప్రజాపక్షం/గుండాల: పత్తి రైతులు ఆధార్‌తో మొబైల్ నెంబర్ లింక్ చేసుకోవాలని, లేనిచో అప్డేట్ చేసుకోవాలని గుండాల మండల వ్యవసాయ అధికారి ఎ.ఒ. సూరజ్ కుమర్ తెలిపారు. కపాస్ కిసాన్ ఆప్ సి.సి.ఐ కి పత్తి అమ్ముకోవడంలో భాగంగా) వ్యవసాయ విస్తరణ అధికారి చేత ఇవ్వబడిన జాబితాలోని ప్రతి పత్తి రైతు ఆధార్‌తో లింక్ అయ్యిందో లేదో సరిగా ఉన్నదో లేదో ఒకసారి సరిచూసుకోవాలని తెలిపారు. పత్తి రైతులు పత్తిని అమ్ముకునే సమయంలో కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసేటప్పుడు పత్తి పంట వివరాలు కనిపించాలంటే ఆధార్‌తో మొబైల్ లింక్ ఉండాలన్నారు. పత్తిని అమ్ముకునే సమయంలో ఓటిపి కూడా రాదని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రైతులు ఆధార్ లింకు లేని యెడల మీ గ్రామానికి సంబందించిన రైతు వేదిక కార్యాలయాలలో వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి మొబైల్ నెంబర్‌ను అప్డేట్ చేసుకోవాలని ఏ.ఓ సూరజ్ కుమార్ తెలిపారు.

# మత్తుపదార్థాలు సేవిస్తూ, అమ్ముతున్న ఏడుగురు అరెస్ట్

రూ.30వేల విలువగల టాబ్లెట్లు స్వాధీనం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మత్తుపదార్థాలు స్పాస్మో టాబ్లెట్స్ సేవిస్తూ, అమ్ముతున్న 17 మందిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కేసు నమోదు చేసి వారిలో ఏడుగురిని అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి వెల్లడించారు. మంగళవారం డిఎస్పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దలనే లక్ష్యంతో, తెలంగాణ పోలీస్ పని చేస్తున్న విషయం మనందరికీ తెలిసిందే అన్నారు. అలాగే జిల్లాలో ఆపరేషన్ పరివర్తన్ ద్వారా చాలా మంది యువత ఆలోచనలో మార్పు తీసుకొచ్చేవిధంగా కృషిచేయుట జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగానే ఈనెల 20న తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సిబ్బంది వన్ టౌన్ పోలీసులు సంయుక్తంగా, నమ్మదగిన సమాచారం మేరకు, మునుగోడ్ రోడ్‌లో ఆకస్మిక వాహన తనిఖీ నిర్వహిస్తుండగా, పోలీసులను గమనించి మత్తు పదార్థాలు స్పాస్మో టాబ్లెట్స్ తీసుకొని ఒక మోటర్ సైకిల్‌పై పారిపోతుండగా, మహమ్మద్ జబీఉల్లాను వెంబడించి పట్టుకుని, విచారించగా తాను ఫ్రిజ్ మెకానిక్‌గా పనిచేస్తూ, గత ఐదు సంవత్సరాలుగా, మత్తు పదార్థాలకు బానిసై, వాటిని తీసుకోవడం ద్వారా ఒకరకమైన మత్తు కిక్కు వస్తుందని, తక్కువ ధరలో స్పాస్మో టాబ్లెట్స్ కొనుగోలు చేయవచ్చు అని అలవాటు చేసుకోగా, గత ఫిబ్రవరి 2024లో కూడా తనపై రెండు కేసులు అయి జైలుకు వెళ్ళి రావడం జరిగిందని తెలిపారన్నారు. తరువాత తిరుమలగిరి దగ్గర ఒక మిల్లులో పనిచేస్తూ, కష్టం చేయలేక 3 నెలల క్రితం మళ్ళీ టాబ్లెట్స్ గురించి వాకబు చేస్తూ, నల్లగొండలో పోలీసులు టైట్ చేస్తున్నారని, అవి ఇక్కడ దొరకకపోవడంతో మహబూబాబాద్ జిల్లా, తొర్రూరులోని వెంకటరమణ మెడికల్ స్టోర్ నిర్వాహకుడు అయిన దారం కృష్ణ సాయి వీటి గురించి అడిగి, ఎలాంటి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా టాబ్లెట్స్ ఒక్క షీట్‌ని 100 రూపాయల చొప్పున కొనుగోలు చేసి టౌన్‌లో టాబ్లెట్స్ సేవిస్తున్న వారికి అధిక రేటుకు ఒక్క షీట్ 200 రూపాయలకు అమ్మి లాభం గడించవచ్చు అని పథకం వేసి అతని దగ్గరికి బైక్‌పై వెళ్తూ దాదాపు 10 సార్లు కొనుగోలు చేసి నల్లగొండలో టాబ్లెట్స్ సేవించే వారికి అమ్ముతుండే వాడని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 19న తన బైక్‌పై తొర్రూరులోని వెంకటరమణ మెడికల్ స్టోర్‌కు వెళ్ళి అతని వద్ద సుమారు 18 షీట్లు కొనుగోలు చేసి మునుగోడ్ రోడ్‌లో టాబ్లెట్స్ వేసుకొనే అతడి స్నేహితులు అఫ్రోజ్, అహ్మెద్ అబ్దుల్ హఫీజ్ అలియాస్ ఖాజీమ్, ఓవైజ్, జావీద్ ఫరోజ్ ఒక్కొకరికి ఒక్క షీట్ 8 టాబ్లెట్స్ అమ్మి, మిగిలిన వాటిని టౌన్‌లో అమ్ముటకు తిరిగి బైక్ పై వస్తుండగా పోలీసులు పట్టుబడి చేయగా నేరం ఒప్పుకున్నాడని తెలిపారు. ఈ కేసులో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన టిజిఎన్ బిడిఎస్‌పి బి బిక్షపతిరావు, నల్లగొండ వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌ఐ సతీష్, గోపాల్ రావు, సిబ్బంది రబ్బని, షకీల్, ఆంజనేయులు, కిరణ్, నరహరి స్వామిలను టిజిఎన్ బి డైరెక్టర్ సందీప్ శాండిల్యా, జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ అభినందించారు.

## ‘ఇందూ’ ఫ్లాట్లు,విల్లాలకు రిజిస్ట్రేషన్ చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందూ ప్రాజెక్ట్‌లోని (కూకట్‌పల్లిలోని 555 యూనిట్లుబండ్లగూడలోని 524 యూనిట్లు) ఫ్లాట్లు, విల్లాలకు రిజిస్ట్రేషన్లకు చర్యలు తీసుకోవాలని ‘ఇందూ’ప్రాజెక్ట్ గృహ యజమానులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అరణ్యహరితలో ఇందూ ప్రాజెక్ట్ యజమానుల సమావేశం జరిగింది.ఫ్లాట్లు,విల్లాలరిజిస్ట్రేషన్లవిషయంలోపదేళ్లుగా జరుగుతున్న జాప్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. 2006లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులు అనేక సంవత్సరాలు నిలిచిపోయి, కొంతభాగం మాత్రమే2016నాటికి పూర్తయిందని, కొత్త మేనేజ్‌మెంట్‌బాధ్యతవహించేందుకునిరాకరించిందనియజమానులు తెలిపారు.



























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com